# యమగీత



మాస్టర్ పార్వతీకుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# యమగీత

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2019

ప్రతులు : 1,000

© ధనిష్ఠ - 2019

వెల : రూ॥ **80-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-35-7

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
మధురానగర్, విశాఖపట్నం.
ఫోన్ : 0891-2796538, 984 999 6538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

యమగీత అను ఈ ప్రచురణము యమదేవుడు నచికేతునకు ఆదరముతో తెలిపిన మరణ రహస్య సూత్రములు. డెబ్బది (70) సూత్రములుగ 'కఠోపనిషత్' యందు ఇవి గోచరించును. మరణమును గూర్చిన రహస్యమును తెలుపమని నచికేతుడు ప్రార్థింపగ, యముడీ సూత్రముల నిచ్చినట్లు ఉపనిషత్ తెలుపుచున్నది. మానవులకు ఈ రహస్యము తెలియుట ముఖ్యము. మరణమును దాటుటకు ప్రతి మానవుడు ఉత్సహించును. కాని మరణమునకు అతీతమైన స్థితిని చేరినవారే దీనిని తెలుపగలరు. మరణదేవతయే తెలిపినపుడు అది పరాకాష్ఠగ స్థితి గొనును.

మార్కండేయుడు, సావిత్రీదేవి, నచికేతుడు అను మూడు ఉపాఖ్యానములు మరణ రహస్యమును తెలుపు ఉపాఖ్యానములు. భగవద్గీత, సనత్సుజాతీయము, అష్టాంగ యోగవిద్య కూడ ఈ

ఉపాయమును తెలుపునటువంటి ఉద్గ్రంథములే. భాగవత పురాణ ప్రయోజనము కూడ మరణమును దాటించుటకే. భారతీయ వాఙ్మయమున అమృతత్వము, మరణాతీత స్థితి, దానిని పొందు ఉపాయములు తరచుగ చెప్పబడుచుండును.

'మరణ రహస్య' మను శీర్షికగ ఇప్పటికి మూడు ఉపాఖ్యానములు 'ధనిష్ఠ' అందించినది. అవి వరుసగ మార్కండేయుని కథ, సతీసావిత్రి కథ, నచికేతుని కథగ ప్రచురింపబడినవి. ఈ 'యమగీత' అను ప్రచురణము ఈ శీర్షికకు చరమగీతము వంటిది. ఇందు నిర్దిష్టమగు సాధనా విధానము అందింపబడినది. యమదేవుడే మరణము యొక్క స్వరూప స్వభావములను, దాని నధిగమించు విధానమును బోధించినాడు.

క్షరమగు దేహము నుండి అక్షరమగు అంగుష్ఠమాత్ర పురుషుని నిర్మాణము చేసుకొనుట ఇందు ప్రత్యేకముగ సూచించబడినది. పాల నుండి వెన్న తీసినట్లు, పొట్టు నుండి గింజను తీసినట్లు, కాయనుండి పప్పును వేరుచేసినట్లు, ముంజగడ్డి నుండి ఈనెను తీసినట్లు- రక్తమాంసాదులతో కూడిన ఈ క్షరమగు దేహము నుండి అక్షరము, సూక్ష్మము, కాంతివంతమగు దేహమును సాధనాపరముగ తయారు చేసుకొనువాడు చిరంజీవియై వర్థిల్లును. అమృతత్త్వమును పొందును. యమదేవుని బోధన సారాంశమిది.

అట్లు అమృతత్వమును పొందిన జీవుడు శరీరమును ధరించుట, విసర్జించుట- వస్త్రధారణము, విసర్జనమువలె జరుగును. అట్టి వానికి పుట్టుట, చచ్చుట అను యాతనలుండవు. యోగ మార్గమున ధారణ, ధ్యాన స్థితులను పొందిన వారికి ఇది అవగతమగును. రాజర్షులే అట్టి మార్గము నీయగలరు. ఈ పుస్తకమున యమదేవుని బోధ వివరముగను, నిత్యసాధన కనుకూలముగను, శ్లోకపరముగను వివరింపబడినది.

ఈ ముద్రణమును సమర్పించిన శ్రీ **జనుంపల్లి రామేశ్వరయ్యగారి కుటుంబమునకు శుభాశీస్సులు!**

తేది : 4-8-2019 **- పార్వతీకుమార్**

# యమగీత

# ①

***నచికేతుడు :***

యమదేవా! మానవుడు మరణించాక అత డున్నాడని కొందరు, లేడని కొందరు భావిస్తూ ఉంటారు. వాదిస్తూ ఉంటారు కూడ. నీవు మరణదేవతవు. ఈ విషయంలో దేవతలకు కూడ సందేహమున్నది. ఇది చాలా సూక్ష్మమైన విషయము. నీవు తెలిపితే గాని ఈ రహస్యము తెలియదు. నా యందు దయతో ఈ అతి సూక్ష్మమైనటువంటి సత్యము వివరించుము. స్ఫూర్తితో గ్రహింతును.

***యమదేవుడు :***

**శ్లో॥ న నరేణ అవరేణ ప్రోక్త ఏష**
**సువిజ్ఞేయో బహుధా చింత్యమానః ।**
**అనన్యప్రోక్తే గతిరత్ర నాస్త్య**
**ణీయాన్ హ్యతర్క్యమణుప్రమాణాత్ ॥** (2–8)

*వివరణ :* ఉన్నది ఈ లోకమే, మరొక లోకము లేనే లేదు అనుకొనేవాడు మళ్లీ మళ్లీ మరణిస్తూ, పుడుతూ ఉంటాడు. వీరందరు నా అధీనంలోనే ఉంటారు. వీరికి శ్రేయస్సనగా ఏమో తెలియదు.

## (2)

**శ్లో॥ నైషా తర్కేణ మతిరాపనేయా**
**ప్రోక్తాన్యేనైవ సుజ్ఞానాయ ప్రేష్ఠ ।**
**యాం త్వమాపః సత్యధృతిర్బతాసి**
**త్వాదృజ్ నో భూయాన్నచికేతః ప్రష్టా ॥** (2-9)

మరణం గూర్చి, దాని రహస్యమును గూర్చి వినడం కూడ అందరికీ సాధ్యపడదు. వినినవాడు కూడ ఈ రహస్యాన్ని గ్రహించ లేడు. వినగోరు శిష్యుడు అద్భుతము, అసామాన్యము అయిన బుద్ధి తీక్షణత కలిగినవాడై ఉండాలి. బోధించే గురువు కూడ మరణ రహస్యం తెలిసినవాడై ఉండాలి. మరియు బోధించుట వలన తెలియ వలసినదే గాని మరొక దారి లేదు. ఇది మనోతర్కానికి లొంగదు. కేవలము సత్యవంతులకే ఇది బోధింపబడాలి. సత్యవంతులే దీనిని గ్రహింపగలరు.

## ③

**శ్లో॥ తం దుర్దర్శం గూఢమను ప్రవిష్ఠం**
**గుహాహితం గహ్వరేష్ఠం పురాణమ్ ।**
**అధ్యాత్మ యోగాధిగమేన దేవం**
**మత్వాధీరో హర్షశోకౌ జహాతి ॥** (2-12)

శరీరంలో నున్న హృదయ పద్మంలో ఆసీనమైయున్న, జ్యోతిర్మ యముగ గోచరిస్తున్న అంతరాత్మను ధ్యానదీక్షతో సాక్షాత్కరించు కోవటం ప్రథమ కర్తవ్యం.

*వివరణము :* హృదయ పద్మం మారేడు దళమువలె మూడు దళములు ఒక కోశముగ, నాలుగు కోశములలో అమర్చబడి యున్నది.



ఆ నాలుగు కోశములు వరుసగా అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞాన మయ కోశములుగా తెలియవచ్చును. దాని కాధారమైన కర్ణిక యందు ఆనందమయ కోశమున జ్యోతిస్వరూపముగ అంతరాత్మ దర్శన మౌతుంది. దీనిని దర్శించడానికే ఋషులు, మునులు తపస్సు చేస్తూ ఉంటారు.

④

శ్లో॥ ఏతచ్ఛ్రుత్వా సంపరిగృహ్య మర్త్యః
ప్రవృహ్య ధర్మ్యమణుమేతమాప్య ।
స మోదతే మోదనీయం హి లబ్ధ్వా
వివృతం సద్మ నచికేతసం మన్యే ॥ (2-13)

జ్యోతిర్మయమైన అంతరాత్మ సూక్ష్మాతి సూక్ష్మమై గోచరిస్తుంది. దానిని చక్కగా గ్రహించి పొందుట సాధకుని విధి. అట్టి వానికి మోదము సహజముగ నుండును. నచికేతా! నీకిది తెలిసిన విషయమే కదా!

*వివరణము :* అంతరాత్మను ధ్యానించుట, దర్శించుట, సాక్షాత్కరింప జేసుకొనుట, దానిని పొందుట ప్రథమ కర్తవ్యం. అట్టి ధ్యానమునకు స్వభావము పూర్ణముగ సహకరించవలెను. స్వభావమున సత్యము, ధర్మము స్థిరముగ నున్నచో వలసిన సహకారము లభించును. అట్టి వానికే ప్రాణాయామము, ప్రత్యాహారము సిద్ధించును. ప్రత్యాహారము స్థిరపడినపుడు అంతర్దర్శనము సాధ్యపడి, ఆనందము జనించి సాధకుడు మోదస్థితి చేరును. అట్టి మోదస్థితి చేరిన సాధకుని మోదకు

డందురు. అట్టి మోదకుడు గణపతికి ప్రియుడు. గణపతిని 'మోదక ప్రియాయ నమః' అని సేవిస్తూ ఉంటారు గదా!

అంతర్జ్యోతి దర్శనమున ఏర్పడు ఆనందము నిష్కారణము. అది శరీరము, ఇంద్రియములు, మనస్సు పొందు సుఖములాంటిది కాదు. అందు నిశ్చలమైన ప్రశాంతి యుండును.

ఇట్టి స్థితి నచికేతుడున్న స్థితియే. నచికేతుని యిట్టి ఉత్తమ స్థితిని యమదేవుడే ధృవీకరించినాడు.

## 5

**శ్లో॥ సర్వే వేదా యత్పదమామనంతి**
**తపాంసి సర్వాణి చ యద్వదంతి ।**
**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి**
**తత్తే పదం సంగ్రహేణ బ్రవిమ్యోమిత్యేతత్ ॥**

(2-15)

ఓ నచికేతా! నీవు కోరిన మరణానంతర స్థితి తెలియుటకు నీ వున్న హృదయ కర్ణికయందలి ఓంకారమును వినుటవలన లభ్యము కాగలదు. అదియే శబ్ద బ్రహ్మము. అదియే తపస్సుల గమ్యము. దానినే అన్ని వేదములు ఘోషించుచున్నవి. దానిని కోరియే సాధువులు బ్రహ్మచర్య నిష్ఠను అవలంబించు చున్నారు. శబ్దమునకు మూలము అందులోనే యున్నది. అది అవ్యక్తంగా అందరి యందున్నది. అది వ్యక్తమగుటకు హృదయ పద్మము మూలములోనికి జిజ్ఞాసువు చేరు ప్రయత్నము చేయవలెను. దానిని విను ప్రయత్నము చేయుము.

*వివరణము :* ద్వాదశాక్షరీ మంత్రము అగు *"ఓం నమో భగవతే వాసుదేవాయ"* మరియు 'క' నుండి 'ఠ' వరకు గల పండ్రెండు (12) అక్షరములు ఓంకారమే మూలముగ నున్నవి. ఈ ద్వాదశా

క్షరములను ఉచ్చరించుచు, ద్వాదశ దళములను దాటి అనాహత పద్మమందలి అనాహత శబ్దమును వినుట యమదేవు డందించిన ఉపదేశము. ఓంకార నాదమే అచట నిర్వర్తింపబడుచున్నది. అది ఆధారముగనే అన్ని అక్షరధ్వనులు, పదములు, భావములు, ప్రాణ స్పందన ఏర్పడుచు నున్నవి. అట్టి ఓంకారమును ఉచ్చరించుట ప్రాథమికము. ఉచ్చరించకున్నను జరుగుచున్న ఓంకారమును విన గలిగిననాడు జీవునకు తాను మరణానంతరము, జనన మరణము లకు పూర్వము కూడ ఉన్నాడని తెలియును. దానికి వలసినది అంతర్ముఖ మగుట. తన లోనికి తాను చొచ్చుకొనిపోవుట, తన మూలమును తాను స్పర్శించుట. ఓంకారమును వినగలిగిననాడు దేహాత్మ భావము సడలి, ఆత్మభావ మావిష్కరింపబడును. అట్టి ఓంకారము వినగలుగుట నిజమగు సిద్ధి. ఇది చెప్పినంత మాత్రమున అనుభూతము కాదు. ఎవరికి వారుగా అంతర్ముఖమున తెలియ వలసినదే. ఇదియే కఠోపనిషత్తుయందు యముడు ఉపదేశించిన రహస్యము లేక మరణ రహస్యము.

మనో ప్రజ్ఞను శ్వాసపై నిలిపి, స్పందనమును చేరి, సూక్ష్మ స్పందనము లోనికి ప్రజ్ఞను ప్రవేశింపజేసినచో, అట్టి సూక్ష్మ స్పందనాత్మకమగు ప్రజ్ఞకు ఓంకారము వినబడగలదు. దానియందు రమించువానికే మరణము దాటి తానున్నానని తెలియుట సంభవించును.

## 6

**శ్లో॥ ఏతద్ధ్యే వాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యే వాక్షరం పరమ్ ।**
**ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్ ॥**

(2-16)

ఓంకారమే నిజమగు అక్షరము. నాశము లేనిది. ఓంకారమే బ్రహ్మము. ఓంకారము మాత్రమే పరమును చేర్చును. మృత్యువు దాటిన స్థితిని తెలియుటకు ఓంకారమే మార్గము.

*వివరణము :* ఓంకారము తెలియని భారతీయుడు దాదాపుగ నుండడు. ప్రస్తుతము మానవజాతి అంతయు ఓంకారము నెరిగి యున్నది. కాని ఓంకార మనుభవించు మానవుడు చాల అరుదు. ఓంకారమును వినగలుగుట నేర్చినవాడు మరణాతీత స్థితిని గూర్చి తెలియగలడని యమదేవుడు పలికినాడు. ఆత్మానుభూతికై ఆత్మసాధన యనుచు భౌగోళికముగ వేలాది ప్రక్రియలు సాముగరిడీలవలె ఎందరో నిర్వర్తించు చున్నారు. ధ్యానము పేరున అమితమగు వ్యాపారము సాగుచున్నది. కాని ఓంకారముతో కూడుట, అట్లు కూడి ధ్యానము చేయుట ఎవ్వరును చేయజాలకున్నారు. ఇది విచిత్రము. కలి ఇంద్ర జాలమున పడి అనేకానేక వికారపూరిత మగు కార్యక్రమములు ఆత్మసాధన పేరున సాగుచున్నవి.

శ్రీకృష్ణుడు భగవద్గీత యందు అక్షరము, పరము అయిన బ్రహ్మమును చేరుటకు ఓంకారమునే ఉపాయముగ తెలిపినాడు. ఇంద్రియములను మనస్సున సమన్వయించి, మనసును హృదయ మున స్థాపించి, ప్రాణస్పందన అందించు స్పందన శబ్ద మాధారముగ శిరస్సుచేరి, అటుపై ఓంకారము ననుసంధానము గావించుకొని, శరీరము నందుండి కూడ విడిపడి, తనకు తానెట్లున్నాడో తెలియ వచ్చునని కృష్ణపరమాత్మ భగవద్గీత ఎనిమిదవ అధ్యాయమందలి 12, 13 శ్లోకములలో తెలిపియున్నాడు.

శ్వాస, ప్రాణ స్పందనము ఆధారముగ తన యందలి ప్రణవమును వినుటవలన విదేహ స్థితి అనుభూతమగును. అనగా దేహ స్మృతి లేక తానుండుట తనకు స్పష్టముగ తెలియును. అట్టి వానికి దేహము లేకున్నను తానున్నాడని రూఢిగ తెలియును.

తిన్నవాడికే రుచి తెలియును. కనుక రుచి తెలియుటకు తినుటయే ఉపాయము. తినకుండ రుచి తెలియు మార్గము లేదు. అట్లే ఓంకారాను సంధానమున మాత్రమే మరణానంతర స్థితి ఉన్నది లేనిది స్పష్టముగ తెలియును. అట్టి స్థితి యున్నదని రుచి చూచినవారు పదే పదే తెలుపుచున్నారు. మనకుగ తెలియుటకు తెలిపిన మార్గము ననుసరించుటయే ఉపాయము.

పై విధముగ ఓంకారము నెరిగిన వానికి సర్వము సిద్ధించునని కూడ యమదేవుడు రూఢిగ తెలుపుతున్నాడు. *"యద్ ఇచ్ఛతి తస్య తత్"* అని పలికినాడు.

## 7

శ్లో॥ ఏతదాలంబనం శ్రేష్ఠమేతదాలంబనం పరమ్ ।
ఏతదాలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే ॥

(2-17)

నచికేతా! జీవునకు ఆలంబనములు అనేకములు గోచరించును. అందత్యంత శ్రేష్ఠమైన ఆలంబనము 'ఓంకారము'. అది ఒక్కటియే నిజమగు ఆలంబనము. ఈ ఆలంబనమును పొందినవాడు బ్రహ్మలోకమున పూజింపబడతాడు.

*వివరణము :* కొందరు దేహము ఆలంబన మనుకొందురు. కొందరు ధన మాలంబన మనుకొందురు. మరికొందరు కుటుంబము ఆలంబనముగ భావింతురు. వార్ధక్యమున భార్యకు భర్త, భర్తకు భార్య ఆలంబనమని భావింతురు. నడువ సత్తువ లేని సమయమున చేతికర్ర ఆలంబన మనుకొందురు. కొందరు ఆరోగ్యము ఆలంబనముగ జీవితమును మలచుకొనుచుందురు.

మరణ సమయమున ప్రాణము కూడ ఆలంబనము కాదు. ఇక యితర ఆలంబనములు ఏమి నిలువగలవు? ప్రాణములకు గూడ ప్రణవమే ఆలంబనము గనుక, ప్రణవము నాశ్రయించుట

అత్యుత్తమము. ఇతరము లేవియు మరణమును దాటించలేవు. ప్రణవమును నిశ్వాసమార్గమున వినుచు, ప్రజ్ఞను శిరస్సును దాటించు ప్రయత్నము అభ్యసింపవలెనని పరమాత్మయే భగవద్గీతయందు తెలిపినాడు. సమవర్తి, మరణదేవత యగు యముడు గూడ ప్రణవమే ఉపాయమని తెలిపినాడు. ఓంకారమును అనుస్మరణ చేయుట అనగా ఉచ్చరించుట కాదు, వినుట. నిశ్వాస మార్గమున ఓంకారమును వినుచు ప్రజ్ఞను ఊర్ధ్వగతి పట్టించుట సాధన. అట్టి ప్రజ్ఞ శిరస్సును కూడ దాటి బ్రహ్మరంధ్రము ద్వారా ఊర్ధ్వమున కేగినపుడు, బ్రహ్మలోక వాసులు కూడ అట్టి తపస్విని పూజ్యభావముతో చూతురు. ఇది సత్యము.

కనుక ఓంకారము ఏకదాలంబనమని తెలిసి, దాని ననుస్మ రించుచు ఊర్ధ్వమున కేగుట, మరణ రహస్యము తెలియుట ఉపాయము. ప్రతి జీవియు తనకు అంతమునకు ఆలంబనము ఓంకారమును వినుటయే అని తెలియవలెను. స్వర్గలోకము కూడ ఆలంబనము కాదు. ఓంకారమే జీవునకు నిజమగు ఆధారము. ఓంకారమే నిజమగు బలము. ఓంకారమే మరణ విజ్ఞానమును ప్రసాదించును.

(8)

శ్లో॥ న జాయతే మ్రియతే వా విపశ్చి
న్నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్ ।
అజో నిత్యః శాశ్వతోయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ (2-18)

ఓంకారమును ఆలంబనముగగొని శిరస్సును దాటిన వానికి ఆత్మ అననేమో తెలియును. అట్టి జ్ఞానము వలన తాను పుట్టడని, మరణించడని కూడ తెలియును. తానెచ్చట నుండి రాలేదని, ఎచ్చటికిని పోడని, శాశ్వతముగ నుండువాడని, సనాతనుడని తెలియును. తనకు శరీరము వచ్చి పోవుచుండునని తెలియును.

*వివరణము :* వచ్చిపోవునవి ప్రకృతి ఆవరణలు. అవి ఆత్మ చుట్టును ఏర్పడుచు పోవుచు నుండును. వచ్చుట, వృద్ధి చెందుట, తిరోధానము చెందుట, పోవుట అనునవి ప్రకృతి లక్షణములు. ఆత్మ ఎప్పుడునూ యున్నది. ఆత్మ శాశ్వతమైనది. జీవాత్మ తనను ఆత్మగ భావన చేయవలెను. కాని అజ్ఞానము వలన తన రూపము, తన నామము, తన గుణములు తానని భావించుచు హానివృద్ధులు చెందుచు నున్నాడు. హానివృద్ధులు, జనన మరణములు తనకు లేవు. తనకేర్పడిన

వానికుండును. అవి తనపై ఆధారపడి జన్మించి, వృద్ధి చెంది, బలహీన పడి అదృశ్యమగుచు నుండును.

ఆత్మగ తాను బాలుడు కాదు, మధ్యవయస్కుడు కాదు, వృద్ధుడు కాదు. అవియన్నియు శరీరమునకు వర్తించును. తనకు వర్తింపవు. అవి ఉన్నను, లేకున్నను తానున్నాడని తెలియుటయే జ్ఞానము. అట్టి జ్ఞానము లోపించుట వలననే మరణము వున్నదని భావించును. జననమే లేని వానికి మరణమెట్లుండును? జనించిన వాటికే మరణ ముండును. దుస్తులు ధరించినపుడు తానున్నాడు. ధరించనపుడు కూడ యున్నాడు. దుస్తులు విసర్జించినపుడు కూడ తానున్నాడు. వచ్చిపోవు దుస్తులవంటివే తన చుట్టును ఉన్న ఆవరణములు. వచ్చి పోవునవి ఏవియో, ఎప్పుడునూ ఉండునవి ఏవియో తెలియవలెను. తానెప్పుడూ ఉన్నాడని తెలియుటకు, తన యందలి ఓంకారమును వినుచు, ఊర్ధ్వమునకు ఏగవలెను. అట్లుకానిచో, తాను కూడ వచ్చి పోవువాడే అను భ్రాంతిన పడును.

ఉదాహరణకు వచ్చిపోవుచున్న అలలయందు యున్న సముద్రము ఎపుడునూ యున్నది. అలలే వచ్చిపోవు చుండును. తన నిజస్థితి తనకు చక్కగ తెలియుటకు ఇట్టి విచార మావశ్యకము. విచారము చేయనివానికి సత్యము తెలియదు.

## (9)

**శ్లో॥ హంతా చేన్మన్యతే హంతుం హతశ్చేన్మన్యతే హతమ్।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥**

(2-19)

చంపుచున్నవాడు, చంపబడినవాడు, తాను చంపితినని, తాను చంపబడుచున్నాడని భావించుట సర్వసామాన్యము. కాని అందు సత్యము లేదు.

*వివరణము :* ఇట్టి శ్లోకములు భగవద్గీతయందు కూడ గోచరించును. చంపుట, చచ్చుట అనునవి శాశ్వతుడగు జీవునకు వర్తింపవు. అతని చుట్టును ఏర్పడిన ఆవరణలకు వర్తించును. మూడు గుణములు, ఐదు భూతములతో కూడిన ఎనిమిది ఆవరణలతో మానవు డున్నాడు. ఈ ఎనిమిదింటికిని హాని వృద్ధులున్నవి. పుట్టుక, చావు ఉన్నవి. కాని జీవునకు లేవు. పుట్టుట, పెరుగుట, తరుగుట, చచ్చుట అనునవి లేవు. ఈ సత్యము గోచరించుటకు తాను ఆత్మనని బాగుగా గుర్తుండవలెను. నిత్యము గుర్తు తెచ్చుకొనుచుండ వలెను. తనయందు తానుండక, జీవాత్మ తన ఆవరణలతో ముడిపడి ఆవరణలే తాననుకొనును. తాను ధరించినవి మరణించినను, తాను మరణింప

దని తెలియవలెను. తన దుస్తులు చిరిగినచో తాను చిరగడు కదా! అట్లే పంచకోశములతో ఏర్పడిన శరీరమును, దానిని నడిపించు త్రిగుణములు మార్పు చెందుచున్నను, తాను తానుగనే యుండ వచ్చును.

నాటకమున నటుడు పాత్రధారణము, వేషధారణము చేయును. ఉదాహరణకు అర్జునుని పాత్రధారణము తదనుగుణమగు వేషధారణము తాను చేసినను, నటునకు తానెవ్వడో తెలిసియుండును. తాను ధరించిన పాత్ర తాను కాదని తెలిసియుండును. అట్లే జీవిత రంగ మున జీవుడు స్త్రీగను, పురుషుడుగను, ఒక మతస్థునిగను, కులస్థుని గను, ఒక వృత్తి ధర్మమును నిర్వర్తిస్తున్న వానిగను చేయుచున్న దంతయు వేషధారణమే. నామము, రూపము, సంఘమందలి గుర్తింపు వేషధారణమే. తాను, తాను ధరించిన వేషముకన్న భిన్నముగ నున్నాడు. ఈ సత్యమును మరచుటయే మృత్యువు. జ్ఞప్తి యున్నచో మృత్యువు లేదు. నచికేతునికి ఈ సత్యము స్పష్టమై నిలచినది. మనకును నిత్య స్మృతివలన సత్యమై నిలుచును. ఇది నిస్సందేహము.

## ⑩

**శ్లో॥ అణోరణీయాన్ మహతో మహీయా**
**నాత్మాస్య జంతోర్నిహితం గుహాయామ్ ।**
**తమక్రతుః పశ్యతి వీతశోకో**
**ధాతుప్రసాదాన్మహిమానమాత్మనః ॥** (2-20)

నచికేతా! ఆత్మ అణువుకన్న సూక్ష్మమైనది. మహత్తుకన్న పెద్దది. ప్రాణమునకు మూలమైనది. గుహ్యముగ నుండునది. అత్యంత మరుగుగ నుండునది. అది ప్రాణమునకు దేహమునకు సమస్తమునకు మూలముగ నున్నది. దీనిని తెలియుటకు లేక దర్శించుటకు లేక గ్రహించుటకు ధాతువులు అత్యంత పవిత్రము, ప్రశాంతము అయి ఉండాలి. కోరికలు, శోకము అంటనివాడై యుండాలి.

*వివరణము :* కోరికలు, శోకము లేనివాడు, సప్తధాతువులు పవిత్రముగను, ప్రశాంతముగను నున్నవాడు మాత్రమే జనన మరణా తీతమగు ఆత్మను తెలియుటకు అర్హత కలవాడు. "ఆత్మానుష్ఠానము" అను పదమును వాడుటకు అర్హత గలవారు అరుదు. ప్రతివారును ఈ పదమును వాడుట పసితనము. సమవర్తియగు మరణదేవత 'అక్రతుః' అను పదము వాడుటలో చాల గాంభీర్యమున్నది. కోరికలతో చేయు కార్యములు, క్రతువులు ఏ కోరికలు లేకుండుట అక్రతు స్థితి.

తన కోసమని ఏమియు చేయనివాడు, ఇతరుల కొరకు ఏమి చేయుటకైనను సంసిద్ధపడువాడు అక్రతుడు. అట్టివాడు సంకల్ప సన్యాసి. అతడు ఏ ఫలమును తనకొర కాశింపక నిత్యము కార్యము లందుండును.

కోరికలు లేనివానికి శోకముండదు. ఎంత కోరినచో అంత నిరాశ, దుఃఖము కలుగుచు నుండును. శోకమునకు మూలము కోరికయే. కోరిక మోహమును కలిగించును. మోహము శోకమును కలిగించును. కోరికే లేనినాడు శోకమునకు తావు లేదు. కనుక అక్రతుడైనవాడు మాత్రమే వీతశోకుడు– శోకము లేనివాడు అగును. ఈ రెండు గుణము లెవనియందు భాసించునో వారియందు సప్త ధాతువులు పవిత్రముగను, ప్రశాంతముగను యుండును. సప్త ధాతువులు ప్రశాంతముగ యుండుట అనగా కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి ప్రశాంతమై యుండుట. పవిత్రత వలన ప్రశాంతత లభించును. ప్రశాంతత వలన తనయందు నిగూఢముగ నున్న తన మూలమును దర్శింపవచ్చును. మూలమున నున్నది తానే. తానాత్మగ నెట్లున్నాడో అప్పుడు గ్రహించుటకు వీలు పడును. ఆత్మనెరిగిన వానికి ఆత్మ మహిమ తెలియును. అవధులులేని తత్త్వముగను, సూక్ష్మాతి సూక్ష్మమగు తత్త్వముగను ఆత్మను తెలియుట జరుగును. ఇట్లు ఆత్మయొక్క స్థితిని చేరు ఉపాయమును యమదేవుడు తెలిపినాడు. ఇట్లు తెలిసినవానికి జనన మరణముల పేలవత్వము తెలియగలదు.

(11)

**శ్లో॥ ఆసీనో దూరం వ్రజతి శయానో యాతి సర్వతః ।**
**కస్తం మదామదం దేవం మదన్యో జ్ఞాతుమర్హతి ॥**

(2-21)

ఆత్మ కూర్చొనివున్నను సుదూర ప్రయాణము చేయగలదు. పడుకొని ఉన్నను సకల ప్రదేశములకు పోగలదు. ఆనంద స్వరూపమైన ఆత్మ స్వేచ్ఛా స్వాతంత్ర్యములను అనుభవిస్తూనే నిర్లిప్తముగ అందరియందు వర్తిస్తూ యున్నది. నేను తప్ప ఆత్మను తెలియగలవాడు మరొకడు లేడు.

*వివరణము :* యమదేవుని ఈ ఉపదేశం చిత్రమైనది. నేను తప్ప జ్యోతిర్మయమగు, ఆనందమయమగు ఆత్మను ఎవరెరుగ గలరు? అని పలికినాడు. తాను తప్ప ఎవరూ తెలుసుకోలేనిది నచికేతునికి, మనకు తెలియజేయడంలో ఉపయోగమేముంది? చిత్రమేమంటే "నేను" తప్ప అని పదప్రయోగము చేసినపుడు, ప్రతిజీవుడును "నేను"గనే తెలియగలడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడుకూడ "నేను, నేను" అని పదే పదే పలుకుతాడు. జీవులందరూ కూడ 'నేను' స్వరూపులే. 'నేను - తాను'గా నున్న ప్రజ్ఞకు నామ రూపము లున్నవి. స్థితిగతులు

కూడ యున్నవి. అవిలేకున్నను ప్రజ్ఞ తానుగ ప్రకాశిస్తూనే యుంటుంది. తనపై ఆధారపడిన నామ రూపములు, స్థితిగతులు, తనకేర్పడిన ఆవరణలు తనకన్న గొప్పవి కావు. నేనను ప్రజ్ఞ స్వాలంబనముగ యున్నది. సహజముగ తేజోమయముగ నుండునది నేనను ప్రజ్ఞ. అది ఆనందస్వరూపము. దానికి దేహపరిమితులు లేవు. తానుగ ఎచటికైనను పోగలదు. మితముగను, అమితముగను కూడ నుండగలదు. ఈ నేనను మూలప్రజ్ఞను మరచినపుడు, దాని చుట్టు ఏర్పడిన చిల్లర ప్రజ్ఞలు అల్లరి చిల్లరగ వర్తిస్తూ ఉంటాయి. అట్టి స్థితిలో నిద్రాణముగ, మౌనముగ, నిశ్చలముగ, నిహితముగ ఉంటుందని తెలుపడానికే ఆనందరహితముగ కూడ నుండునని చెప్పడం జరిగింది. ప్రతి సాధకుడు 'నేను'గ అనిర్వచనీయుడు. తనను గూర్చిన నిర్వచనమే తనకు పరిమితత్వ మేర్పరచును. ప్రతి ఆత్మ సాధకుడును తన అనిర్వచనీయ స్థితిని మరల మరల గుర్తు తెచ్చు కొనుట ద్వారా మాత్రమే తనను తానెరుగ గలడు. తనను తాను ప్రథమ పురుషునిగ ఎరుగుటయే ఈ శ్లోకమున మరణదేవుడు హెచ్చరించుచు నున్నాడు.

## ⑫

**శ్లో॥ అశరీరం శరీరేష్వనవస్థేష్వ వస్థితమ్ ।**
**మహాంతం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి॥**

(2-22)

శాశ్వతమగు నేనను ప్రజ్ఞ అశాశ్వతమైన శరీరంలో ఉన్నట్లు గోచరించినను, నిజమునకు 'నేను' శరీరమునకు పరమైనది. స్వేచ్ఛా విహార లక్షణము గలది. ఇట్టి నేను తానే అని తెలిసినవాడు ఆత్మ వంతుడు. అట్టి ఆత్మవంతుడే ధీరుడు. కనుక శోకము లేనివాడు.

*వివరణము :* ప్రతి మానవుడును తనను గూర్చిన విచారము నిత్యము చేయవలెను. తాననగ మార్పు చెందుచున్న తన శరీరము కాదు గదా! తన నామము కూడ తాను కాదు. తన స్థితిగతులు తాను కాదు. నామము, రూపము లేక తానెట్లుండునో విచారింప వలెను. ఊహింపవలెను. తాను తల్లి గర్భమున చేరిన తరువాతే ఒక క్రమమున తనకు రూప మేర్పడినది. అటుపైన నామ మేర్పడినది. ఇట్లేర్పడక ముందు కూడ తానున్నాడు. తానుండబట్టియే రూపము, నామములు కలిగినవి. ఈ తాను, నేను అను ప్రజ్ఞ నిజముగ ఎట్లు ఉండవచ్చును అను ఊహ నిత్యము చేసినచో తాను శరీరుడు కాదని,

తనవల్ల శరీర మేర్పడినదని తెలియును. శరీరమునందు లేనపుడు కూడ తానున్నాడు. శరీర మేర్పడినపుడు కూడ తానున్నాడు. పక్షి గూడు అల్లుకొనునట్లు, తన శరీరము తానల్లుకొని, అందులో వసించుచు నున్నాడు. పక్షి గూడునొదలి, పగలంతయు స్వేచ్ఛా విహారము చేసి రాత్రికి గూడు చేరినట్లు, తానును శరీరమునకు విశ్రాంతినిచ్చి, తానుగ స్వేచ్ఛా విహారము చేయగలవాడే. అల్లుకొనిన గూడు పక్షిని బంధింపదు గదా! అట్లే తన శరీరము తనను బంధింపదు. దానియందుండుట, లేకుండుట అను స్వేచ్ఛ తనకున్నది. ఇట్లు తెలియుట జ్ఞానము. ఇట్లు వర్తించువాడు జ్ఞాని. అతడే ఆత్మ వంతుడు. అతడే ధీరుడు. అట్టి వానికే శోకముండదు. అట్టి వానికి మరణమను అవస్థితి లేదు. గాలివానకు గూడు నశించినను పక్షి నశించదు. మరియొకగూడు కట్టుకొని జీవనము సాగించును. ఇట్టి సత్యమును తెలియుటకు అనునిత్యము ఆత్మవిచారము ఆవశ్యకమై యున్నది.

'నేను' అనగా శరీరమందు వసించుచున్న ప్రజ్ఞయేగాని, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములతో, మనసుతో, పంచప్రాణములతో, పంచభూతములతో తయారుచేయబడిన తన రూపము కాదు. తానాధారముగ అవి యున్నవి. అవి ఆధారముగ తాను లేడు. తన కాధారమైనది ప్రణవమే. అదియే తన కాలంబనము. ప్రతిదినము ఈ విచారమును మూడు నుండి ఐదుమార్లు నిర్వర్తించుకొనువాడు కృతకృత్యుడు కాగలడు. అట్టివానికే తన నిజస్థితి తెలియగలదు.

(13)

శ్లో॥ నాయమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా న బహునా శ్రుతేన ।
యమేవైష వృణుతే తేన లభ్య
స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్ ॥

(2-23)

నచికేతా! స్వాధ్యాయ ప్రవచనములచేత గాని, వేదాధ్యయనము చేత గాని, మేధోశక్తి వలనగాని, సమస్త వాఙ్మయమును పఠించుట చేతగాని ఆత్మ లభ్యము కాదు. ఆత్మ ఎవనిని వరిస్తుందో, అతని చేతనే పొందబడుతుంది తప్ప, ఇతరులకు లభ్యము కాదు. తనను వరించిన వానికి తానే స్వయంగా వ్యక్తమవుతుంది.

*వివరణము :* యమదేవుని వివరణ ఒక రకముగ నిరుత్సాహ జనకము. దీని అర్థమేమంటే కేవలము పురుష ప్రయత్నం చేత ఆత్మానుభూతిని పొందలేమని, అనుగ్రహము కూడ అవసరమని తెలియాలి. అనుగ్రహ మనునది ఎప్పుడు కలుగునో తెలియదు. ఎవరికి కలుగునో తెలియదు. ఎచ్చట కలుగునో తెలియదు. అనుగ్రహమునకు తీరుతెన్నులు లేవు. అనుగ్రహము ఒక ఉత్కంఠ

(suspence) కలిగినపుడు ఇట్లు కలిగినదని తెలియుటయే గాని, ఎందువలన కలిగినదో ఎవ్వరునూ చెప్పలేరు.

యజ్ఞముచేత గాని, తపస్సుచేత గాని, దానముచేత గాని, త్యాగముచేత గాని తప్పక పొందవచ్చునని బ్రహ్మరుద్రులు కూడ తెలుపలేరు.

అదియట్లుండగ, ప్రయత్నము మానుట అవివేకము. దాంపత్యమున సంతానము కలుగుట కద్దు. కాని ప్రయత్నించినను సంతానము కలగనివారు కూడ చాలమంది యున్నారు. అట్లని అనుగ్రహమే కేవలము సంతాన మీయజాలదు. దంపతి ప్రయత్నముండవలెను గదా! వ్యవసాయమున విశిష్టమగు కృషియున్నది. అంతటి కృషిమీద పంట చేతికి రావచ్చును, రాకపోవచ్చును. కాని వ్యవసాయమే చేయనిచో పంట లభ్యము కాదు గదా!

జీవితమున ఎన్నో రంగములలో జీవులు కృషి సలుపుచు నుందురు. కొన్ని ఫలించును. కొన్ని ఫలింపవు. ఫలములు అనుగ్రహమును బట్టి యుండును. దానికొరకు వేచియుండక, కర్తవ్యమును పురుష ప్రయత్నముగ చేయుటయే ముఖ్యము. ఫలించుటతో సంబంధము లేక ప్రయత్నించుట పరమాత్మ శ్రీకృష్ణుడు భగవద్గీత యందు ఉద్దేశించినాడు. అనుగ్రహమను ఫలము లభించుట సమస్త జ్ఞానమునకు అతీతము. అట్లనుగ్రహము యమునికి నచికేతునిపై కలిగినది గనుక, నచికేతునికి మరణ రహస్యము లభించినది.

(14)

శ్లో॥ నా విరతో దుశ్చరితాన్నాశాంతోనా సమాహితః ।
నాశాంతమానసోవాపి ప్రజ్ఞానేనైన మాప్నుయాత్ ॥

(2-24)

దుశ్చర్యలనుండి విరమించనివాడు, ఇంద్రియ చాపల్యము నుండి విడిపడి శాంతిని పొందనివాడు, నిశ్చలబుద్ధి లేనివాడు, మనసు వేగమును నియమింపలేనివాడు, ఒకవేళ నేను తెలుపు ఈ జ్ఞానము గ్రహించిననూ, పై తెలిపిన అవలక్షణముల కారణముగ ఈ మరణ రహస్యమును పొందలేడు.

*వివరణము :* యమదేవుని ఈ బోధన జిజ్ఞాసువులకు అతి ముఖ్యమై యున్నది. ఆధునిక యుగమున అక్షరాస్యత పెరిగినది. ప్రాచీన గ్రంథము లన్నియు వడివడిగ మాతృభాషల లోనికి అనువదింపబడినవి. చదువ గలిగినవారి సంఖ్య అమితముగ పెరిగినది. గ్రంథములు చదివి ఉపన్యాసములు చెప్పువారి సంఖ్య కూడ బాగ పెరిగినది. కనుక విషయ పరిజ్ఞానము చాలమందికి లభించుచునే యున్నది. అట్టి పరిజ్ఞానము వలన జ్ఞానసిద్ధి కలుగదు. సత్ప్రవర్తన వలననే సిద్ధి కలుగును. దయ్యములు వేదములను బోధించునట్లు

సరియగు ప్రవర్తనలేని బోధకులు, అట్టి బోధలను విను శ్రోతలు కోకొల్లలుగ యున్నారు.

జ్ఞానము బడయుటకు దుశ్చర్య ప్రధానమగు విఘ్నము. ధర్మము నతిక్రమించిన ప్రతిచర్యయు దుశ్చర్యయే అగును. దుశ్చర్య వలన జ్ఞానము ఆరిపోవును. ఇంద్రియ చాపల్యము మరియొక విఘాతము. ఇంద్రియము లెప్పుడును ఇంద్రియార్థములపై ప్రసరించుచు, జీవునాకర్షింప జూచును. అట్టి ఆకర్షణలకు లోనైన వాడు శాంతిని కోల్పోవును. తినుటకు, వినుటకు, చూచుటకు, వాసన చూచుటకు, ముట్టుకొనుటకు ఉత్సుకత చూపువారు ఎంత జ్ఞానము విన్నను, చదివినను అది మరుక్షణమున అపహరింపబడును. సన్నివేశములందు జ్ఞానము అక్కరకు రాదు.

ప్రశాంతమగు మనసు లేకుండుట మూడవ విఘాతము. సత్యవచనము, ధర్మచరితము లేనివానికి మనసున ప్రశాంతత యుండ జాలదు. శాంతి లేనివానికి సౌఖ్యమే లేదు. అట్టి వానికి అణువుకన్న సూక్ష్మమైన ఆత్మ తత్వమెట్లబ్బును.

ఇక నాలుగవ విఘాతము సమాహితమగు ప్రజ్ఞ లేనివాడు. అట్టి వానికి ధ్యానము కౌశలముగ సాగదు. ద్వాదశ పద్మమందలి కర్ణికను చేరుట, అచట నిర్వర్తింపబడు అనాహత శబ్దము తెలియుట, లోలోపల జరుగుచున్న ఓంకారము వినుట వంటి అంశములు ధ్యాన కుశలునికే లభింపగలవు. ఇతరులకు లభ్యము కావు.

దుశ్చర్యలు, ఇంద్రియలోలత్వము, శాంతిలేని మనస్సు, ధ్యానము యందు నిలబడని ప్రజ్ఞ విఘాతములై మరణయాతన కలిగించును. కనుక సత్యవచనము, ధర్మాచరణము, ఇంద్రియ నిగ్రహము, ప్రశాంతత కలిగిన మనసు, స్థిరచిత్తము పొందుటకు వలసిన నియమావళిని తన స్వభావమున ఏర్పాటు చేసుకొనవలెను. అందుకే యోగము నందు యమనియమాదులు పునాదులుగ తెలుప బడినవి. బలమైన పునాదులు లేక కట్టబడిన భవనములు కూలుట తప్పదు. సత్ప్రవర్తనములేని అమరత్వము మృగ్యము.

(15)

శ్లో॥ యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః ।
మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః ॥

(2–25)

నచికేతా! వేదాధ్యాయము వల్లించు బ్రాహ్మణులు, శత్రువులను నిర్జించు క్షత్రియులు ఇరువురు కూడ, మృత్యువునకు నంచుకొని తిను రసోపేతమగు ఆహారమే. ఎంత వేదపండితుడైనను, ఎంతటి వీరాధివీరుడైనను ఆత్మను తెలియనినాడు మృత్యువునకు ఆహారము. ఇక ఇతరుల గూర్చి చెప్పనేల?

*వివరణము :* వేదములు, శాస్త్రములు, వేదాంగములు, పురాణములు తెలిసినంత మాత్రమున ఆత్మజ్ఞానము లభించదు. అంతర్ముఖుడై అనాహత శబ్దము ఆలంబనము గావించుకొని, జ్యోతిర్మయము, ఆనందమయము అగు 'నేను' అను ప్రజ్ఞను తనయందు దర్శించిన వానికే మృత్యువు స్వరూప స్వభావములు తెలియును. అట్టి వానిని మృత్యువు మన్నించి దేహాదులనుండి విముక్తిని ప్రసాదించును. తపస్సు యొక్క మూలప్రయోజన మిదియే. ఇట్టి తపస్సు చేయనివాడు ఎన్ని యజ్ఞములు చేసినను, దానములు చేసినను, పుణ్యకార్యములు చేసినను

మృత్యువు కబళించుట తప్పని సరి. అట్టి తపస్సు చేసినను అనుగ్రహము వలననే ఆత్మ తెలియునని యమదేవుడు తెలిపినాడు. ఓంకారము ననుసంధానము చేయుచు, తపస్సు చేయుచు, అనుగ్రహము కొరకు వేచియుండుట యముడు తెలిపిన ఉపాయము. లోకములందలి అర్హతలు మృత్యువును మెప్పించ లేవు. ఓంకారముతో కూడియుండుట వలన మృత్యువు సంతసించును. అదియును అనాహతమగు ఓంకార మును వినుటగ నుండవలెను.

అట్లు కానినాడు ఎంత విజ్ఞుడైనను, వీరాధివీరుడైనను, ధీరుడై నను మృత్యువును నిర్జించలేడు. కనుకనే భారతీయ వాఙ్మయమున తపస్సు తలమానికమై నిలచినది. భరతభూమి తపోభూమిగ ప్రసిద్ధి చెందినది. అట్టి తపస్సునకు కాలము కర్మము అనుకూలించుటయే ప్రధానమగు అనుగ్రహము. అటుపైన అనుగ్రహముగనే ఆత్మ దర్శనము కూడ జరుగుట యుండును. ఇట్టి తపస్సునకై తపన చెందుట అరుదు. కోరికలకై తపస్సు చేయుట మెండు. యమదేవుడు తెలిపిన మార్గమున పరివర్తనము చెంది, తపస్సున కుపక్రమించి అనుగ్రహము పొందినవారే మార్కండేయుడు, సావిత్రీదేవి. ప్రస్తుత మట్టి అనుగ్రహమును పొందుచున్నవాడు నచికేతుడు. నచికేతునికి వాత్సల్యముతో యమదేవుడు ప్రధానమగు విషయమును బోధించి, అటుపైన అనేక విధమగు హెచ్చరికలు తెలుపుచున్నాడు.

(16)

**శ్లో॥ ఋతం పిబంతౌ సుకృతస్య లోకే**
**గుహాం ప్రవిష్టౌ పరమే పరార్థే ।**
**ఛాయాతపౌ బ్రహ్మవిదో వదంతి**
**పంచాగ్నయో యే చ త్రిణాచికేతాః ॥** (3-1)

నచికేతా! బ్రహ్మము తెలిసిన వారిని వెలుగు నీడలవంటి వారిగ చెపుతారు. వారు త్రిసంధ్యలయందు నచికేత విద్యను అనుష్ఠిస్తూ, ఇహలోకములయందు పుణ్య కర్మముల ఫలముల ననుభవిస్తూ, హృదయ గుహయందు వసిస్తూ, పరతత్వాన్ని అనుభవిస్తూ ఉంటారు. వీరిదే నిజమగు పూర్ణ జ్ఞానము.

వివరణము : నచికేత విద్య ప్రతినిత్యము మూడుమార్లు నిర్వర్తించుకోవటం ఇదివరకే తెలుపబడినది. క్లుప్తంగా అది యేమనగా : హృదయపద్మము ద్వాదశ దళములతో కూడియున్నది. అందలి దళములు మూడు దళములు ఒక కోశముగ, నాలుగు కోశములతో నుండును. ఒక కోశము కన్న మరియొక కోశము లోపలగ యుండును. ఇట్లు నాలుగు కోశములయందలి పన్నెండు దళములను స్మరిస్తూ, దర్శిస్తూ, పద్మమూలమునకు ఓంకార సహాయ

మున చేరుట, అటనుండి ఓంకార మాధారముగనే లోనికి ప్రవేశించుట. ఇట్లు ప్రవేశించినపుడు, హృదయగుహ ప్రవేశము జరిగినట్లు. అట్టివాడు బుద్ధిలోకములో నుండును. ఓంకార మాధారముగను, హృదయ గుహలోని హృదయ ఆకాశమును జీవ ప్రజ్ఞ దర్శించుచు, అనుభూతి చెందుచు నుండును. అపుడపుడు తన ప్రజ్ఞకు మూలమైన తత్త్వములో లీనమగుచుండును. అపుడు తానుండక తత్త్వమే యుండును. ఇట్లు నిత్యము కనీసము మూడుమార్లు తాను లేక పరమాత్మయున్న స్థితిని అనుభవించును. అట్టివారినే బ్రహ్మవిదు లందురు.

బ్రహ్మవిదులైనను వారికిని దినచర్య యుండును. దేహ ధర్మము లుండును. గృహస్థ ధర్మముండును. సంఘ ధర్మముండును. వీని నన్నింటిని బుద్ధిలోకము నుండియే నిర్వర్తింతురు. కనుక కార్యకారణ సంబంధములు, బంధములు ఏర్పడవు. వారు నిర్వర్తించు కర్మల పుణ్య ఫలములు వారు ఉదాసీనతతో అనుభవించు చుందురు.

ఇట్లు పరలోకమున పరమాత్మానుభూతి, ఇహలోకమున సుకృతపుణ్యములు బ్రహ్మవిదులు అనుభవించుచు, తృప్తులై తుష్టితో ఆత్మనిష్ఠాపరులై యుందురు. వీరికి ఇహపరలోకములు రెండును ఆనందము నిచ్చుచునే యుండును. ఇట్టి వారిని గూర్చి కృష్ణపరమాత్మ భగవద్గీత యందలి మూడవ అధ్యాయమగు కర్మయోగమున 17,18, 19,20 శ్లోకములలో వివరించినాడు. జనకాది రాజర్షులు ఇట్లే జీవించుచున్నారని తెలిపినాడు. సమవర్తియగు ధర్మదేవతగూడ ఇదే

విషయము నావిష్కరించుచు, ఇట్టి బ్రహ్మవిదులను 'చీకటి వెలుగులు' వంటివారని, వారు జీవాత్మగ నిత్య నైమిత్తిక పరహిత కర్మలను బుద్ధి లోకమునుండి నిర్వర్తిస్తూ, ఇతర సమయాలలో పరమాత్మతో కూడి, పరమాత్మగనే ఉంటారు. జీవాత్మ అంతరంలో నున్నది పరమాత్మయే. జీవుడంతర్ముఖుడై పరమాత్మతో ఏకీభావం చెందుచు, బహిర్ముఖుడై స్థితప్రజ్ఞుడుగ లోకములను నిర్వర్తిస్తూ ఉండటాన్ని వెలుగు చీకటులుగ మరణదేవత అభివర్ణించాడు.

ఇట్టివారే పూర్ణ పురుషులు మరియు పూర్ణయోగులు. వీరు ఛాయాతప్తులు. చీకటి వెలుగుల వంటివారు. ఇది యమదేవుని చాతుర్యము.

(17)

**శ్లో॥ యః సేతురీజానానామక్షరం బ్రహ్మయత్ పరమ్ ।**
**అభయం తితీర్షతాం పారం నాచికేతం శకేమహి ॥**

(3-2)

నచికేతా! ముందు తెలిపిన విధముగ ఇహమున యజ్ఞార్థ కర్మలు మముబోంట్లు నిర్వర్తించగలరు. అంతేగాక పరముతో గూడ అనుసంధానము చెంది కూడియుండగలము.

*వివరణము :* యమదేవుడు మరియొక సత్యము నావిష్కరించుచు నున్నాడు. తాను, తనవారు ఇహమున యజ్ఞార్థ జీవనము, పరముతో అనుసంధానము రెంటిని శాశ్వతముగ అనుభవించు వారమని తెలిపినాడు. తనవారనగా తనవలెనే ఇహ పరములందు వసించుచు ముక్తులై యున్నవారని అర్థము. అట్టివారు ఏ లోక మందున్నను అంతర్ముఖముగ పరముతో అనుసంధానము కలిగి యుందురు. బహిర్ముఖముగ యజ్ఞార్థము జీవించు చుందురు. వారెపుడును నచికేత యజ్ఞమును వీడరు.

నచికేత యజ్ఞము యముడందించిన అత్యద్భుతమగు ఉపాయము. బాహ్యమున కర్తవ్యమున్నపుడు హృదయమందలి బుద్ధి

లోకములనుండి వెలువడి మనసేంద్రియ దేహములతో కర్తవ్యమును యజ్ఞార్థముగ నిర్వర్తించుట, కర్తవ్యము లేనపుడు హృదయ మందలి బుద్ధి నుండి అంతర్ముఖుడై ఆత్మగ పరమాత్మతో అనుసంధానము చెందుట. ఇట్టి కట్టుబాటు గలవాడు నచికేత విద్యయందు సిద్ధహస్తుడై యుండును.

కర్తవ్యమును మాత్రమే నిర్వర్తించుట, అదియును ఫలాపేక్ష లేకుండ నిర్వర్తించుట, నిర్వహణమున మోహము చెందకుండుట యజ్ఞకర్మ. అట్టి యజ్ఞకర్మ నిర్వర్తించువాడు ఇహమున చుట్టుకొనడు. కర్మ నిర్వహణ అనంతరము మరల బుద్ధియందలి గుహలో ప్రవేశించి ఆత్మానుసంధానము, పరమాత్మ అనుసంధానము సులభముగ పొందు చుండును. ఆత్మ అంతరాళమునందే పరమాత్మ లభించును. పరమాత్మ అనుసంధానమున పరమానందభరితుడై విశ్వమును మరచి యుండును.

అట్టి వారందరు తన బృందములోని వారని యముడు పలుకుటలో చక్కని చమత్కృతి యున్నది.

(18)

శ్లో॥ ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

శ్లో॥ ఇంద్రియాణి హయానా
హుర్విషయాంస్తేషు గోచరాన్ ।
ఆత్మేంద్రియ మనోయుక్తం
భోక్తేత్యాహుర్మనీషిణః ॥ (3-3, 4)

నచికేతా! ఆత్మ రథికుడువంటి వాడు. అతడే యజమాని అని తెలుసుకో. అతని శరీరమే రథము. ఆ రథమునకు సారథి బుద్ధియై యుండవలెను. సారథి చేతిలోని కళ్ళెములే మనస్సు. అతని ఇంద్రియాలే గుఱ్ఱాలు. ప్రపంచమందలి విషయములే ఆ గుఱ్ఱాలు పరుగులు తీసే మార్గాలు. ఇట్లు శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఆధారంగా అనుభూతి చెందుచు యున్నటువంటి భోక్తయే ఆత్మ.

*వివరణము :* ఆత్మకు బుద్ధి, మనస్సు, శరీరము, ఇంద్రియములు ఉపకరణములు. ఆత్మ అనుభూతి చెందడానికి ఈ నాలుగు ఉపకరణములు అవసరమై యున్నవి. రథమందు కూర్చున్న యజమానికి సారథి విజ్ఞత చాల ప్రధానము. సారథి ప్రతిభావంతు

డైనచో రథయాత్ర బాగుగ సాగును. బుద్ధి సారథిగ నియమింపబడి నపుడు యాత్ర విచక్షణతో సాగును. బుద్ధివశమున మనసుండ వలెను. అదియే సారథి కళ్ళెములు పట్టుటగ వర్ణించిరి. బుద్ధిలేని సారథి మనస్సు అను కళ్ళెమును పట్టలేడు. కళ్ళెములు పట్టు తప్పినపుడు ఇంద్రియములనెడి గుఱ్ఱములు ఇష్టానుసారము అదుపుతప్పి ఇంద్రియ విషయముల వైపునకు పరుగెత్తును. అపుడు రథికుని యాత్ర అస్తవ్యస్తమై యుండును. రథమునకు సారథి ఎంతముఖ్యమో, నరునికి బుద్ధి అంత ముఖ్యము. బుద్ధి సామర్థ్యములను బట్టియే జీవనయాత్ర పురోగమించును. సారథి బలవంతుడు కానిచో గుఱ్ఱముల కళ్ళెము లను పట్టలేడు. ఐదు (5) ఇంద్రియములకును కళ్ళెమువేసి కట్ట వలయును గదా! ఐదు గుఱ్ఱముల బలము కన్నను సారథి బలమెక్కువై యుండవలెను. లేనిచో గుఱ్ఱములు వశము తప్పి ఐదు దిశలలో పరుగెత్తినచో రథము ఐదు ముక్కలగును.

కనుక మానవ శరీరమను రథము నిర్వర్తించుకొను విధానము చిన్నతనముననే తెలియవలెను. మనసు, ఇంద్రియములు, శరీరము బుద్ధివశమున నుండవలెను. బుద్ధి ఆత్మ మిత్రుడై ఆత్మోన్నతికి తోడ్పడ వలెను.

(19)

**శ్లో॥ యస్త్వవిజ్ఞానవాన్ భవత్యయుక్తేన మనసా సదా ।**
**తస్యేంద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః ॥**

(3-5)

నచికేతా! మనసు నెప్పుడునూ విచ్చలవిడిగా వదలివేయరాదు. తానుగ మనసు జ్ఞానము వైపునకు మళ్లదు. ఇంద్రియముల ద్వారా, ఇంద్రియార్థముల వైపునకు పరుగెత్తుచు నుండును. ఇంద్రియములు గుఱ్ఱములవలె చాల వేగవంతములు. ఇట్లు మనసును విచ్చలవిడిగ వదలివేసినచో సారథియగు జీవుని జీవితము వశము తప్పిపోవును.

**శ్లో॥ యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా ।**
**తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః ॥**

(3-6)

మనసును ఎల్లప్పుడును బుద్ధితో కూర్చి ఉంచవలెను. అపుడు సరియైన జ్ఞానంతో మనసు, ఇంద్రియములు మంచి గుఱ్ఱాలవలె వశములో ఉంటాయి.

*వివరణము :* యముడు తెలిపిన ఈ సత్యము సర్వసామాన్య

ముగ తెలిసినప్పటికి ఆచరణయందు కరువై యుండును. మనసు బుద్ధితో యోగము చెందినపుడే జీవితము సక్రమముగ సాగును. మనసెన్నడును బుద్ధిహీనమై యుండరాదు. ఈ శిక్షణము ఐదవ (5) సం॥ము నుండి ప్రారంభింపవలెను. మనసును బుద్ధితో కూర్చు అభ్యాసము తలిదండ్రులు, గురువులు భక్తి శ్రద్ధలతో, ప్రేమతో పిల్లలకు నేర్పవలెను. బుద్ధిసాంగత్యము వలననే మనసునకు కుదురేర్పడును. కుదురు లేని మనసుతో జీవించుట అస్తవ్యస్తముగ నుండును. చిన్న తనమున క్రమశిక్షణను నేర్వలేనివారు తరువాత దశలో శిక్షణ పొందుట అత్యంత కష్టముగ నుండును. బుద్ధియందు స్థిరపడిన మనసు జీవనయాత్రకు చక్కని తోడ్పాటందించును. పురోగతి నిచ్చును.

ప్రాథమికముగ యోగమనగా మనసు బుద్ధిని చేరి, బుద్ధితో స్థిరముగ నుండుట. స్థిరత్వము బుద్ధి లక్షణము. అస్థిరత్వము మనసు లక్షణము. అస్థిరమగు మనోప్రజ్ఞ స్థిరమగు బుద్ధిప్రజ్ఞతో కూడి యుండుట వలన మనసునకు కూడ స్థిరమబ్బును. చపలత్వము తగ్గును. గాలికి రెపరెపలాడు దీపము మార్గదర్శకత్వము వహించలేదు. స్థిరమగు దీపమే మార్గమును నిర్దిష్టముగ చూపగలదు. కనుక బుద్ధి నాశ్రయించని మనసు, జీవునకు ఒక సమస్యయై జీవితమును అస్థిరత్వము లోనికి, కష్టనష్టములలోనికి నెట్టును. ఈ విషయమున సాధకులు అప్రమత్తముగ నుండవలెను.

(20)

**శ్లో॥ యస్త్వ విజ్ఞానవాన్ భవత్యమనస్కః సదాఽ శుచిః ।**
**న స తత్ పదమాప్నోతి సంసారం చాధిగచ్ఛతి ॥**

(3-7)

నచికేతా! బుద్ధి సారథ్యమునకు ఒప్పని మనసు చెదరిపోయి ఇంద్రియార్థముల వెంట పరుగెత్తుచు, అపరిశుద్ధమై అవస్థితిని పొందును. అట్టి అవస్థితి పొందిన జీవుడు జనన మరణ చక్రంలో బందీకృతుడౌతాడు.

వివరణము : మానవజన్మ లభించుట ఒక అదృష్టము. సులభముగ లభించునది కాదు. ఈ అవకాశము సరిగ వినియోగించు కొని మానవుడు బుద్ధిలోకములలోనికి ప్రవేశించాలి. బుద్ధిలోకము స్థిరమగు లోకము. అచ్చట స్థిరము, సుఖము శాశ్వతముగ నుండును. ఈ లోకమునే దివ్యలోకముగ వర్ణింతురు. దేవతాలోకమని కూడ తెలుపుదురు. అట్టి లోకమున జనన మరణము లుండవు.

మనోప్రజ్ఞ ఇంద్రియలోకములకు, బుద్ధిలోకములకు నడుమ నున్న ప్రజ్ఞ. మానవునకు దైవము స్వతంత్రతను అనుగ్రహించినాడు. అతడు బుద్ధిలోకమున ప్రవేశించవచ్చును లేదా అస్థిరము, అసుఖము

అగు ఇంద్రియ లోకమును ప్రవేశింపవచ్చును. నిర్ణయము మానవు నిదే. ప్రయత్నించి, సత్య ధర్మముల నాశ్రయించి విజ్ఞాన సహితమగు బుద్ధిలోకముల చేరవచ్చును. అట్లు చేరుటకు శ్రద్ధ, దీక్ష, ఓర్పు, సహనము, సంకల్పబలము ప్రధానము. లేదా ప్రయత్న హీనుడై ఇంద్రియలోలుడు కావచ్చును. ఇంద్రియములు ఇంద్రియార్థముల వైపు మానవ ప్రజ్ఞను బలీయముగ ఆకర్షించి, మానవుని నిర్వీర్యుని చేసి మరణమునకు గురి చేయగలవు. మరణము మరియొక జన్మము నకు తెరతీయును. మరుజన్మ మానవజన్మ కావచ్చును, కాకపో వచ్చును. కనుక అవకాశమును సద్వినియోగము చేసుకొన వలెనని నచికేతునికి యమధర్మరాజు హెచ్చరికగ తెలుపుచున్నాడు.

(21)

శ్లో॥ విజ్ఞానసారథిర్యస్తు మనః ప్రగ్రహవాన్ నరః ।
సోऽధ్వనః పారమాప్నోతి తద్ విష్ణోః పరమం పదమ్॥

(3-9)

నచికేతా! బుద్ధియే సారథిగా కలవాడు చాకచక్యంతో కళ్ళెములను పట్టునట్లు మనసును నియమించి, ప్రజ్ఞను విష్ణు పదమువైపు నడిపిస్తాడు.

*వివరణము :* యముడు సూక్ష్మంగా నచికేతునికి బుద్ధివశమైన మనసును ఎట్టి గమ్యానికి లక్ష్యం చేయాలో తెలియపరిచాడు. విష్ణు పదమనగా సర్వవ్యాపకమైన ఆత్మతత్త్వం. విష్ణువనగా సర్వవ్యాపియైన ఆత్మ. మనసు బుద్ధివశమైనపుడు మనోప్రజ్ఞను జ్ఞానవిజ్ఞానములకు పరిచయము చేసి బుద్ధికి మూలమైన ఆత్మతత్త్వము వైపు దారి మళ్లించాలి. బుద్ధి జ్ఞానవిజ్ఞానములను పరిచయముచేయు లోకము. అట్టి లోకముతో మైత్రి ఏర్పడిన మనసు జ్ఞానవిజ్ఞానములయందే ఆసక్తి చూపును. చిల్లరగా బాహ్యమునందు వర్తించు జ్ఞానవిజ్ఞాన అనురక్తి కారణంగా మనోప్రజ్ఞకు ఆత్మరుచి కలుగును. ఆత్మ బుద్ధికి మూలమైనది. అట్టి ఆత్మరుచి కారణముగ మనస్సంతర్ముఖమై తన

మూలమును అన్వేషించుట ఆరంభించును. తదేక నిష్ఠతో తన ప్రజ్ఞా మూలమును దర్శించు ప్రయత్నమున మానవ ప్రజ్ఞ మనస్సు నుండి బుద్ధిలోనికి, బుద్ధి నుండి ఆత్మలోనికి చొచ్చుకొని పోవును. ఇట్లాత్మ దర్శనమునకై కృషి సాగును. బుద్ధిమూలమే ఆత్మయని తెలియును. అది తానేయని తెలియును. నిజమునకు తానాత్మనని, తన ప్రకాశమే బుద్ధియనెడి వెలుగని, ఆ వెలుగే మనసేంద్రియ శరీరములను నడిపించు చున్నదని తెలియును.

అటుపైన ఆత్మ మూలమెరుగు ప్రయత్నము సాగును. ఆత్మ మూలమే విష్ణువని తెలియును. సర్వవ్యాపకమైన విష్ణువే ఆత్మగను, బుద్ధిగను అవతరించి మనసును, ఇంద్రియములను, శరీరమును నడిపించు చున్నాడని తెలియును. ఇట్లు తెలియుట వలన విష్ణువే సర్వస్వమని తెలియును. ఇట్టి సోపానక్రమమున పయనించుటకే మనస్సు బుద్ధిచే పొందబడవలెనని యముడు సూచించు చున్నాడు. ఈ సోపానక్రమమునే మరింత వివరంగా తరువాతి శ్లోకమున తెలియపరచు చున్నాడు.

(22)

శ్లో॥ ఇంద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః ।
మనసస్తు పరాబుద్ధిర్బుద్ధేరాత్మా మహాన్ పరః ॥

శ్లో॥ మహతః పరమవ్యక్తమవ్యక్తాత్ పురుషః పరః ।
పురుషాన్నపరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః ॥

(3-10, 11)

నచికేతా! ఇంద్రియముల కంటే పంచభూతాలు శ్రేష్ఠమైనవి. వానికంటే మనసు శ్రేష్ఠమైనది. మనసుకంటే కూడ బుద్ధి శ్రేష్ఠమైనది. బుద్ధికంటే మహత్తు శ్రేష్ఠమైనది. మహత్తుకంటే అవ్యక్తము శ్రేష్ఠమైనది. అవ్యక్తము కంటే పురుషుడు శ్రేష్ఠమైనవాడు. పురుషునికంటే మరేదియు శ్రేష్ఠము లేదు. అదే పరమగతి.

*వివరణము :* పై తెలిపిన సోపానక్రమము మరింత విపులమైనది. బుద్ధిలోకమున ప్రవేశించినపుడు క్రమంగా ఇవి అవగాహన అవుతాయి. బుద్ధివరకు ఇదివరకటి శ్లోకములలో వివరింపబడినది. బుద్ధికి మూలము మహత్తు అని తెలుపబడినది. మహత్తనగా మూడు గుణముల పుట్టుక స్థానము. మూడు గుణముల సమన్వయమే బుద్ధి. మూడు గుణముల పుట్టుకకు మహత్తు కారణము. మహత్తు పుట్టుటకు

మూల ప్రకృతి కారణము. మూల ప్రకృతి విరాట్పురుషుని ప్రకృతి. కనుక విరాట్పురుషుని ఎరుగుట అనగా పరమును ఎరుగుటయే అని యమధర్మరాజు తెలుపుచున్నాడు.

అవరోహణ క్రమమున పై విషయములను ఈ క్రింది విధముగ అమర్చుకొనవచ్చును.

1. పరమ పురుషుడు (పరమాత్మ)
2. పరాప్రకృతి
3. అవ్యక్తం
4. మహత్తు
5. బుద్ధి
6. మనస్సు
7. ఇంద్రియములు
8. శరీరము.

మానవ ప్రజ్ఞ ఈ సోపానక్రమమున ఉత్తరాయణ దక్షిణా యనములుగ ఆరోహణ, అవరోహణ క్రమములలో తిరుగవచ్చును. కేవలము మనసేంద్రియ శరీరములలోనే సంచరించుట వలన పరిమిత జ్ఞానము కలిగి జనన మరణ చక్రమున మానవుడు తిరుగాడు చున్నాడు. తన మూలములోనికి తాను ప్రవేశింప లేకున్నాడు. తన మూలమున తాను ప్రవేశించినపుడు చక్రమునబడక, చక్రమెట్లు తిరుగుచున్నదో దర్శింపవచ్చును. అట్టి దర్శనము స్పష్టముగ గలవాడు యముడు.

(23)

**శ్లో॥ ఏష సర్వేషు భూతేషు**
**గూఢోఽఽత్మా న ప్రకాశతే ।**
**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా**
**సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః ॥** (3-12)

నచికేతా! ప్రాకారములతో ఆవరింపబడిన ఆత్మను చర్మచక్షువులతో దర్శింపలేరు. అది బుద్ధిగ్రాహ్యము. అంతః చక్షువుతోనే అంతరాత్మను దర్శించ వీలుపడును.

*వివరణము :* ఆత్మ దర్శనము కోరువారు అంతర్ముఖులై శోధన చేయుటయే మార్గము. తొమ్మిది ప్రాకారముల నడుమ నున్న దైవ ప్రతిమను చూడవలెనన్నచో ప్రాకారద్వారముల ద్వారా లోనికేగుటయే మార్గము. గర్భగుడి యందు గల దైవ ప్రతిమను గాలి గోపురము నుండి చూచుటకు వీలుపడునా? లోనికి ప్రవేశించుట తప్పనిసరి. అట్లే ఆత్మశోధకుడు తనలోనికి తానేగు ప్రయత్నము చేయవలెను. తనచుట్టును ఏర్పడిన ప్రాకారములే తన కవరోధమై యుండును గనుక, నవ ద్వారములను దాటి తనను తాను దర్శించవచ్చును. శరీరము ప్రథమ ప్రాకారము. ఇంద్రియములు రెండవ ప్రాకారము.

మనసు మూడవది. బుద్ధి నాలుగవది. త్రిగుణములు 5, 6, 7 ప్రాకారములు. అహంకారము ఎనిమిదవ ప్రాకారము. అటుపైన శుద్ధ చైతన్యము, వెలుగు, అదియే మాయకూడను. దాని కాధారమై తొమ్మిదవ ప్రాకారమావల నిశ్చలము, స్థిరము, శాశ్వతము, అక్షరము అయిన బ్రహ్మమును తెలియవలెను. అట్టి బ్రహ్మము తానే అని కూడ తెలియవలెను.

ఇట్టి లోదృష్టికే ఋషులు తపస్సు చేయుదురు. లోనున్న బ్రహ్మమును ఎరిగిన వారికి లోపల, బయట అను పొరలు మాయ మగును. అంతా బ్రహ్మమే, అంతా నేనే అను భావమున స్థిరపడుట వీలుపడును. ఆవరణ లన్నియు దాటి తానెట్లున్నాడో తనకు తెలియును. తానుండుట యనగా బ్రహ్మముండుటయే అని తెలియును. అట్టివానికి *"ఓం నమః"* అను మంత్రము సిద్ధించి యుండును.

ఆవరణలలో బ్రతుకు వానికి ఆత్మ దర్శనము వీలుపడదు. ఆకు, ఆకు మధ్యయున్న కీటకము (పురుగు) మొత్తము వృక్షమును దర్శించలేదు గదా! కనుకనే తపస్సు ఆవశ్యకమైనది. తపస్సు చేసిన వారే మరణము లేని ఆత్మగా తమను తామెరిగిరి. ఆవరణలు ఉన్నను, లేకున్నను తామున్నామని గ్రహించిరి. మరణము మాయా వరణమని గ్రహించిరి. మరణము లేని స్థితియందు ఉండుట ఎట్లో తెలుసుకొనిరి. కనుక నచికేతుని తపస్సునకై యమదేవుడు ప్రోత్సహించెను. లోన సుషుమ్న యందు నిరంతరము జరుగుచున్న అనాహత శబ్దముతో అనుసంధానము చెందుమని మరల గుర్తు చేసినాడు.

## (24)

**శ్లో॥ యచ్ఛేద్ వాఙ్ మనసీ**
**ప్రాజ్ఞస్తద్యచ్ఛేద్ జ్ఞాన ఆత్మని ।**
**జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్**
**తద్యచ్ఛేచ్ఛాంత ఆత్మని ॥** (3-13)

నచికేతా! ప్రాజ్ఞుడైనవాడు వాక్కును మనస్సులోను, మనస్సును బుద్ధిలోను, బుద్ధిని తనయందు, తనను పరమ శాంతి యందు పూర్తిగా లీనం చేయాలి.

*వివరణము :* విప్పిన వస్త్రమును క్రమంగా మడతలు పెట్టి అగ్గిపెట్టెలో పెట్టినట్లు, విస్తృతంగా వ్యాప్తి చెందిన ప్రజ్ఞను తనలోనికి తాను లయం చేసుకోవాలి. తాను తన మూలములోనికి సంపూర్తిగ లయమై పోవాలి. ఇది తిరోధాన మార్గము.

వ్యాప్తి చెందిన ప్రజ్ఞను ప్రాజ్ఞు డంటారు. పరమాత్మనుండి ఆత్మగను, ఆత్మ నుండి బుద్ధిగను, బుద్ధి నుండి మనస్సుగను, మనస్సు నుండి ఇంద్రియములుగను, వాక్కుగను వ్యాప్తి చెందియున్నవాడు ప్రాజ్ఞుడైన జీవుడు. మరల తన నిజస్థానమునకు లేక తన మూలము నకు తాను చేరాలంటే పురోగతి చెందిన ప్రజ్ఞను క్రమంగా తిరో

ధానం చెందించాలి. అది నిరంతర ప్రయత్నము వలననే సాధ్యపడు తుంది. మరొక మార్గం లేదు.

విశాఖపట్నం నుండి ముంబాయి నగరము చేరిన ప్రయాణీకుడు మరల విశాఖపట్నం చేరుటకు పురోగమించిన దారినుండే తిరో గమనం చేయాలి. తూర్పు నుండి పడమరను చేరు ప్రజ్ఞ, మరల పడమర నుండి తూర్పు చేరుటకు తిరోగమనమే విధానము.

నిజానికి పరమశాంతి, పరమాత్మ స్థానము మానవుని సహస్రార మందున్నది. దానిని ఉత్తరమందురు. అటనుండి జీవాత్మ తూర్పుగ "ఆజ్ఞ"ను చేరును. తూర్పు నుండి దక్షిణముగ పయనించి అనాహతము చేరును. దక్షిణము నుండి పడమరగ మూలాధారము చేరును. పడమర నుండి అధస్సును చేరును. అనగా నైఋతిని చేరును. అచట పదార్థముచే బంధింపబడును. ఇట్లు జీవుడు ఉత్తరము నుండి తూర్పుకు, తూర్పు నుండి దక్షిణమునకు, దక్షిణము నుండి పడమరకు, పడమర నుండి నైఋతికి సృష్టియందు పురోగమించును. అచ్చట నుండి మరల ఉత్తరము చేరుటకు చేయు తిరోధానమును యముడు నచికేతునకు తెలుపుచున్నాడు.

ముందుగ వాక్కును మనస్సున నిలిపి మౌనముగ నుండుమని తెలిపినాడు. వాక్కు వలన ప్రజ్ఞ ప్రపంచము లోనికి వ్యాప్తిచెంది, తిరిగి రాలేని స్థితిని కల్పించుకొనును. అధికముగ భాషించువారు సంయమము లేక క్షీణింతురు. కనుక ప్రజ్ఞ బహుళ వ్యాప్తి కాకుండుటకై

మౌన నియతి ప్రధానము. అల్పుడైన జీవుడు అధికముగ మాట్లాడును. సజ్జనుడు చల్లదనము కలిగించు మాటలనే పలుకును.

వాఙ్నియమము కలిగినవారు ఇంద్రియ నియమములు క్రమముగ పొందగలరు. ఇంద్రియ నియమము కలుగుటచే మనో సంయమము వీలుపడును. నిలకడగల మనస్సును బుద్ధిపై నిలుప వచ్చును. బుద్ధియనగ తన లోవెలుగు. ఆ వెలుగున నిలచిన ప్రజ్ఞ, ఆ వెలుగునకు మూలమైన స్థానము చేరుటకు ప్రయత్నించాలి. దీర్ఘ కాలమగు అభ్యాసము ద్వారా తన వెలుగునకు మూలము తానేయని తెలియును. అటుపైన తన మూలమునకు చేయు అన్వేషణమున తానదృశ్యమై పరమశాంతి నిలుస్తుంది. ఈ విధంగా జీవుడు తన యందలి వికారములన్నిటిని దాటి శాంతిస్వరూపుడై నిలుస్తాడు. యముడు అట్టి శాంతి స్వరూపుడు. యమము అభ్యసించి పరి పూర్ణుడైనవాడు యముడు. పరమ యమము ఉన్నచోటనే పరమ శాంతి కూడ యుండును.

## (25)

**శ్లో॥ ఉత్తిష్ఠత జాగ్రత**
**ప్రాప్య వరాన్ నిబోధత ।**
**క్షురస్య ధారా నిశితా దురత్యయా**
**దుర్గం పథస్తత్ కవయో వదంతి ॥** (3-14)

నచికేతా! జీవులు అజ్ఞానపు నిద్ర నుండి మేలుకోవాలి. ఎంత కాలము అజ్ఞానమందు సంచరిస్తారు? వారు మేల్కోవాలి. శ్రేష్ఠులైన వారిని ఆశ్రయించాలి. ఆత్మను గూర్చి బోధనము మరియు మార్గము పొందాలి. నిశితముగ ఆ మార్గమును అనుసరించాలి. ఆ మార్గము ప్రయాసతో కూడినదని తెలిసినవారు చెపుతారు.

*వివరణము :* సమవర్తి యగు యమధర్మరాజు అనునిత్యం మరణించువారు గూర్చి చింతిస్తూ ఉంటాడు. ఈ జీవులు మరణించ నేల? మరణయాతన అనుభవించనేల? ప్రేత శరీరాలు ధరించనేల? నరకయాతన అనుభవించనేల? మరల గర్భనరకమును అనుభవించ నేల? మరణమును అధిగమించు మార్గమును అవలంబించవచ్చును గదా! ఆ మార్గమును బోధించువారు కూడ లోకమందున్నారు గదా! తెలిసి తెలిసి మరణయాతన, ప్రేతావస్థ, గర్భనరకము పొందుచు నుండుట- మరల మరల పొందుచుండుట అవివేకము గదా! ఈ

విధముగ యమదేవుడు సంతాపము చూపుతూ ఉంటాడు. ధర్మము ననుసరించి తాను తన కర్తవ్యమును నిర్వర్తించు చున్నాడేకాని, యమ దేవుడు దాక్షిణ్య స్వరూపుడు. ఉత్సాహముగ, ఆనందముగ చేయు పని కాదు అతనిది. ఉరితీయు వ్యక్తి ఉరితీయబడు వానిని ఉత్సాహ ముతో, ఆనందముతో ఉరితీయడు గదా! అది అతని కర్తవ్యమగుటచే నిర్లిప్తముగ ఉరితీయును. ఉరితీయుట నిత్యము జరుగదు. కాని మరణము నిత్యము జరుగుచు నుండును. ఇట్టి కార్యము నిర్వర్తించు టకు దైవమే యముని ఎన్నుకొని నియమించెను. దైవ సమర్పితముగ నిత్యము యమదేవుడు యుగముల తరబడి ఇట్టి కార్యమును నిర్వర్తించుచు నున్నాడు.

అందువలన ఈ మానవులను అజ్ఞానమునుండి మేల్కొల్పటం చాల అవసరమని నచికేతునికి తెలియచెప్తూ ఉన్నాడు. నిజమునకు మరణయాతన ఎవ్వరికిని ఇష్టముండదు. కాని దానిని అధిగమించు మార్గము మాత్రము ఎవ్వరును స్వీకరింపరు. తోటివారు మరణించుట చూచి, కొన్ని క్షణములు తాము కూడ మరణింతుము గదా! అని ఆలోచింతురే కాని, మరణము నెట్లు దాటవలెను? దాని కేమి చేయ వలెను? అను జిజ్ఞాస క్షణకాలము కూడ యుండదు. అదియే మహామాయ.

ఈ విషయమును నచికేతునితో పలుకుటలో యముని ఆంతర్యము తెలియనగును. యముని అనుగ్రహమున ఉపదేశము పొందిన నచికేతుడు ఎట్లును మరణము దాటుట తథ్యము. అట్టి

నచికేతుడు ఎందరో జీవులను ఈ విషయమున మేల్కొల్పాలి. అది యముని ఆకాంక్ష ! ఒక ఉద్యమంగా ఇది నడవాలి. జీవులు తరించాలి. ఈ విద్య నేర్చుటకై జీవులుత్సహించాలి. సద్గురువుల నాశ్రయించాలి. శ్రమించాలి. సులభము కాదని మార్గమునుండి వైదొలగకూడదు. ఇది యముని ఆంతర్యము.

ఇటీవలి కాలంలో అగస్త్యాంశ సంభూతులైన పరమగురువు మాస్టరు సి.వి.వి.గారు అమితమైన తెగువతో వార్తా పత్రికలయందు *"మరణము దాటగోరువారు నా వద్దకు రావచ్చును"* అని ప్రకటనను ఇచ్చారు. "Those who don't want to die may contact me at No.2, Dabbier East Street, Kumbhakonam." మాస్టరుగారు మరణమును గూర్చి అనేక పరిశోధనలు సలిపి అమరులై, అమరత్వము నిచ్చుటకు సంసిద్ధులుగ యండుటయే గాక జీవులను మరణమును దాటించుటయే ఒక ఉద్యమంగా ప్రపంచ వ్యాప్తి పొందినారు.

అదే విధముగ పరమగురువు జ్వాలాకూలుడు జీవులను మరణము దాటించుటయే ప్రస్తుత కర్తవ్యముగ భావించి అనేకమైన బోధనలను గావించి, భౌగోళికముగ అమరత్వమును గూర్చి చాటినారు. దేహమును అనాయాసముగ విడుచు రహస్యమార్గములను వివరించినారు. జిజ్ఞాసువులు అనేకానేక శాస్త్రములు అభ్యసించుటకన్న అమరత్వ విద్యను అభ్యసించుట ప్రధానమని తెలియవలెను. ఈ విద్యయందు ఆసక్తి జనించుట కూడ అనుగ్రహమే అని తెలియవలెను.

(26)

శ్లో॥ అశబ్దమస్పర్శ మరూపమవ్యయం
తథాఽ రసం నిత్యమగంధ వచ్చయత్ ।
అనాద్యనంతం మహతః పరం ధ్రువం
నిచాయ్య తన్మృత్యుముఖాత్ ప్రముచ్యతే ॥

(3-15)

నచికేతా! ఆత్మ సాక్షాత్కారము వలన మరణ బంధము నుండి మానవుడు విముక్తి పొందుతాడు. ఆత్మ అవికారమైనది. మహత్తున కతీతమైనది. శబ్ద, రూప, రస, స్పర్శ, గంధాలు లేనిది, శాశ్వతమైనది, అంతము లేనిది ఆత్మ.

*వివరణము :* ఆత్మ నుండి సమస్తము ఏర్పడతాయి. ఏర్పడినవి తెలుస్తాయి గాని, ఆత్మ తెలియదు. ఎందువలనంటే, ఆత్మ తామే గనుక. తనకు తాను కనిపించక, తనకున్నవి కనిపిస్తూ ఉంటాయి. శరీరము, ఇంద్రియములు, ఇంద్రియార్థములు, తన్మాత్రలు, తనలో జనించే కోరికలు, భావనలు, ఆలోచనలు– ఇత్యాది వన్నీ సామాన్యంగా కనిపిస్తాయి. తన లోతుల లోనికి తాను వెళుతూ ఉంటే, తనలోని జ్ఞాన విజ్ఞానములు, మూడు గుణముల విలాసములు కూడ

కనిపిస్తాయి. మూడు గుణములకు మూలమైన మహత్తు, దాని మాహాత్మ్యము కూడ తెలియవచ్చును. తాను తనలోనికి చొచ్చుకొని పోతున్నకొద్దీ, విశ్వమందున్నవన్నియు తనలోనే కనిపిస్తాయి. కాని తనకు తాను కనిపించడు. అయినప్పటికి తానున్నాడు గదా! తానున్నానను తెలివి కూడ యున్నది కదా! తన తెలివి కూడ అపుడపుడు తనలోనికి కరిగిపోవు చుండును. తానున్నానను తెలివి తప్ప, ఇతరములేని స్థితిలో ఆత్మసాక్షాత్కారము అవుతుంది. ఆ తెలివి కూడ కరిగినపుడు సమాధి స్థితి కలుగుతుంది. ఈ రెండు స్థితులలో తన నిజస్వరూపము తనకు తెలియబడుతుంది. తాను శాశ్వతుడ నని, తనచుట్టూ పొరలుగ ఏర్పడిన మహత్తు, గుణములు, విజ్ఞానము, భావనలు, కోరికలు, ఇంద్రియ తన్మాత్రలు ఇత్యాదివి ఏర్పడుతూ, నశిస్తూ ఉంటాయని తెలుస్తుంది. ఆ పొరలేవీ తాను కాదని, తన నుండి ఏర్పడు వికారములని, తాను నిజమునకు అవికారి యని తెలుస్తుంది.

తన పొరలే తాను అని భ్రాంతి చెందువానికి మరణ ముంటుంది. ఎందుకంటే పొరలు శాశ్వతము కాదు. తనను తన పొరలనుండి వేరుగ గ్రహించిన వానికి మరణ ముండదు. గడ్డి నుండి పోచను వేరు చేసినట్లుగ, తనని తాను తన పొరలనుండి వేరుగ దర్శించాలి. అది కేవలము ధ్యానమునందు మాత్రమే వీలు పడుతుంది. తన ప్రాణస్పందనలో నున్న తానుగ దర్శనమౌతుంది.

అట్టి వానికి శరీర ముండుట, లేకుండుట అను స్థితుల భేదముండదు. వస్త్రములు ధరించుట, విసర్జించుటవలె నుండును.

## ఫలశ్రుతి

ధర్మస్వరూపుడగు మరణదేవత చెప్పిన ఈ రహస్యములను చెప్పువారు, వినువారు బ్రహ్మలోకంలో కీర్తింపబడతారు. (3-16)

అత్యంత రహస్యమైన ఈ బోధనను పరమభక్తితో వినిపించిన వాడు అనంతమైన ప్రతిఫలాన్ని పొందుతాడు. (3-17)

## 27

**శ్లో॥ పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూ**
**స్తస్మాత్ పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్ ।**
**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్ష**
**దావృత్త చక్షురమృతత్వమిచ్ఛన్ ॥** (4-1)

నచికేతా! స్వయంభూ అయిన భగవంతుడు ఇంద్రియాలను బహిర్ముఖంగా పనిచేయుటకే నియమించాడు. కనుక ఇంద్రియములు బాహ్య దర్శనానికే ఉపకరిస్తాయి. లోదర్శనమునకు ఉపకరించలేవు. ఆత్మను దర్శింపజేయలేవు. సకృతులలో ఎవరో ఒక ధీరుడు ఆత్మ దర్శనమునకు, అమృతత్వమునకు కన్నులను లోపలకు మరల్చుతాడు.

*వివరణము :* ఇంద్రియ ప్రజ్ఞలు ప్రచేతసులని మన వాఙ్మయము తెలుపుతుంది. సృష్టి నిర్మాణ కార్యంలో దేవతలు ప్రచేతసులను ఇంద్రియ ప్రజ్ఞలుగ ఉపకరించమని వేడుకుంటారు. ప్రచేతసులు తపస్విజనులు. వారెప్పుడును అంతర్ముఖులై సత్యము, సుందరము, శివము అయిన తత్వాన్ని ధ్యానిస్తూ అనుసంధానంలో ఉంటారు. వారికి బాహ్య దృష్టికన్నా, అంతర్ దృష్టియందే ఆసక్తి ఎక్కువ. వారిని దేవతలు జీవుల బాహ్యదృష్టికై ఉపక్రమించమని కోరితే వారు నిరాకరిస్తారు. సృష్టి కార్యానికి ఆ విధంగా ఆటంకం ఏర్పడుతుంది.

అపుడు దేవతలందరు శివుని వద్దకు వెళ్ళి పరిస్థితిని వివరించి, పరిష్కారం కోరతారు. అపుడు పరమశివుడు ప్రచేతసులకు అంతర్ముఖంగా దర్శనమిచ్చి బోధ చేస్తాడు. సృష్టి కార్యము లోక హిత కార్యమని, లోకహిత కార్యమునకు ఉపకరించు వారందరికి తన సాన్నిధ్యము సతతము స్థిరమై ఉంటుందని, సృష్టికార్యమునకు సహకరించమని బోధిస్తాడు. పరమశివుడు ప్రచేతసులకు చేసిన బోధను 'రుద్రగీత'గ భాగవతమునందు నిక్షిప్తం చేశారు. తమ కొరకై తపస్సు చేయడమా? పరుల హితముకొరకై పరిశ్రమించడమా? పరుల రూపమున నున్నది గూడ దైవమే గదా! పరులకు హితము చేయుట పరదైవతమునకు హితము చేయుటయే గదా! తపస్సు లక్ష్యము కూడ శివానుగ్రహము కొరకే కనుక పరహితమున కూడ శివానుగ్రహము లభించును గదా! కనుక ప్రచేతసులు పరహిత కార్యమున నిమగ్నమై యుండుట వలన వారికెట్టి అవస్థితి కలుగదని శివుడు తెలుపగా, ప్రచేతసులు జీవులకు బాహ్యప్రజ్ఞలై యుండుటకు అంగీకరించారు. అట్టి ఇంద్రియ ప్రజ్ఞలు జీవులకు బాహ్యమును మాత్రమే దర్శింప జేయును. అంతర్ముఖ మగుటకు ఇంద్రియ ప్రజ్ఞలు తోడ్పడవు.

అంతర్ముఖుడు కావలెనన్న ఆకాంక్ష అంతరాత్మ యందేర్పడి నపుడు ప్రచేతసుల మార్గమునగాక, వాయుమార్గమున లేక శ్వాస మార్గమున అంతర్ముఖుడు కావలెను. ఇంద్రియముల నాశ్రయించిన జీవుడు ఇటుపై వాయువు నాశ్రయించవలెను. శ్వాస ననుసరించ వలెను. ప్రాణాపానముల మార్గమున, సమాన ఉదాన వ్యాన వాయువుల ద్వారా తన మూలమును తాను చేరవచ్చును.

(28)

**శ్లో॥ పరాచః కామాననుయంతి బాలా**
**స్తే మృత్యోర్యంతి వితతస్య పాశమ్ ।**
**అథ ధీరా అమృతత్వం విదిత్వా**
**ధృవమధ్రువేష్విహ న ప్రార్థయంతే ॥** (4-2)

నచికేతా! బాహ్య సుఖాల వెంటపడేవారు పసిబాలురే! వారు విస్తారమైన మృత్యువు వలలో పడిపోతారు. తెలిసినవారు నిత్యము, శాశ్వతము, అమరము అగు విషయాలలో సంచరిస్తారు.

*వివరణము :* బాహ్య దృశ్యమంతయు మారిపోతూ ఉంటుంది. విషయములు నిత్యమై ఉండవు. శాశ్వతమై యుండవు. వచ్చిపోతూ ఉంటాయి. తెరమీద సంఘటనలు వచ్చిపోయేవే. తెరమాత్రమే శాశ్వతము. బాహ్య విషయములకు ఆధారమగు చైతన్య స్రవంతి నిత్యము. అవసరము కూడ. కనుక ప్రపంచమందు జరుగుచున్న అనేకానేక చేష్టలను చూచుటకన్నా, వాటి కాధారమైన చైతన్యమును చూచుట, గమనించుట తెలిసినవారు చేయుదురు. వారే ప్రాజ్ఞులు. జీవితంలో జన్మ, వృద్ధి, స్థితి, పరిణామము, క్షయము, మృత్యువు అనే వికారాలు దర్శింపబడుతూ ఉంటాయి. అలాగే రంగు, రుచి,

వాసన, వినికిడి, స్పర్శ ఇత్యాదివి జరిగి, పోతూ ఉంటాయి. ఇన్నిటిని పరికించుచున్న "నేను" అను ప్రజ్ఞ శాశ్వతము. తాను శాశ్వతుడై తనచుట్టును అశాశ్వతమైన ప్రపంచం అనేకరకాల వికారాలతో గోచరిస్తూ ఉంటుంది. తాను సత్యం, తనయందు ప్రతిబింబించే ప్రపంచం అసత్యం. బాహ్య ప్రపంచమంతా ప్రతిబింబితమే. అది అద్దాల మేడ వంటిది. అందు ప్రతిబింబించే సమస్త రూపములు నిజమునకు తానే. ఇది తెలియుటయే తెలివి. ఈ తెలివి లేనప్పుడు జీవుడు తనను తాను మరచుట జరుగును. కనుక యమదేవుడు బాహ్యాకర్షణలకు లోనుకాక, యథార్థమును గుర్తించమని నచికేతుని హెచ్చరించు చున్నాడు.

(29)

**శ్లో॥ యేన రూపం రసం గంధం శబ్దాన్ స్పర్శాంశ్చ మైథునాన్।**
**ఏతేనైవ విజానాతి కిమత్ర పరిశిష్యతే ఏతద్వై తత్ ॥**

(4-3)

నచికేతా! రంగు, రుచి, వాసన, శబ్ద, స్పర్శలు నీలో తెలుసుకొనే వాడే ఆత్మ! అతడే నీవు.

*వివరణము :* తానన్నియు తెలుసుకొనుచు, నేను-నేను అనెడి వాడు ఆత్మయే. తానే ఆత్మ. తనవలననే తనకు సమస్తము తెలియుచున్నది. తాను శుద్ధ చైతన్యం. తన రూపము, తన పేరు, తన గోత్రము కూడ తనకు తెలియుచున్నవి. ఈ తెలుసుకొనువాడుగా నున్నది ఆత్మయే. తనకు తాను తెలియకపోవుట విచిత్రము కదా! తానే తన తెలివిగ నున్నాడు. తన ప్రాణముగ నున్నాడు. తానుండుట వలననే ప్రాణము, తెలివి యున్నవి. తాను లేకుండుట అనునది లేదు. తానెప్పుడూ ఉండగ, తనకు తెలియు ఇతర విషయము లన్నియు ఎప్పుడూ మారుచు నుండును. ఇతరము గమ్యముగ తాను వర్తించుచున్నపుడెల్ల, ఇతరములు తనకు తెలియుచున్నవి. తాను గమ్యముగ వర్తించునపుడు, తనకు తాను తెలియకపోవుట ఎట్లుండును? ప్రయత్నమున శుద్ధి యున్నచో తనకు తాను తెలియకుండుట యుండదు.

(30)

**శ్లో॥ స్వప్నాంతం జాగరితాంతం చోభౌ యేనానుపశ్యతి ।**
**మహాంతం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి ॥**

(4-4)

నచికేతా! స్వప్నావస్థలో, జాగ్రదవస్థలో అన్ని విషయాలను దర్శిస్తున్నవా డాత్మయే. తన్ను తాను దర్శించినచో తాను మహత్తునకు కూడ అతీతుడని తెలియును.

*వివరణము :* మహత్తు, గుణములు, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ ములు, మనసు, బుద్ధిగా తానెట్లు వర్తించుచున్నాడో తెలియుట ఆత్మజ్ఞునకు సాధ్యము. ఆత్మజ్ఞుడు తాను సహజముగ సర్వవ్యాపి యనియు, స్థానికముగ అహంకారి యగుచున్నాడని తెలియును. అహంకారస్థితి కాలమునకు దేశమునకు వర్తించునుగాని, తనకు వర్తించదు. ఒక కాలమున, ఒక దేశమున వర్తించుటకు అనేకమే ఏకముగ కన్పట్టును. కర్తవ్యానంతరము మరల అనేకమగును. అనంతమగు సముద్రమునందు ఒక మంచుగడ్డ ఏర్పడునట్లు అహ మేర్పడును. మరల మంచుగడ్డ కాలాంతరమున సముద్రమే యగును.

అహముగా ఏర్పడుట స్థానికమగుటకే. సముద్రమే మంచు గడ్డగ కనిపించుచున్నది. పరమాత్మయే జీవాత్మగ గోచరించును.

ప్రత్యేకముగ గోచరించును గనుక 'ప్రత్యేగాత్మ' అందురు. ఇది ఉంగరము, ఇది గొలుసు, ఇది వడ్డాణము, ఇది వంకీ అని పిలువబడు చున్నవన్నియు పూర్వము బంగారమే. ప్రస్తుతము కూడ బంగారమే. తరువాత అన్నియు కరిగించినచో మిగిలినది కూడ బంగారమే. అట్లు సర్వవ్యాపకమగు ఆత్మ నేను, నీవు, అతడుగ గోచరించును. కాని మూలమున నున్నది ఆత్మయే.

యమునికి యమత్వము, యమధర్మము పాత్ర పోషణమేగాని, తాను ఎవరో యెరిగి యున్నవాడు. సినిమాలలో చూపించునట్లు "యముండ!" అని మీసము మెలివేయడు. సమస్తమే తానుగ నుండి, తన కర్తవ్యమును, ధర్మమును నిర్వర్తించును. ఇతర సమయములలో సర్వవ్యాపియైన ఆత్మగ వెలుగొందుచుండును. అతడు ధీరుడు. తానట్టివాడు కనుకనే "ప్రాజ్ఞుడగు వాడు మహత్తరమైన, విశ్వవ్యాప్తమైన తత్త్వమును సాక్షాత్కరించుకొని అదియే తానుగ సంతసించుచు నుండును, శోకింపడు" అని నచికేతునకు తెలిపెను.

(31)

**శ్లో॥ య ఇమం మధ్వదం వేద**
**ఆత్మానం జీవమంతికాత్ ।**
**ఈశానం భూతభవ్యస్య న తతో**
**విజుగుప్సతే ఏతద్ వై తత్ ॥** (4-5)

నచికేతా! జీవితము నాస్వాదిస్తున్నవాడు జీవాత్మయే. అతని కాధారమైనవాడు అతనియందే యున్నాడు. అతడు ఈశ్వరుడని పిలువ బడుచున్నాడు. ఈశ్వరుడు భూత, భవిష్యత్, వర్తమానములు వ్యాప్తి చెందినవాడు. అతనితో కూడిన జీవాత్మ ఏ భయమూ లేక శాశ్వతుడై ఉంటాడు.

*వివరణము :* ఈశ్వరునితో కూడిన వానికి మరణానుభవ ముండదు. ఇనుము అయస్కాంత సన్నిధియందు అయస్కాంతమైనట్లు, ఈశ్వరుని సాన్నిధ్యమున నిత్యము ఉన్నవానికి శాశ్వతత్వము సిద్ధించును. ఈశ్వరునితో కూడి జీవన వైభవమును ఆస్వాదించుట సహజ యోగము. ఈశ్వరునితో కూడిన వానిని త్రిగుణములు, పంచభూతములు బంధింపలేవు. రాజుతో కూడి తిరుగుచున్న వానిని రాజభటులు బంధించలేరు గదా! కనుక జీవితమంతయు తేనెవంటి మధుర అనుభూతి సహజ యోగయుక్తులకు లభ్యమై యుండును.

నిజమునకు జీవునకు ఈశ్వరుడు అత్యంత సన్నిహితుడు. తనయందే నిహితమై యుండుట వలన జీవుడు గుర్తింపలేక, అతడితో కూడి యుండలేక బంధనావస్థలను, భయమును పొందుచున్నాడు. మరణమును కూడ కొనితెచ్చుకొను చున్నాడు. జీవనానుభూతి నిశ్శేషముగ, మధురముగ అనుభూతి చెందుటకు ఈశ్వర సాన్నిధ్యము ఉత్తమోత్తమ మార్గము. అట్టి ఈశ్వరుడు తనయందే, తనవలెనే యుండుట వలన స్థూలపుబుద్ధికి గ్రహింపు కలుగదు. కనుకనే ఇన్ని తిప్పలు.

తన లోపలనున్న వానిని చూడలేకపోవుటయే జీవుని సమస్త సమస్యలకు కారణమై యున్నది. తనలోనికి తాను శోధన చేయుట ప్రధానము. బాహ్యమగు శోధనలు శాశ్వతత్వము నీయజాలవు.

(32)

**శ్లో॥ యః పూర్వం తపసో జాత**
**మద్భ్యః పూర్వమజాయత ।**
**గుహాం ప్రవిశ్య తిష్ఠంతం యో**
**భూతేభిర్వ్యపశ్యత ఏతద్వై తత్ ॥** (4-6)

నచికేతా! దేనినుండి తపస్సు జనించు చున్నదో, దేని నుండి జ్ఞానము జనించుచున్నదో అది పూర్వము నుండి యున్నది. అదియే హృదయ గుహయందలి స్పందనమునకు మూలమై యున్నది. అదియే పంచభూతములకు ఆధారమై యున్నది. నిజమున కదియే ఇదిగ పరివర్తన చెంది యున్నది.

*వివరణము :* అదియే ఇదిగ నున్నను అనేకమార్లు నచికేతునికి యమదేవుడు తెలుపుట ఈ యమగీతయందు కన్పట్టును. మూల మగు ఒక వస్తువు ఆధారముగను, మూలప్రకృతి అనేక విధములుగ పరివర్తనములు గావించుచున్నది. వైవిధ్యముతో కూడిన ఈ సృష్టి యంతయు మూలమున ఒకటియే. పరివర్తనము చెందునపుడు అందు మూలము గుర్తించుట లోదృష్టి. అనేకానేకమగు దుస్తులను చూతుము, వానికి మూలము పత్తియే. అనేకమగు పిండివంటలు చూతుము, వానికి మూలము పిండియే. పరతత్వమును పరాప్రకృతి మూడు

గుణములుగను, ఐదు భూతములుగను పరివర్తనము గావించును. అందు మూల మొక్కటియే. ఆవిరి నీరుగ మారి, నీరు మంచుగడ్డగ మారును.

ఇట్లు అవికారమగు తత్త్వము అనేక ఆకారములను, వికారములను పొందుట వలన అనేకములు గోచరించు చున్నవి.

మనయందలి పంచభూతములకు మూలమాకాశము. ఆకాశము యొక్క మూలము తమోగుణము. తమస్సు, రజస్సు, సత్వము అను గుణములకు మూలము మహత్తు. మహత్తనగ ఏమీ లేనట్లుగ గోచరించు చోటు. అందుండి గుణములు, పంచభూతములు వ్యక్తమైనవి. మహత్తునకు మూలము కాలము. కాలమునకు మూలము సంకల్పము. సంకల్పమునకు మూలము పరతత్వము. పరతత్వము ప్రకృతి–పురుషుల సమన్వయ సమాహార ప్రజ్ఞ.

ఒకే విత్తనమునుండి మహావృక్షము పుట్టి, శాఖోపశాఖలుగ విస్తరించి, ఉపశాఖల నుండి రెమ్మలు, ఆకులు పుట్టి వైవిధ్యము చూపును. విత్తనమే కాలక్రమమున ఇన్ని మార్పులకు గురియై మహావృక్షమై గోచరించు చున్నది. అట్లే మనయందలి మూలతత్త్వమే మనముగ గోచరించు చున్నాము. విస్తారముగ వికారము చెందిన ఆకారమునందు అవికారుని దర్శించమని సూక్ష్మబుద్ధియగు నచికేతునకు యమదేవుడు ఉపదేశము చేసెను. ఈ కనపడుచున్న దంతయు 'అదియే' అనియు, 'అదియే' ఇదిగ నున్నదనియు, ఈ 'ఇది' యందు 'అది'ని గుర్తింపమనియు తెలుపుతున్నాడు.

(33)

**శ్లో॥ యా ప్రాణేన సంభవత్యది**
**తిర్దేవతా మయీ ।**
**గుహాం ప్రవిశ్య తిష్ఠంతీం యా భూతే**
**భిర్వ్యజాయాత ఏతద్ వై తత్ ॥** (4-7)

నచికేతా! ఏది ప్రాణరూపంలో అభివ్యక్త మవుతుందో, ఏది దేవతల మూలముగ తెలియబడుతుందో, దేనిని 'అదితి' అని సంబోధిస్తారో, దేనివలన త్రిగుణములు, పంచభూతములు ఏర్పడు తున్నాయో, ఏదైతే హృదయమందు ప్రవేశించి తిష్ఠ వేసుకొని ఉన్నదో అదే ఆత్మ. ఇదంతా అదే.

*వివరణము :* నచికేతుడు సూక్ష్మగ్రాహి. గురువగు యమ దేవుడు ఉత్తమోత్తమ బోధకుడు. ఆత్మ దర్శనానికి కనపడుతున్న దాని మూలాన్ని దర్శించమని యమదేవుడు తెలుపుతూ ఉన్నాడు. వ్యక్తమై చేష్టలు చూపుచున్న వాని మూలము ఆత్మగ దర్శించమని యముడు సూచిస్తున్నాడు.

1. ప్రాణమొక ఉదాహరణ. ప్రాణము స్పందనముగ, శ్వాసగ తెలియబడుతుంది. అట్టి ప్రాణ స్పందనమునకు మూలమేమి? అవ్యక్తముగ ఆత్మయే!

2. అనేకానేక దేవతా ప్రజ్ఞలకు మూలము శుద్ధ చైతన్యము. శుద్ధ చైతన్యము ఎరుకగా ప్రకాశించుటకు మూలమేమి? ఆత్మయే.

3. పంచభూతములకు మూలము తమస్సు. తమస్సునకు మూలము మహత్తు. మహత్తునకు మూలము సంకల్పము. సంకల్పము నకు మూలము ఆత్మయే.

ఇట్లు సృష్టియందలి సమస్తమునకు మూలముగ ఆత్మ యున్నది. ఆత్మయే ఆధారముగ లేనపుడు చైతన్య విలాసముండదు. ప్రాణ వ్యాపార ముండదు. గుణములు, పంచభూతములు ఉండవు. స్థూల, సూక్ష్మ, కారణ లోకములలో అనేకానేక విషయములు ఏర్పడుటకు కారణ మాత్మయే.

అట్టి ఆత్మయే మానవుని హృదయమందలి గుహలో ప్రాణము నకు, ప్రజ్ఞకు ఆధారమై యుండునని యమధర్మరాజు ఈ శ్లోకమున బోధించు చున్నాడు. లోదృష్టితో చూచినచో అన్నిటియందు ఆత్మయే గోచరించ గలదు. ప్రతిజీవుడును ఆత్మయొక్క వ్యక్త రూపమే. వ్యక్త మందు అవ్యక్తమును దర్శించుటయే ఆత్మజ్ఞాని లక్షణము. ఆత్మకన్న ఇతరముగ గోచరించు సమస్తము ఆత్మనుండి ఏర్పడినవే. ఈ కనపడు తున్నదంతయు అదే. 'ఇది నిజాని కదే', 'అదే ఇది' అను సత్యము సూక్ష్మగ్రాహ్యము. బుద్ధిగ్రాహ్యము. ఆత్మసాధకుడు పరిశోధకుడై చూచునపుడు యముని బోధ అవగతము కాగలదు. దర్శనము కాగలదు.

ఆత్మ నుండి పుట్టిన సమస్తము వృద్ధి చెందుచు, మార్పు చెందుచు, క్షీణించుచు ఆత్మలోనికే లయమగును. ఆత్మకు మరణము లేదు. ఆత్మ నుండి పుట్టిన అంశములకు హాని వృద్ధులు, జనన మరణములు ఉండును.

(34)

**శ్లో॥ అరణ్యోర్నిహితో జాతవేదా గర్భ**
**ఇవ సుభృతో గర్భిణీభిః ।**
**దివే దివే ఈడ్యో జాగృవద్భిర్హ**
**విష్మద్భిర్మనుష్యేభిరగ్నిః ఏతద్ వై తత్ ॥**(4-8)

నచికేతా! అరణిలో నిహితమై అగ్ని ఉన్నట్లు తల్లి గర్భమున నిహితమై రక్షింపబడుచు, పోషింపబడుచున్నట్లుగ ఆత్మ అన్నిటి యందును నిహితమై యున్నది. ఇట్లు నిహితమైన అగ్నిదేవుడే సమస్తమునకు ఆధారము. తెలిసినవారు నిహితమగు అట్టి అగ్నిని (ఆత్మను) ఆరాధించు చున్నారు.

*వివరణము :* సమస్త సృష్టికిని అగ్నియే ఆధారము. *"అగ్రేనియతి ఇతి అగ్నిః"* ముందు నిలచునది అగ్ని. అగ్ని ఆధారముగనే సమస్తము ఏర్పడుచున్నది. చైతన్యము, ప్రాణము అగ్నియే. జ్ఞానము, క్రియ అగ్నియే. సంకల్పముకూడ అగ్నియే. అగ్ని లేక ఏమియును లేదు. జీవాత్మ, పరమాత్మ కూడ అగ్ని స్వరూపములే. ఏడు లోకములందు, ఏడు ఉపలోకములందు వ్యాపించి ఉన్నది కూడ అగ్నియే. అగ్ని కేవలము పంచభూతములలో అగ్ని కాదు. సూర్యుని కాంతి కూడ

అగ్నియే. సవితృమూర్తి తేజస్సు అగ్నియే. ప్రచండముగ వెలుగు మండలములకు, గోళములకు కూడ మూల మగ్నియే. అగ్ని ప్రభావముననే అన్నియు వ్యక్తమై యున్నవి. అట్టి అగ్ని అన్ని వస్తువుల యందు కూడ వ్యాపించి, నిహితమై యున్నది.

వస్తువేదైనను దాని మూల మగ్నియే. మూలమందు నిహితమై యున్న అగ్నిని అన్ని వస్తువులయందు చూడవచ్చు. అట్లు చూచుట ఋషిదృష్టి. అరణియందలి అగ్నిని రాపిడితో యజ్ఞకర్తలు వ్యక్తం చేస్తూ ఉంటారు. ఆత్మ అనే అగ్నిని అనుభూతి చెందడానికే ప్రాణా యామ యజ్ఞం. తల్లి గర్భమందలి శిశువగ్ని స్వరూపుడే. అట్టి శిశు వును పరిరక్షించేది, పోషించేది కూడ అగ్నియే. చూడాలేగాని, పదార్థముచే కప్పబడిన సమస్త వస్తువులయందు ఉన్నది అగ్నియే. సృష్టియందగ్ని అద్భుతములలో కెల్ల అత్యద్భుతము. అగ్నిజాలమే సృష్టి. అట్టి అగ్నిని వేదములు ప్రప్రథమముగ ప్రశంసించు చున్నవి. ఋషులు అగ్నికొరకే వేదఘోషలు చేయుచు నున్నారు. అట్టి అగ్ని ఆత్మయే. ఆత్మ ప్రకాశమే అగ్ని. ఆత్మ స్వయంప్రకాశము.

(35)

**శ్లో॥ యతశ్చోదేతి సూర్యోఽస్తం యత్ర చ గచ్ఛతి ।**
**తం దేవాః సర్వేఽర్పితాస్తదు నాత్యేతి కశ్చన ।**
**ఏతద్ వై తత్ ॥** (4-9)

నచికేతా! సూర్యుడు దేని నుండి ఉదయిస్తూ, దేని లోనికి అస్తమిస్తాడో దాని నుండే సమస్త దేవతలు అమర్చబడి యున్నారు. దాని నెవ్వరును అతిక్రమించ లేరు. అదియే ఇదంతా.

*వివరణము :* సత్-చిత్ తత్త్వమే సమస్తమునకు ఆధారము. సత్-చిత్ అనగా ఉనికి - ఎరుక. దాని నుండే సమస్త దేవతలు, సమస్త లోకములు, సవితృ మండలములు, సూర్యమండలము, భూ మండలము, జీవులు, వారి శరీరములు సమస్తము ఒక అల్లికగ ఏర్పడుచున్నది. నిజమునకు ఈ ఏర్పడిన సమస్త సృష్టికి సత్-చిత్‌యే ఆధారము. పత్తి ఆధారముగ దారము, దార మాధారముగ వస్త్రములు, వానిపై అల్లికలు, రంగులు ఇత్యాది వన్నియు ఏర్పడునపుడు, మూల మగు పత్తి అంతర్హితమైపోవును. ఉన్నట్లు కూడ తెలియదు. కాని పత్తిలేక మిగిలిన వస్త్రమేమియు ఉండదు. అట్లే ఏడంతస్తుల భవనము అందముగ నిలచుటకు బలమగు పునాదులు భూమిలోపలగ

ఉండవలెను. అది ఎవ్వరికిని గోచరము కాదు. పునాదులు లేక భవనమే లేదు.

సత్–చిత్ తత్త్వము లేక ఏమియు ఏర్పడదు. వైవిధ్యముతో కూడిన ఈ సృష్టికాధార మిదియే. సృష్టి యున్నను, లేకున్నను సత్–చిత్ తత్త్వములు సృష్టియందు, సృష్టికి పూర్వము కూడ ఈ తత్త్వ మెప్పుడును యున్నది. అది శాశ్వతము. నిజంగా అదే ఈ సృష్టిగ నున్నది. కనుక యమదేవుడు మాటిమాటికి "ఏతద్ వైతత్" అను పలుకుచు నున్నాడు. అనగా అదియే ఇదిగా ఉన్నదని అర్థము. కనపడుతున్న సృష్టియందు అంతర్హితముగ నున్నది అదియే. దానినే దర్శించువానికి మూలముతో కూడియుండుట అలవాటగును. మూలముతో కూడియున్న వానికి శాశ్వతత్వ మననేమో తెలియును. మరణము మార్పేగాని తనకు అంతము కాదు అని తెలియును. మార్పులెన్ని వచ్చినను తానెప్పుడూ శాశ్వతుడై యున్నాడని తెలియును. అందులకే ఈ ఉపదేశమంతయు.

(36)

**శ్లో॥ యదేవేహ తదముత్ర యదముత్ర తదన్విహ ।**
**మృత్యోః సః మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి॥**

(4-10)

నచికేతా! అక్కడ ఉన్నదే ఇక్కడ ఉన్నది. ఇక్కడ ఉన్నదే అక్కడ ఉన్నది. ఇక్కడ వివిధంగా కనిపిస్తున్నా, ఉన్నది అది ఒక్కటే. అలా తెలిస్తే మరణం లేదు. తెలియకపోతే మరణం పొందుతారు.

*వివరణము :* ఎన్ని రకాలుగా కనిపిస్తున్నా ఉన్నది ఒక్కటే. వ్యక్త స్థితిలో అనేకంగా గోచరిస్తూ ఉంటుంది. అవ్యక్త స్థితిలో ఒకటిగానే ఉంటుంది. ఎన్నిగా కనిపించినా ఒకటే యున్నదని తెలియటం జ్ఞానం. అనేకంగా దర్శించటం అజ్ఞానం. అల, సముద్ర ముగా ఉన్నది సముద్రమే. ఇది వ్యక్త స్థితి. సముద్రముగా కొంత శాశ్వతత్వ మున్నది. అలకు శాశ్వతత్వము లేదు. అలలు మాత్రమే చూచేవారికి పుట్టుట, అంతము కనిపిస్తాయి. సముద్రమును చూచిన వారికి అల పుట్టుక చావులు విలాసంగా గోచరిస్తాయి. అభేద స్థితిని జ్ఞప్తియందుంచుకున్నపుడు అది ఆధారంగా ఏర్పడు మార్పు లంత బాధింపవు. మార్పులను చూచేవారికి అభేద స్థితి గోచరించదు.

ఒకప్పుడు ఉన్నట్టుగాను, ఒకప్పుడు లేనట్టుగాను వ్యక్తావ్యక్తములుగా ఒకటియే యున్నది. దానిని చూచుట నేర్వమని యముడు తెలియ జేయుచున్నాడు. వివిధముగాను, భిన్నముగాను ఉన్నదని చూచేవాడు మార్పుకు గురియై మళ్ళీమళ్ళీ మరణిస్తూ ఉంటాడు.

తనకు వార్ధక్యము వచ్చినదని, రేపో మాపో తాను మరణిస్తా నని భావించే వృద్ధులు అసంఖ్యాకముగా నున్నారు. నిజానికి తనకు వార్ధక్యం రావటంగాని, తాను మరణించటంకాని సత్యములు కావు. తన శరీరానికి వార్ధక్యం రావచ్చు. తన శరీరం తాను త్యజించవలసిన అవసరం రావచ్చు. తాను ధరించునది తాను విసర్జించుట సహజము. ధరించునపుడు తాను పుట్టనూ లేదు, విసర్జించునపుడు తాను మరణించటమూ లేదు. అట్లు భావించడానికి కారణము తన శరీరమే తాను అనుకొనుట వలన జరుగును. తాను శరీరమును ధరించినవాడే గాని, తాను శరీరం కాదు అని తెలిసియుండుట ప్రధానము. తెలిసి యుండుట అనగా వినికిడిగ తెలియుట గాదు. అంతఃశ్చేతన యందు స్థిరపడవలయును. అట్లు కానిచో తెలిసినను గుర్తుకు రాదు.

## 37

**శ్లో॥ మనసైవేదమాప్తవ్యం నేహ నానా౽స్తి కించన ।**
**మృత్యోః స మృత్యుం గచ్ఛతి య ఇహ నానేవ పశ్యతి ॥**

(4-11)

నచికేతా! మనసుచేతనే తత్త్వాన్ని సాక్షాత్కరించు కోవాలి. మనసునందు వైవిధ్యం దర్శించడంగా కాక ఏకత్వాన్ని దర్శించాలి. వైవిధ్యం దర్శించే మనసు మరణమునకు దారి చూపుతుంది.

*వివరణము :* మనసునకు విశ్లేషణ ఒక లక్షణం. ఒక దానికన్న ఒకటి ఎట్లు భిన్నమో తెలియజేసే లక్షణం ఉన్నది. వైవిధ్యమును గుర్తించే శక్తి ఉన్నది. అన్నీ విభజించి, పరిశీలించి ఒక దానికన్న ఇంకొకటి ఎట్లు భిన్నమో తెలియజేసే తెలివి ఉన్నది. విభజన మనసు లక్షణము.

అదే మనోప్రజ్ఞకు అన్నిటిని సమన్వయించగల శక్తి కూడ యున్నది. ఒకటిని పదిగ విశ్లేషించు మనసు పదింటినీ సమన్వయించి, ఒకటిగ చూడగలుగు శక్తి కూడ యున్నది. విశ్లేషణ, విభజన ఒక ముఖమైతే; సమన్వయించుట, సమగ్రముగ దర్శించుట మరియొక ముఖమై యున్నది. భేద దర్శనమునకు, సమదర్శనమునకు కూడ

మనసును వినియోగించ వచ్చును. అట్లే వైవిధ్యముతో కలిగిన భావముల యందు సమభావమును గ్రహింపవచ్చును. వైవిధ్యమగు ప్రవర్తనమున్నచోట సమవర్తనము కూడ నిర్వర్తింపవచ్చును.

మనసునకు సమభావము, సమదర్శనము, సమవర్తనము అభ్యసింపజేసినచో, సమగ్రమగు ఒకే తత్త్వము అనిర్వచనీయమగు వైవిధ్యము నెట్లు పొందుచున్నదో తెలియవచ్చును. ఎంత సమదర్శన మబ్బినచో అంత సమగ్రత దర్శనమగును. అట్టి మనసునకు వైవిధ్యము నందలి ఏకత్వము దర్శనమగును. మనసునకు ఈ విధమగు శిక్షణ ఇచ్చుటకే విద్యలన్నియు. ఏడు వర్ణములు ఒక వర్ణము నుండే ఏర్పడినవి. ఏడు శబ్దములు ఓంకారము నుండే ఏర్పడినవి. ఒకటి మూడగుట, మూడు ఏడగుట, ఏడు పదియగుట ఎట్లు జరుగునో తెలియును. ఒకే ఆకాశము వివిధ సమయములలో వివిధంగా గోచరిస్తూ ఉన్నది. అది ఒకటే. అనేక రకములుగ గోచరించినను అది ఒకటే. అట్లే "నేను" అనెడి జీవుడు ఒకటే. అన్ని సన్నివేశముల యందు తాను తానుగనే ఉంటాడు. తన స్వభావమందు వైవిధ్య ముంటుంది. అయినా తాను, తానే. తనయందలి వైవిధ్యం చూడక, తనను తాను చూచువానికి మరణముండదు. ఆకాశం ఎర్రగా గోచరిస్తుంది. సిందూరవర్ణంగా గోచరిస్తుంది. బంగారు కాంతితో గోచరిస్తుంది. తెల్లని కాంతితో గోచరిస్తుంది. రాత్రియందు నీలము గను, నలుపుగను కూడ గోచరిస్తుంది. నిజానికి ఏ రంగూ లేని

చోటే ఆకాశము. దానిపై అనేక రంగులు ఏర్పడుతు పోతూ ఉంటాయి. అలాగే జీవుడు కూడ తనదైన స్వభావము ఏదియు లేనివాడు. అతనిచుట్టునూ అల్లుకున్న గుణముల స్వభావమే అతడుగ గోచరిస్తాడు. కాని ఆకాశమువలె ఏ గుణములు అంటనివాడు "నేను" అనే జీవుడు. అతడే దేవుడు కూడ. గుణముల కావల దేవుడు. గుణములలో జీవుడు. అట్టి తన స్వరూపం ఎట్టి వైవిధ్యము కలిగి యుండదు. కాబట్టి మరణముండదు.

నిజానికి ఈ బోధన చేస్తున్న యమధర్మరాజు తనకు తానుగ 'నేను' అను ప్రజ్ఞ. లోకములకతడు యముడు. తనకుతాను యముడు కాదు. "నేనే". నేనుగ సదా తనకు తాను గుర్తుండి, తన కర్తవ్యాన్ని పరిపాలిస్తూ ఉంటాడు. నచికేతునకు యిట్టి లోతైన రహస్యమును తెలిపాడు.

(38)

**శ్లో॥ అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి ।**
**ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే ।**
**ఏతద్ వై తత్ ॥** (4-12)

నచికేతా! బొటనవ్రేలు పరిమాణముగల పురుషుడు ఈ శరీరంలో నివసిస్తూ ఉన్నాడు. మూడు కాలముల యందు అతడే ప్రభువు. ఇది అనుభూతి చెందిన మానవుడు మరణమును గూర్చిన భయము చెందదు. అతడే ఆరడుగుల రూపంతో కనిపిస్తున్నాడు. ఈ కనిపిస్తున్న రూపమునకు మూలమతడే.

*వివరణము :* యమదేవుడు నచికేతునికి మానవునిగా గోచరిస్తున్నవాని మూలమందు అదే రూపంతో బొటనవ్రేలు పరిమాణంలో ఆ రూపమందలి హృదయమందు ధ్యానించి దర్శించమని తెలిపాడు.

పురుషుడనగా పురమునందు వసించువాడు. సృష్టియందలి ప్రతిరూపము పురమే. అందు పురుషుడు సూక్ష్మంగా అదే రూపంలో ప్రకాశిస్తూ ఉంటాడు. సూక్ష్మమగు జీవులకు స్థూలమగు శరీరము లేర్పడుతుంటాయి. సూక్ష్మంగా మానవ శరీరంలో ఉండే జీవుడు, ఆ మానవుని బొటనవ్రేలంత హృదయంలో ప్రకాశిస్తూ ఉంటాడు.

అది ఆధారంగా స్థూలమైన రూపం ఏర్పడి ఉంటుంది. మామిడి టెంకలోని గింజ ఆధారంగా మామిడిచెట్టు ఏర్పడుతుంది. చెట్టు విస్తారంగా ఉంటుంది. గింజ చిన్నదిగా ఉంటుంది. మఱ్ఱిగింజ ఆధారంగా మఱ్ఱిచెట్టు ఏర్పడుతుంది. గింజ పరిమాణానికి, చెట్టు పరిమాణానికి చాల వ్యత్యాస ముంటుంది. ఇది ప్రతి జీవి విషయం లోను సత్యం. జీవుడు సూక్ష్మంగా ఉంటాడు. రూపం స్థూలంగా పెద్దదిగా ఉంటుంది. అలా మానవుని విషయంలో మూలరూపుడగు జీవుడు ఆ మానవుని బొటనవ్రేలంత ఉంటాడు. అతని హృదయ మందు పరమాత్మ ఉంటాడు. స్థూల దేహమందలి స్థూలమగు హృదయమందు జీవుడుండగ, అతనియందు పరమాత్మ ఉంటాడు.

జీవుని స్థూల దేహమందు గల ప్రాణస్పందనమే హృదయము. ఆ స్పందనమందు సూక్ష్మరూపంలో బొటనవ్రేలు ప్రమాణంలో జీవుడు తనకు తానే కాంతివంతముగా గోచరిస్తాడు. ప్రథమంగా హృదయంలో తన తేజోరూపమే తనకు గోచరిస్తుంది. సూక్ష్మంగా బొటనవ్రేలంత రూపము అత్యంత కాంతివంతంగా గోచరిస్తుంది. హృదయ కమలం యొక్క గుహలో అట్టి తన రూపాన్ని తాను దర్శించినవాడు సూక్ష్మ లోకానుభూతి పొందుతూ ఉంటాడు. తేజోరూపుడుగ ఆ దేహమందు తాను వర్తిస్తూ ఉంటాడు. హనుమంతుడు సూక్ష్మరూపంతోనే అశోక వనంలో సంచరిస్తాడు. సూక్ష్మరూప దర్శనము స్వస్వరూప దర్శనంగా ఋషులు తెలుపుచున్నారు. అది బంగారు కాంతిగను, వజ్రకాంతిగను

కాంతివంతమై ఉంటుంది. ఈ రూపానుభవమైన వారు శరీరము నుండి వెలువడి కూడ కార్యక్రమములు నిర్వర్తిస్తూ ఉంటారు. పగలు స్థూల దేహంతోను, రాత్రి సూక్ష్మ దేహంతోను పనిచేసే యోగులు, ఋషులు అనేకులు భూమిపై నేటికిని యున్నారు.

అంగుష్ఠమాత్ర పురుషుని అవగాహన మన గ్రంథములలో అనేకచోట్ల తెలుపబడినది. ఈ పురుషుని గూర్చియే శ్రీకృష్ణ భగవానుడు అక్షర పురుషుడని అభివర్ణించినాడు. ఆ అక్షర పురుషుని హృదయ మున పురుషోత్తమునిగ తానున్నానని కూడ తెలిపినాడు. పురుషోత్తము డాధారముగ అక్షరుడగు జీవుడు, జీవుడాధారముగ అతని క్షరమగు స్వభావము, దేహము ఏర్పడుచుండును. వీరినే దేహాత్మ, జీవాత్మ, పరమాత్మ అని పలుకుదురు. అట్లే క్షరపురుషుడు, అక్షర పురుషుడు, పురుషోత్తముడు అని పలుకుదురు.

అక్షర పురుషునకు మరణము లేదు. అతడు నరుడు. నశింపని వాడు. పురుషోత్తమునివలే శాశ్వతుడు. క్షరపురుషుడు ప్రతి జన్మము నకు మారును. అతనికి మరణము, జననము ఉన్నవి. దేహమే తాము అనుకొని, దేహ సంబంధములు తమవి అని భ్రమపడుచు జీవించువాడు మరణమును చవిచూచును. దేహాత్మ భావన విడచి, తన నిజస్థితి యగు జీవాత్మగ తన నెరుగుట వలన ప్రపంచమున తన కేర్పడిన సంబంధము లన్నియు శాశ్వతము కాదనియు, ప్రపంచ మొక కురుక్షేత్ర మనియు, ధర్మముతో ఆ క్షేత్రమున తాను పాత్ర

ధారణము చేసి, ప్రతినిత్యము నిద్ర సమయమునకు తన నిజస్థితిని తాను గుర్తించుచు జీవించవలెనని తెలియవలెను.

ప్రపంచమొక నాటకరంగమని తెలిసి, అందు నటునివలె తాను పాత్రధారణ చేయుచున్నానని గుర్తు యుండవలెను. సాయంత్రమునకు నాటక రంగమునుండి విడుదల కలిగినపుడు తన వేషధారణము, పాత్ర ధారణము అటకెక్కించి తానుగ నుండ వలెను. తాను జీవుడుగ దైవాంశయే. ప్రపంచమున తనవంతు పాత్రను పోషించుటకు క్షరత్వమున ప్రవేశించుచున్నాడు. ఈ విచారము నిత్యముండవలెను. లేనిచో నటుడు తన పాత్రయే తానని భ్రమ చెందును.

జీవుడుగ తానక్షరుడు. ఈ శరీరమున బొటనవ్రేలంత పరిమాణమున స్వయం ప్రకాశకుడై యున్నాడు. ఆ బొటనవ్రేలంతటి రూపమే నమూనాగా ఈ కనపడుచున్న ఆరడుగుల శరీరము సప్తధాతువులతో ఏర్పడినది. కనుక ప్రథమముగ తన అంగుష్ఠ రూపమును తాను దర్శనము చేయ ప్రయత్నింపవలెను. అది తన నిజ స్వరూపము. నిత్య స్వరూపము. ప్రకాశవంతమైనది. దాని హృదయమున ఈశ్వరుడున్నాడు.

ఈ అంగుష్ఠరూపము శరీరము నుండి బయల్పడునపుడు పరిమాణము మారగలదు. సూక్ష్మముగను యుండగలదు. గరిష్ఠము గను యుండగలదు. తేలికగను ఉండగలదు. బరువుగను ఉండగలదు. దేహమునందున్నపుడు మాత్రమే బొటనవ్రేలంత వుండును.

అంగుష్ఠ పురుషునకు దేహమొక గృహమువంటిది. గృహము నుండి పనిచేయవచ్చును. యోగులు, ఋషులు అట్లే పని చేయు చున్నారు. నిత్య ధ్యానము వలన తన హృదయమందుగాని, భ్రూమధ్య మందు గాని తనను తాను ఒక వెలుగుమూర్తిగ అంగుష్ఠమాత్రముగ దర్శించు ప్రయత్నమును ఉపనిషత్తులు, ఋషులు, యోగులు బోధించు చున్నారు.

అంగుష్ఠునికి ఈవల క్షరపురుషుడు, అతని లోపల పురుషోత్త ముడు యున్నారు. తాను మధ్యముడై యున్నాడు. పురుషుని ఈ మూడు స్థితులను 'అస్యవామస్య సూక్తము' (సుపర్ణ సూక్తము) నందు కూడ వివరింపబడినది. ఈ ముప్పురిలో నశించువాడు లేక మరణించువాడు క్షరుడొక్కడే. అక్షరుడు, పురుషోత్తముడు నశింపరు. మానవుడు తన క్షర స్థితియందే యుండిపోక తానక్షరుడని ఎరుగ వలెను. తన అక్షర రూపమును ధ్యానము ద్వారా దర్శింపవలెను. అక్షరుడుగ తన స్వరూపమును తానెరిగినపుడు ఇక మరణ భయ మెందుకుండును? క్షరుడు నశించినను తాను నశించడు. ఇదియే అమర స్థితి.

అగస్త్యాంశ సంభూతులైన మాస్టర్ సి.వి.వి.గారు ఈ అక్షర స్వరూప అనుభూతినే తాను ప్రసాదించుటకు అవతరించినట్లుగ వెల్లడించినారు. సాధకులకు సూక్ష్మదేహ మమరత్వము తానే స్వయ ముగ సాధించి పెడుదునని వాగ్దానము చేసినారు. జీవులయందలి

గ్రహగతులను సర్దుబాటుచేసి, వారి సూక్ష్మదేహము వారి కవగత మగునట్లుగ తనదైన పద్ధతిలో శిక్షణ నిచ్చుచున్నారు. వారి యోగ మార్గమున అంగుష్ఠ పురుష దర్శనము ప్రథమ సిద్ధి, బ్రహ్మత్వము తుది సిద్ధి.

నచికేతునికి యమదేవుడు అదే సిద్ధిని తన ఉపదేశము ద్వారా, సాన్నిధ్యము ద్వారా ఏర్పరిచినాడు.

(39)

**శ్లో॥ అంగుష్ఠమాత్రః పురుషో జ్యోతిరివాధూమకః ।**
**ఈశానో భూతభవ్యస్య స ఏవాద్య స ఉ శ్వః ।**
**ఏతద్ వై తత్ ॥** (4-13)

నచికేతా! బొటనవ్రేలి పరిమాణముగల అక్షర పురుషుడు భూత భవిష్యత్తులకు ప్రభువు. అతడు కాంతిపుంజము లాంటివాడు. అది పొగలేని కాంతి రూపము. ఈ రోజు, రేపు కూడ అలాగే ఉంటాడు. ఒకలాగే ఉంటాడు.

*వివరణము :* జీవుడు స్వయంప్రకాశకుడు. కాంతిరూపుడు. అది ఆదిత్యకాంతి. పొగలేని కాంతి. అంతేకాదు, ఈ అంగుష్ఠుడు అక్షరుడు గనుక అలాగే ఉంటాడు. క్షర రూపము మారినా, అక్షర రూపము ఎప్పటికీ అలాగే ఉంటుంది.

ఋషులందరు అక్షర రూపమును పొందినవారే. వారు యుగముల తరబడి సృష్టిలో కార్యములు నిర్వర్తించుచు, ఒకరినొకరు గుర్తెరిగి ఉందురు. ఏ దేశంలో జన్మించినా, ఏ కాలంలో జన్మించినా వారి అక్షర రూపానికి మార్పు ఉండదు. ఇట్టి వారిని చిరంజీవు లందురు. వశిష్ఠ, అగస్త్యాది మహర్షులు, మైత్రేయాది పరమగురువులు,

యోగులు, ఋషులు యిట్టి రూపాన్ని ధరించి సృష్టి కథలో శాశ్వతులై యుంటారు. ఈ ఉపదేశం చేసిన యమదేవుడు, ఉపదేశం పొందిన నచికేతుడు కూడ అలాంటి శాశ్వతులే.

ఏ జన్మమందు సాధకునకు అక్షరరూపం సిద్ధిస్తుందో అప్పటి నుండి ఆ రూపము శాశ్వతమై ఉంటుంది. భాగవతోత్తము లందరు ఇట్టి రూపముతోనే శాశ్వతులై యున్నారు.

అక్షరుడు పురుషోత్తముని అంశయే. కనుక కాంతివంతము. సూర్యునికాంతియే సూర్యకిరణములందు కూడ ప్రకాశించుచున్నట్లు, పురుషోత్తముని కాంతియే అక్షర పురుషునియందు ప్రకాశించుచు నుండును. కాంతివంతమేగాక అందముగను, ఆకర్షణీయముగను కూడ యుండును. దైవాంశయగు జీవుని యందు దైవలక్షణములు గోచరించుట వింత కాదు. మొత్తము అన్నము ఎంత రుచిగ యుండునో అంతే రుచి ఒక మెతుకునందు కూడ యుండును గదా! కనుక ఈశ్వర లక్షణము లన్నియు జీవునియందు ప్రకాశించును. ఎప్పటికి అలాగే ప్రకాశించును. వికారము లేవియు అంటవు.

(40)

**శ్లో॥ యథోదకం దుర్గే వృష్టం పర్వతేషు విధావతి ।**
**ఏవం ధర్మాన్ పృథక్ పశ్యన్ తానేవానువిధావతి ॥**

(4-14)

నచికేతా! ఉన్నత శిఖరంపై వర్షించిన నీరు పర్వత సానువులలో లెక్కలేనన్ని పాయలై ప్రవహించినట్లు, ధర్మములను అనేక విధములుగ అవగాహన చేసుకొనేవారు చిలవలు పలవలుగ పతనం చెందుతారు.

*వివరణము :* మానవుడు నిజానికి అక్షరుడు. నశించనివాడు. నరుడు. కాని దేహాత్మ భావన చెంది తనను తాను మరచి, తన శరీర ధర్మాలను సరిగ అవగాహన చేసుకొనక శరీరాన్ని వినియోగించి, అందు చిక్కుకొని నశిస్తాడని, మరణ మనుభవిస్తాడని యమధర్మరాజు హెచ్చరిక చేస్తూ ఉన్నాడు.

అక్షరుడగు మానవుడు తేజోవంతుడు. కాంతి స్వరూపుడు. అతడు దేహమందు వశించే వాడేగాని, దేహ మతడు కాదు. మనసేంద్రియ శరీరములతో ఏర్పడిన దేహమును వాహనంగా జీవుడు అగు మానవుడు తెలిసి వినియోగించుకోవాలి. తెలియక వాహనం

నడిపితే ఎట్లు అపాయమునకు గురియవుతారో, అలాగే దేహము గూర్చి తెలుసుకొని, తనను గూర్చి తెలుసుకొని, దేహమును వినియోగిస్తూ, జీవనయాత్ర సాగించి అనుభూతిని పరిపూర్ణం చేసుకోవాలి. అలా కానపుడు అంతా అయోమయంగా ఉంటుంది.

దేహము వేరు, దేహి వేరు. దేహము కాలక్రమంలో చెడు తుంది. దేహి చెడనవసరం లేదు. వాహనం పాడైతే వాహన యజమాని పాడు కానక్కర లేదు కదా! వాహన ఆయుర్దాయం తక్కువ. వాహన యజమాని ఆయుర్దాయము చాల ఎక్కువ. కాలక్రమంలో వాహనం చెడవచ్చు. దేహం చెడవచ్చు. వాహన యజమాని చెడనక్కర లేదు. అలాగే దేహి చెడనక్కర లేదు. అస్వస్థత దేహానికి ఉండవచ్చు. తనకుండనక్కర లేదు. తాను, తన దేహము సహచరించ వచ్చును. దేహము ముదుసలియై రాలినచో తాను కృతజ్ఞతా పూర్వకముగ దానిని విసర్జించి, మరల దేహం ధరించవచ్చు. ఈ జ్ఞానము లేనివాడు అనేక విధములుగ పతనం చెందుతాడని యమదేవుడు హెచ్చరిస్తున్నాడు.

భాగవతమున బమ్మెర పోతనామాత్యుల వారు ఒక చక్కని కంద పద్యము నిచ్చినారు. అది ఈ క్రింది విధముగ నున్నది.

*క. దేహికిని దేహపుంజమునకు*
*వేరుగాని, ఏకత్వంబు కానరాదు*
*చెడిన దేహంబు చెడును*
*కాని పురుషుండు చెడదు, అతనికంత చేటు లేదు.*

తాత్పర్యము : దేహి వేరు, దేహపుంజము వేరు. దేహ పుంజ మనగా అహంకారము, బుద్ధి, చిత్తము, మనస్సు, ఇంద్రియములు, శరీరము యొక్క గుత్తి. అందు వసించువాడు జీవుడు. కాలక్రమమున చెడిపోయేది లేక నశించేది దేహమే గాని, అందు వసించు పురుషుడు కాదు. దేహమునకు వచ్చిన చేటు జీవుడికి రాదు.

కాని పై జ్ఞానము చిన్నతనము నుండి మానవులకు నేర్ప కుండుట వలన మానవుడు దేహమే తానను భ్రాంతిలో మరణిస్తూ ఉంటాడు. ఈ జ్ఞాన మిచ్చుటకే అక్షరాభ్యాస క్రతువు ఋషు లేర్పరచి నను, దాని నర్థవంతముగ నిర్వర్తించుకొనరు. తానక్షరుడని తెలిసిన బుద్ధికే అక్షర విద్య అని పేరు. దాని నభ్యసించుటకే అక్షరాభ్యాసము. అజ్ఞానవశమున అక్షరాభ్యాసము ఒక తంతుగ మిగిలిపోయినది. అది దురదృష్టం.

(41)

**శ్లో॥ యథోదకం శుద్ధే శుద్ధమాసిక్తం తాదృగేవ భవతి ।**
**ఏవం మునేర్విజానత ఆత్మా భవతి గౌతమ ॥**

(4-15)

నచికేతా! శుద్ధమగు నీరు, శుద్ధమగు పాత్రయందు ఏ విధముగ శుద్ధముగా యుంటుందో, అట్లే జ్ఞానవంతుడగు ముని జ్ఞానము కలిగి యుండుటచే, దేహమందు ఆత్మవంతునిగనే ప్రకాశిస్తూ ఉంటాడు.

వివరణము : తాను జీవాత్మయని, తన దేహము తనకు ఉపాధియని తెలుసుకొన్న శ్రద్ధావంతుడు ఆ జ్ఞానమును నిత్యము అనుష్ఠానము చేయుచు జీవించుట వలన విజ్ఞానవంతు డవుతాడు. అంటే, అనుభవ పూర్వకముగ తాను తేజోవంతుడగు ఆత్మ స్వరూపు డని, దేహము తన నివాసమని అనుక్షణం అనుభూతి చెందుతునే యుంటాడు. అట్టివాడు దేహమందు ప్రకాశిస్తూ, దేహముచే బంధింప బడక, దేహముతో తన కర్తవ్యములు నిర్వర్తిస్తూ ఉంటాడు. జ్ఞాన విజ్ఞానములు సతతము తోడై యుండుట వలన దేహము తానను భ్రాంతి యందుండడు. దేహమున్నను లేకున్నను, తాను తానుగనే ప్రకాశిస్తూ ఉంటాడు. ఇది యముడు తెలిపిన సిద్ధి.

నచికేతునికి యమధర్మరాజు మరణ రహస్యాన్ని అనేక దృక్కోణాల్లో సాధనాపరంగా తెలియజేస్తూ, బాలుడైన నచికేతుని యందు తన ప్రజ్ఞా ప్రభావాలను గూడ ప్రవేశింపజేశాడు.

సద్గురువు బోధ చేస్తూనే, అదే సమయంలో తదనుగుణమైన ప్రభావాన్ని గూడ శ్రద్ధావంతులైన శిష్యులయందు ప్రవేశపెడతాడు. తత్కారణంగా శిష్యుని శ్రద్ధావంతమైన సాధనకు ఆ ప్రభావంతోడై, శిష్యునియందు మేల్కాంచవలసిన ప్రజ్ఞ అత్యంత త్వరితగతిని మేల్కాంచుతుంది. ఉన్ముఖమైన ఇనుపముక్క అయస్కాంత సాన్నిధ్య మున అయస్కాంతమైనట్లు, సద్గురువు సాన్నిధ్యమున శిష్యుని ప్రయత్నముతోపాటు అనుగ్రహము కూడ తోడై, సాధన త్వరితగతిని సిద్ధిని చేరుకుంటుంది.

యమలోకము చేరిన నచికేతునికి బోధనకన్న ప్రధానముగ సమవర్తియగు యముడు తన సాన్నిధ్యమును అపూర్వముగ అందిం చాడు. కనుకనే నచికేతుడు లోక ప్రసిద్ధుడై, శాశ్వతుడై, సాధకులకు మార్గదర్శకుడై యున్నాడు.

# (42)

**శ్లో॥ పురమేకాదశద్వార మజస్యావక్రచేతసః ।**
**అనుష్ఠాయ న శోచతి విముక్తశ్చ విముచ్యతే ।**
**ఏతద్ వై తత్ ॥** (5-1)

నచికేతా! జన్మరహితుడగు జీవాత్మ అకుంఠితమైన ప్రజ్ఞ కలవాడు. అతడు పదకొండు ద్వారముల పురము నందున్నను అందు బంధింపబడడు. దుఃఖింపడు. ముక్త స్థితియందే యుండును. నిజముగ పరమే తానుగ నున్నానను సత్యమును గ్రహించుట వలన ముక్తుడై యున్నాడు.

*వివరణము :* శరీరము నవద్వార పురమని సామాన్యముగ అందరికిని తెలియును. ముఖమందలి ఏడు రంధ్రములు, గుహ్యమందలి రెండు రంధ్రములు కలసి తొమ్మిది రంధ్రముల పురముగ తెలుపుచు నుందురు. కాని ఆత్మజ్ఞానికి, ఆత్మవంతుడైన వానికి శిరస్సుపై బ్రహ్మరంధ్రము, ఉదరమందలి నాభిరంధ్రము కూడ ద్వారములుగ పనిచేయును. ధ్యానమందు పదకొండు ద్వారముల స్వరూప స్వభావములు తెలియుట, వానిని చక్కగ వినియోగించుట ఆత్మవంతుడు నేర్చును. దేహమందున్నప్పుడు నాభి భాగమున దూముడి (జారుముడి) వేసుకొని దేహసంబంధము కలిగియుండును.

దేహము నుండి బయల్పడుటకు తలపై నున్న బ్రహ్మరంధ్రమును ఉపయోగించును. దేహము పరిత్యజించునపుడు నాభియందలి ముడిని విడదీసుకొని బ్రహ్మరంధ్రము నుండి ఊర్ధ్వమున కేగును. ఈ అదనపు రెండు రంధ్రములు బ్రహ్మజ్ఞానికి సిద్ధించును. బ్రహ్మజ్ఞానికి "ఏతద్ వై తత్" అను సత్య సూత్రము సిద్ధించి యుండును. ఈ కనపడుచున్నదంతా బ్రహ్మమే. బ్రహ్మమే తానుగ, ప్రపంచముగ యున్నది అని తెలిసి యుండును. బ్రహ్మము కానిదేదియు లేదని తెలిసి యుండును. బ్రహ్మమే తాను. బ్రహ్మమే ప్రపంచము కూడ. ఇట్టి ఏకత్వము అనుభవించు వానికి బంధములు కాని, దుఃఖము కాని యుండవు. అతడు జీవన్ముక్తుడు.

జీవాత్మ శరీరమున ప్రవేశించినపుడు అతని ప్రజ్ఞ వక్రత చెందు ప్రమాద మున్నది. అది సర్వసామాన్యము. కాని జ్ఞానము చేత, యోగనిష్ఠచేత, ధ్యానము చేత ఈ వక్రతను తొలగించుకొనువాడు తాను శాశ్వతుడనని, తనకు మరణము లేదని తెలిసి యుండును.

(43)

**శ్లో॥ హంసః శుచిషద్ వసురంతరిక్షసద్**
**హోతా వేదిషదతిథిర్దురోణసత్ ।**
**నృషద్ వరసదృతసద్ వ్యోమసదబ్జా గోజా**
**ఋతజా అద్రిజా ఋతం బృహత్ ॥** (5-2)

నచికేతా! అపరిమితమగు పరిమాణము గలది ఆత్మ. ఆకాశంలో హంసవలె సంచరించే సూర్యుడు ఆత్మయే. అంతరిక్షంలో కదలికగ నున్న వాయువు ఆత్మయే. భూమిచుట్టును అగ్నిగను, నీరుగను, భూమిగను ఏర్పడినది ఆత్మయే. పర్వతములుగ గోచరించునది ఆత్మయే. ఆత్మయే సత్యము. అది అనేక విధములుగ రూపు కట్టుకుంటూ ఉంటుంది.

*వివరణము :* ఆత్మయొక్క అనన్యత్వం నచికేతునికి యమ దేవుడు సూచిస్తూ యున్నాడు. ఆత్మ కానిదేదీ లేదు. అన్నీ ఆత్మ స్వరూపాలే. రూపములన్నీ ఆత్మ నుండే ఆవరణలుగ ఏర్పడతాయి. ఆవరణల యందున్నది కూడ ఆత్మయే. ఆత్మ లేక ఏమీ ఏర్పడదు. సూర్యచంద్రాదులు, గ్రహములు, పంచభూతములు అన్నియు ఆత్మ వ్యక్తరూపాలే. వ్యక్తమైన విషయము, విషయముగ గాక ఆత్మగ దర్శించి

నచో సామరస్యముంటుంది. అనుభూతి యుంటుంది. ఆత్మకన్న వేరుగ దర్శించినపుడు ఘర్షణ ఉంటుంది. ద్వంద్వములు ఉంటాయి. ద్వంద్వములలో పడ్డ ప్రజ్ఞ బంధింపబడుతుంది. జనన మరణముల అనుభూతికూడ అందువలననే.

## (44)

**శ్లో॥ ఊర్ధ్వం ప్రాణమున్నయత్యపానం ప్రత్యగస్యతి ।**
**మధ్యే వామనమాసీనం విశ్వేదేవా ఉపాసతే ॥** (5-3)

నచికేతా! ఊర్ధ్వమునకు పయనించు ప్రాణమునకు, అధస్సునకు పయనించు అపానమునకు మధ్యలో ఆసీనుడైయున్న వామనుని అందరు దేవతలు ఆరాధిస్తారు.

*వివరణము :* మానవ శరీరమందు పంచప్రాణములు, పంచ ఉపప్రాణములు ఒకే ఒక ముఖ్య ప్రాణము ఆధారంగా నిర్వర్తింపబడుతూ ఉన్నాయి. ముఖ్యప్రాణమే దశ ప్రాణములకు కేంద్రము. ఈ కేంద్ర ప్రాణము నుండియే ప్రాణాపానములు, యాన ఉదానములు ప్రతిముఖంగా పనిచేస్తూ ఉంటాయి. అన్ని ప్రాణములు ముఖ్య ప్రాణమున సమన్వయింపబడి ఉంటాయి. అచట స్పందనాత్మకమై ప్రాణముల కాధారమై ఉన్నది ఆత్మ. అచట ఆత్మ ఆ విధముగ ఉపస్థితమై ఉండుట వలన సమస్త ప్రాణములు పనిచేయుచు నున్నవి. సమస్త దేవతలు కూడ ఆత్మ ఆధారంగానే పనిచేస్తూ ఉంటారు. ప్రాణములు, ప్రజ్ఞలు రెంటికిని కేంద్రమాత్మ. అది సూక్ష్మముగ, స్పందనాత్మక చైతన్యంగా తేజరిల్లుతూ ఉంటుంది. అది సూక్ష్మమై ఉండుట వలన వామనుడని యమదేవుడు సంబోధించినాడు.

మానవ ప్రజ్ఞ ఈ కేంద్రమందు లగ్నమైనపుడు ఆ స్థితిని ఆత్మ అనుసంధాన మంటారు. దాని వలననే దేహము, దేహమందలి ప్రజ్ఞలు, ప్రాణములు వర్తిస్తూ ఉంటాయి. అదియే నిజమునకు తాను. తానాధారముగనే తనయందలి సమస్త ప్రజ్ఞలు, ప్రాణములు వర్తించు చున్నవిగాని, వాని నాధారముగ చేసుకొని తాను వర్తించుట లేదు. ప్రాణమునకు, ప్రజ్ఞకు కూడ అధిపతి తానై యుండగ, ప్రాణములు గూర్చి, మరణమును గూర్చి, మరపుగూర్చి, పొరపాట్లు గూర్చి తానేల భయపడవలెను?

తన నిజస్థానమందు తాను ఆసీనుడై యున్నచో సమస్త ప్రాణ ములు, దేవతా ప్రజ్ఞలు తన అధీనమందే యుండును. అట్టివాడు సిద్ధుడు. అట్టి సిద్ధికొరకై చేయునది ఆత్మానుసంధానము. ఇచట ఉపదేశము చేయుచున్నవాడు సిద్ధుడగు యమదేవుడు. ఉపదేశమును పొందుచున్నవాడు సమర్థుడగు నచికేతుడు. సిద్ధుడైన గురువు, సమర్థు డైన శిష్యుడు లోకములను ప్రకాశింపజేయగలరు. యమునకు నచికేతుని యందుగల ఆసక్తి దీనిని గూర్చియే.

(45)

**శ్లో॥ అస్య విస్రంసమానస్య శరీరస్థస్య దేహినః ।**
**దేహాద్ విముచ్యమానస్య కిమత్ర పరిశిష్యతే ।**
**ఏతద్ వై తత్ ॥** (5-4)

నచికేతా! శరీరమందు స్థితిగొన్న ఆత్మ శరీరం విడిచినచో ఇక ఆ శరీరమందేదియు మిగలదు. ఆ ఆత్మవలనే శరీర మేర్పడినది. ఆత్మ నిష్క్రమిస్తే శరీరము నశించిపోతుంది. నిజానికి ఈ శరీరం కూడ ఆత్మదే!

*వివరణము :* విత్తనమునుండి మహావృక్ష మేర్పడినట్లు, ఆత్మ నుండి వివిధ కోశములుగ, నవద్వారములతో శరీర మేర్పడుతుంది. విత్తనమే లేనిచో వృక్షము లేదు. విత్తనమందలి అంకురశక్తియే విత్తనము నుండి విస్తరించి మహావృక్ష మవుతుంది. అలాగే ఆత్మ ఆధారంగా త్రిగుణములు, పంచభూతములు, సప్తధాతువులతో కూడిన శరీరము ఏర్పడుతుంది. ఆత్మ నిష్క్రమించగానే వానికి యునికి యుండదు. అవి నశించిపోతాయి. విశ్వాత్మ ఆధారంగా విశ్వమందు త్రిగుణములు, పంచభూతములు సృష్టిగ ఏర్పడతాయి. విశ్వరూపుడగు విరాట్పురుషుడు తనకు మూలమైన బ్రహ్మము, పరముగా మారినచో

సృష్టి మొత్తం అదృశ్యమైపోతుంది. అలాగే జీవాత్మ ఆధారంగా ఏర్పడిన శరీరము జీవాత్మకొరకే. అతడు నిష్క్రమిస్తే శరీరం నశిస్తుంది.

తాను జీవాత్మనని, పరమాత్మయొక్క వ్యక్తరూపమని, తన నుండి ఏర్పడినది తన దేహమని, తాను దేహమున్నను లేకున్నను యుండునని, తాను దేహముపై ఆధారపడి లేదని, దేహమే తనపై ఆధారపడి యున్నదని స్పష్టముగ తెలుసుకోవాలి. తాను నిత్యుడని, శాశ్వతుడని తననుండి దేహ మేర్పడునని తెలిసి యుండాలి.

నత్త నుండి నత్తగుల్ల ఏర్పడినట్లు, జీవుని నుండి దేహ మేర్పడును. గుల్ల లేక నత్త యుండగలదు. నత్త లేక గుల్ల కస్థిత్వము లేదు. సామాన్యముగ జీవులు, తమ దేహమే తామని భ్రాంతి చెంది గర్భనరకము, మరణయాతన అనుభవించుచు నున్నారు. తమ నిజస్థితిని తాము మరచుటచే ఇట్టి దుఃఖము లనుభవించుచున్నారు. అట్టి నిజస్థితిని మరల పొందుటయే జ్ఞానము. అందుకే యమగీత.

తాను దేహమనుకొన్న వారికి మరణమున్నది. తాము ఆత్మయని భావించువారికి మరణము తమ కుండక, దేహమున కుండును. అట్టివారు తమ దేహ మరణమును కూడ తామే దర్శింతురు.

(46)

**శ్లో॥ న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన ।**
**ఇతరేణ తు జీవంతి యస్మిన్నేతా వుపాశ్రితౌ ॥**(5-5)

నచికేతా! జీవుడు ప్రాణముచేత గాని, అపానముచేత గాని జీవించడం లేదు. అతని వలన ప్రాణాపాన వ్యాపారము పెరుగు చున్నది. అతడుండుటవలన ప్రాణములు పనిచేయు చున్నవి గాని, ప్రాణములుండుట వలన అతడు బ్రతికియున్నాడను భావన సరికాదు.

*వివరణము :* ప్రాణాపానములకు మూలము ప్రాణ స్పంద నము. అట్టి స్పందనమునకు మూలము సూక్ష్మస్పందనము. అట్టి సూక్ష్మ ప్రాణ స్పందనమునకు మూలము ప్రణవము. ప్రణవమే ఆత్మ. శరీరమందు ప్రణవమున్నంత కాలము ప్రాణము పనిచేయుచునే యుండును. ప్రణవము శరీరము దాటినచో శరీరము రాలిపోవును. ప్రణవమనగా లోన అనునిత్యము జరుగుచున్న నాదము. అది 'ఓం'గా వినపడు చుండును. యోగులు దానియందే మనసు లగ్నము చేసి తమ నిజస్థితిని పొందుచున్నారు.

ప్రణవ స్వరూపులగు మాస్టరు సి.వి.వి., షిరిడి సాయిబాబా, లహరి మహాశయులు, రామకృష్ణ పరమహంస ప్రాణముల కతీతముగ

దేహమున నుండుట అనుయాయులకు నిర్వర్తించి చూపిరి. వారంద రును మరణమును దాటి వసించు అమృతమూర్తులు. ప్రాణాపాన గతులు వారి అధీనమున యున్నవి. వారు ప్రాణముల అధీనమందు లేరు. నిజమునకు ఆత్మ నుండియే ప్రాణము, ప్రజ్ఞ వ్యక్తమగు చున్నవి కాని, వాటి అధీనమున ఆత్మ లేదు.

తనలోనికి తాను చొచ్చుకొనిపోవు సాధకునకు ఆత్మ సంధాన మేర్పడి, తానే ఆత్మయని ఎరిగి, మరణమును దాటి దేహములకు కూడ అతీతముగ జీవించుట సాధ్యమని యోగులు, సిద్ధులు నిర్వర్తించి చూపించు చున్నారు. వారి అనుభవములను గ్రంథస్థము కూడ గావించినారు. వసిష్ఠుడు, అగస్త్యుడు, ఇతర మహర్షులు, శుకాది యోగిపుంగవులు సవివరముగ బోధించినారు కూడ. జగద్గురువు మైత్రేయులు విదురునకిట్లు బోధించుట భాగవతమున దర్శింప వచ్చును. సాక్షాత్తు మరణదేవత యముడే నచికేతునికి ఈ రహస్య మును తెలుపుచున్నాడు.

47

**శ్లో॥ హంత తే ఇదం ప్రవక్ష్యామి గుహ్యం బ్రహ్మసనాతన।**
**యథా చ మరణం ప్రాప్య ఆత్మా భవతి గౌతమ ॥**

(5-6)

గౌతమ వంశీయుడవైన ఓ నచికేతా! నీకు రహస్యము, సనాతనము అగు బ్రహ్మమును గూర్చి ఇపుడు చెపుతాను. అలాగే ఇపుడు మరణానంతరము ఆత్మ ఏమౌతుందో కూడ చెపుతాను.

**శ్లో॥ యోనిమన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః ।**
**స్థాణుమన్యే ఽనుసంయంతి యథాకర్మ యథాశ్రుతమ్॥**

(5-7)

కొన్ని జీవాత్మలు శరీరం కోసం గర్భంలో ప్రవేశిస్తాయి. మరి కొన్ని జీవాత్మలు చెట్టు చేమల నాశ్రయించి ఉంటాయి. అంతా వారి వారి కర్మల ననుసరించి, జ్ఞానాన్ని అనుసరించి ఉంటుంది.

*వివరణము :* జీవాత్మల రూపధారణ మంతా అనుభూతి కొరకే. అనుభూతి నుండి అనుభవం వస్తుంది. అనుభవం నుండి జీవులకు పరిణామం కలుగుతుంది. క్రమంగా ఉన్నతి చెందుతూ

ఉంటారు. ఖనిజములుగను, వృక్షములుగను, జంతువులుగను, మానవులుగను జీవాత్మలు దేహధారణ చేస్తూ ఉంటారు. జ్ఞానా జ్ఞానములను బట్టి తదనుగుణమైన శరీరములు లభిస్తుంటాయి. అజ్ఞానంతో నిర్వహింపబడిన కర్మల కారణంగా శరీరమునందు అపరిపూర్ణత లుంటాయి. జ్ఞానము సమకూర్చుకొనుచు, అజ్ఞానము తొలగించుకొనుచు జీవులు ముందుకు సాగుతూ ఉంటారు. క్రూరమైన, హింసాత్మకమైన చర్యలద్వారా అపరిపూర్ణమైన దేహములు లభిస్తూ ఉంటాయి. పుట్టు గ్రుడ్డి, పుట్టు చెముడు, పుట్టు మూగ, అంగవైకల్యము ఇత్యాది వన్నియు క్రూరకర్మల ఫలములే. ఘోర కృత్యము నిర్వర్తించునపుడు ఇట్టి శరీరములు కూడ లభించవు. అట్టి స్థితిలో చింతచెట్టు, వేపచెట్టు, మఱ్ఱిచెట్టు వంటి చెట్లను, చేమలను ఆశ్రయించి జీవిస్తూ ఉంటాయి. అట్టి జీవులకు పుణ్యాత్ముల స్పర్శ వలన విముక్తి కలిగి మరల దేహధారణ యోగ్యత కలుగుతుంది. చీకటిలోను, అడవులలోను, ఒంటరి దారులలోను, ఒంటరిగ పయనించువారు హనుమంతుని స్మరించుట ఇందులకే. దేహము కొరకై తహతహలాడు జీవులు బలహీనుల దేహముల నాక్రమింపజూతురు. అమితమగు భయము కలవారే బలహీనులు.

దేవతా శరీరాలనుండి గడ్డిపోచ వరకును అన్నియు దేహములే. ఈ దేహములు జీవుని జ్ఞానాజ్ఞానమును బట్టి లభిస్తాయి. జ్ఞానము సమకూర్చుచు, ధర్మమును నిర్వర్తించుచు, ఉత్తమ దేహములను పొందుట సనాతన ధర్మమందు సిద్ధాంతీకరించినారు.

(48)

**శ్లో॥ య ఏష సుప్తేషు జాగర్తి కామం కామం**
**పురుషో నిర్మిమాణః ।**
**తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే ।**
**తస్మింల్లోకాః శ్రితాః సర్వే తదు నాత్యేతి కశ్చన ।**
**ఏతద్ వై తత్ ॥** (5-8)

నచికేతా! ఏ శుద్ధమైన తత్త్వము జీవులు నిదురించినపుడు కూడ మేల్కొని ఉంటుందో అదే బ్రహ్మము. అదే అమరము. అదే పరమాత్మ. దానినెవరూ అతిక్రమించలేరు. దానివలననే ప్రజ్ఞా ప్రాణములు నిర్వర్తింపబడుతూ ఉంటాయి.

*వివరణము :* ఆత్మ తత్త్వము నెరుగదలచినవారు నిద్రను సద్వినియోగం చేయాలి. నిద్రయందు మనలో మేల్కొనియుండు సత్యము కారణముగనే ప్రాణస్పందనము, శ్వాస వ్యాపారము జరుగుచు నుండును. మరల నిదుర నుండి మెలకువ వచ్చుటకు కూడ ఆధారమదియే. సమస్తమూ నిద్రించునపుడు మనయందు మేల్కొంచి యున్నది ఏది అను ప్రశ్నకు సమాధానము లభించుటకై శోధన చేయవలెను. నిద్రించునపుడు ప్రాణాపానములను గమ

నించుచు, వాని మూలమైన స్పందనము చేరి, స్పందనకు మూలమైన సూక్ష్మ స్పందనము చేరవలెను. అటుపై ముఖ్య ప్రాణము ననుసరించుచు, దాని పుట్టుక స్థానమును వెదుకవలెను. ప్రాణ మూలమున వెలుగొందు ఆత్మ శుద్ధమైన కాంతితో దర్శన మిచ్చును. అదియే తాను అను భావనతో గమనించుచు యుండవలెను.

ధ్యానమునందు కూడ ఇదే విధానమున తన మూలమునకు తాను చేరు ప్రయత్నము చేయవలెను.

(49)

శ్లో॥ అగ్నిర్యథైకో భువనం ప్రవిష్టో రూపం
రూపం ప్రతిరూపో బభూవ ।
ఏకస్తథా సర్వభూతాంతరాత్మా రూపం
రూపం ప్రతిరూపో బహిశ్చ ॥ (5-9)

నచికేతా! ఒకే అగ్ని తన నుండి అనేక పదార్థములను పోలిన రూపాలను ధరించినట్లు, అందరి జీవులలోను ఒకే ఒక ఆత్మ ప్రవేశించి యున్నది. ఆత్మ నుండి జీవాత్మలు, జీవాత్మల నుండి దేహాత్మలు (దేహములు) ఏర్పడి ఉన్నాయి. ఇన్నిటికి ఒకే ఆత్మ. దానిని పోలి జీవాత్మ. జీవాత్మను పోలి దేహములు ఏర్పడి ఉన్నాయి.

*వివరణము :* పరమే ఆత్మగ రూపుకట్టుకుంటుంది. బ్రహ్మమే ఆత్మగ ఏర్పడుతుంది. ఆత్మ నుండి జీవాత్మ లేర్పడతాయి. జీవాత్మలకు రూపము లేర్పడతాయి. దేహములు వైవిధ్యంగా ఉంటాయి. ఆత్మలు పోలిక కలిగి ఉంటాయి. ఆత్మ లన్నియు ఒకే ఆత్మ నుండి ఏర్పడుట వలన పోలికలుంటాయి. ఆత్మ త్రిగుణాతీతము. జీవాత్మలు త్రిగుణా తీతము కాదు. త్రిగుణములకు లోబడి ఉంటాయి. త్రిగుణముల మేళవింపును బట్టి జీవాత్మల యందు వైవిధ్య ముంటుంది. వైవిధ్య మగు స్వభావము లుండుట వలన, వైవిధ్యమైన దేహము లేర్పడుతూ

ఉంటాయి. ఒకే తలిదండ్రులకు పుట్టిన పిల్లలయందు వైవిధ్యము రూపమునందు, స్వభావమునందు గోచరిస్తూనే ఉంటాయి. కాని అందరు వారి సంతానమే. అట్లే జీవకోటి సమస్తము ఒకే ఒక విశ్వాత్మ యొక్క సంతానము. ఒకరిని పోలిన వారొకరుండరు. ఇందు ఏకత్వము కలిగి ఉన్నది కేవల మీశ్వరుడే! అతడు త్రిగుణాతీతుడు. జీవులు త్రిగుణాత్మకులు. సృష్టి వైవిధ్యమునకు త్రిగుణములే కారణము. త్రిగుణముల కతీతమగు ఈశ్వరుడు, త్రిగుణాత్మకమైన జీవులయందు ఉపస్థితుడై యున్నాడు.

తమయందలి ఈశ్వరుని ధ్యానము చేయుట ద్వారా జీవుడు ఈశ్వర అనుసంధానము చెందవచ్చును. అట్టి అనుసంధానము స్థిరమై యున్నచో జీవునకు తాను శాశ్వతుడనని, తనకు మరణము లేదని, జననము కూడ లేదని తెలియును. కనుక ఈశ్వరానుసంధానము జీవునికి శాశ్వతత్వము నిచ్చును. అట్టి ఈశ్వర స్మరణ అనుసంధానము జీవునకు మరణమును దాటించు ఔషధమై నిలచినది.

త్రిగుణరహితుడగు సద్గురువు యమదేవుని ఉపదేశము వలన శ్రద్ధాళువగు నచికేతునికి ఈశ్వరానుసంధానము, అమరత్వము సిద్ధించినవి. బోధనా మార్గమున సద్గురువు సత్సాధకులను సిద్ధికి చేరువ చేయును. శ్రవణమాత్రమున శిష్యు డప్రయత్నముగ ఉద్ధరింప బడుచుండును. ఇది సత్యము. సాధకునికి సిద్ధుని బోధ సద్యోఫలము. ఈ సత్యము సత్సాధకునికే తెలియగలదు. ఇతరులకు ఉపదేశము కేవలము సమాచారముగ మిగులును.

50

**శ్లో॥ వాయుర్యథైకో భువనం ప్రవిష్టో రూపం**
**రూపం ప్రతిరూపో బభూవ ।**
**ఏకస్తథా సర్వభూతాంతరాత్మా రూపం**
**రూపం ప్రతిరూపో బహిశ్చ ॥** (5-10)

నచికేతా! అగ్నివలెనే ఒకే వాయువు సృష్టిలో ప్రవేశించి వివిధ రూపాలతో కూడిన రూపాలను ధరిస్తూ ఉంటుంది. అలాగే సకల జీవుల హృదయాలలోను ఒకేఒక ఆత్మ వసించి, వివిధ రూపాలుగ కనిపిస్తూ ఉంటుంది.

*వివరణము :* ముందు శ్లోకమున అగ్ని ఉదాహరణముగ చెప్పబడినది. ఇపుడు వాయువు ఉదాహరణముగ చెప్పబడుచున్నది. అటుపైన సూర్యుడు ఉదాహరణముగ చెప్పబడును. అగ్ని, వాయువు, సూర్యుడు వేదమందు కీర్తింపబడిన ప్రధాన దేవతలు. ఒకే ఒక తత్త్వము మూడుగ ఏర్పడి సృష్టి నిర్మాణము చేయును. అగ్ని, వాయువు, సూర్యులను- శివుడు విష్ణువు బ్రహ్మగకూడ తెలుపుదురు. వారినే ప్రాణము ప్రజ్ఞ ద్రవ్యములుగ కూడ తెలుపుదురు. ఇవి సృష్టియందేకాక, సృష్టిని మించి కూడ యున్నవి. సమస్త జీవులయందు యుండును. సమస్త జీవులయందు కూడ ప్రజ్ఞ ప్రాణము పదార్థము ఉన్నవి కదా!

ఈ శ్లోకమున జీవుల హృదయమందు స్థితిగొన్న వాయువుతో అనుసంధానము తెలుపబడినది. జీవులన్నిటికిని హృదయమున్నది. హృదయము స్పందించుటకు వాయువే మూలము. వాయువే ప్రాణము కూడ. అగ్ని ప్రజ్ఞగ, వాయువు ప్రాణముగ దర్శింపవచ్చును. ఒకే ఒక వాయువు ప్రాణవాయువై జీవుల హృదయమునందు స్థితిగొని యున్నదని దర్శించుచు కూడ ఈశ్వరానుసంధానము కలిగించుకొన వచ్చును. రూపములు వైవిధ్యముగ నున్నను అన్ని కోట్ల జీవరాసుల యందు, అన్ని లోకము లందలి జీవరాసులయందు ప్రాణస్పందన మొక్కటియే. దానిని నిర్వర్తింపజేయు వాయు వొక్కటియే. కనుకనే వాయువును "ప్రత్యక్ష బ్రహ్మ" యని ఋషులు కొనియాడుచున్నారు. ప్రజ్ఞయొక్క తేజస్సును గుర్తించుట కన్న హృదయమందలి వాయువును గుర్తించుట సులభము. తన యందలి వెలుగును దర్శించుటకన్న, తనయందలి వాయు ప్రక్రియ దర్శించుట సులభము. జీవకోట్లు అసంఖ్యాకములై గోచరించు చున్నవి. వానికి మూలమగు హృదయ స్పందనమును గుర్తించుట ఆత్మ దర్శనమునకు మార్గమై యున్నది.

యమదేవుడు కూడ నచికేతునికి హృదయ ద్వారమున లోలోని కేగుమని ముందు శ్లోకములలో నిర్దేశించినాడు. ఫాలమున అగ్ని తేజస్సును గుర్తించుటకన్న, హృదయమున వాయువును గుర్తించుట సులభము. వాయువుతో అనుసంధానమున జీవుడు సమాన, ఉదాన, వ్యాన వాయువుల ద్వారా దేహాతీతమైన వెలుగుగ తనను తాను దర్శించుట యమదేవుని ఉపదేశము.

## 51

**శ్లో॥ సూర్యో యథా సర్వలోకస్య చక్షు**
**ర్న లిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః ।**
**ఏకస్తథా సర్వభూతాంతరాత్మా**
**న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః ॥** (5-11)

నచికేతా! సూర్యదేవుడు అందరిచే చూడబడు చున్నను, చూచు వారి మాలిన్యము సూర్యునంటదు. అట్లే సూర్యకిరణములు సర్వజీవ రాశులపై ప్రసరించు చున్నను వానికి జీవుల మాలిన్య మంటదు. అట్లే ఆత్మ దేహమందలి అన్ని కోశములయందు వ్యాప్తి చెందియున్నను ఆయా కోశముల మాలిన్యము ఆత్మ నంటదు. అంటక అన్నిటి యందుండుట ఆత్మ లక్షణము.

*వివరణము :* 'నేను' అను ఆత్మప్రజ్ఞ దేహమందు సర్వత్రా వ్యాప్తి చెందియున్నది. పంచకోశములయందు, సప్తధాతువుల యందు, ఇంద్రియములయందు, మనసు బుద్ధి అహంకారముల యందు ఆత్మయే వ్యాప్తి చెందియున్నది. ఆత్మ ఆధారముగనే అవియన్నియు ఏర్పడినవి. అట్లేర్పడిన వాటియందు ఆత్మ వసించి యున్నది. కాని వానిని ఆత్మ తగులుకొని లేదు. అవియును ఆత్మను పట్టి యుంచలేవు.

అట్టి నేనను ఆత్మ తన చుట్టు ఆవరణలు లేనపుడు, ఆవరణ లున్నపుడు కూడ తానుగనే యుండును. ఇది ఆత్మయొక్క అతీతస్థితి. అంటక అన్నిటిని ఏర్పరచుట, వానియందుండుట ఆత్మకే సాధ్యము. ఇట్లు తన నిజ స్వరూపమును ఎవరు ఎరిగి యుందురో అట్టి వానికి జనన మరణ అవస్థ లుండవు.

సూర్యకాంతి సూర్యునివలెనే పరిపూర్ణమై యున్నది. ఆ కాంతి గంగ నీటిని స్పృశించినను, మురికి కాలువన నున్న నీటిని స్పృశించి నను సూర్యకాంతికి మాలిన్యమంటదు. ఎచ్చట ప్రసరించు చున్నను తాను తానుగనే యుండును. అగ్ని, వాయువు కూడ అట్లే. తమ పరిసరముల ప్రభావము తమపై లేక, తమ ప్రభావము పరిసరములపై ప్రసరింపజేయుట ఆత్మవంతుల లక్షణము. అగ్ని, వాయువు, సూర్యుడు అట్టివారు. ఆత్మ అట్టిదే. మహాత్ములందరు అట్టివారే. వారిపై ప్రత్యేక ముగ మరియొక ప్రభావము లేక, తాముగనే ప్రకాశించుచు నుందురు.

శరీరమందు తానున్నను, శరీరము తాను కాదు. కర్మేంద్రియ జ్ఞానేంద్రియము లందు తానున్నను, తాను తానే! తాను ఇంద్రియ ములు కాదు. అట్లే మనసుయందు తానున్నను అందేర్పడు మనోభావ ములు తాను కాదు. అట్లే అహంకారము, బుద్ధి కూడ తన ఉపాధులే కాని తాను కాదు. నిజమునకు తానాత్మయే. ఈ సత్యము తెలుయు మని నచికేతునకు యమదేవుడు బోధించుచున్నాడు.

(52)

**శ్లో॥ ఏకో వశీ సర్వభూతాంతరాత్మా**
**ఏకం రూపం బహుధా యః కరోతి ।**
**తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా**
**స్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్ ॥**

(5-12)

నచికేతా! అందరి జీవుల యందలి అంతరాత్మ ఒకడే. అతని రూపాన్ని ఆధారం చేసుకొని అనేక రూపాలతో జీవులేర్పడుతూ ఉన్నారు. ఎవరైతే తమ యందలి అంతరాత్మను దర్శించ గలుగుతారో వారిదే శాశ్వతమైన ఆనందం.

*వివరణము :* సర్వవ్యాపకమగు బ్రహ్మము విరాట్ అను బంగారు గుడ్డుగా ఏర్పడుట, ఆ గుడ్డు నుండి పదివేల దివ్య సంవత్స రములకు ఒక విరాట్పురుషు డేర్పడటం, ఆ విరాట్పురుషుడు ఆధారంగా అనేకానేక జీవకోట్లు ఏర్పడటం- ప్రాచీన ఋషులు దర్శించిన సత్యం. ఋగ్వేదమందలి సూక్తరాజమగు 'పురుష సూక్తము' ఈ విషయాన్నే ప్రతిపాదిస్తుంది. బ్రహ్మము నుండి విరాట్, విరాట్ నుండి విరాట్పురుషుడు, విరాట్పురుషుని నాభి నుండి సృష్టికర్త యగు బ్రహ్మదేవుడు, అతడి ద్వారా మానస పుత్రులు, రుద్రులు, ప్రజాపతులు,

మనువులు, వాక్కు, వాఙ్మయము, ప్రజాపతులద్వారా జీవకోటి ఏర్పడినట్లు సృష్టి నిర్మాణ కథ పురాణములలో తెలుపబడినది.

స్వభావములను బట్టి జీవులకు రూపా లేర్పడతాయి. జీవులు విరాట్పురుషుని బట్టి ఏర్పడతారు. విరాట్పురుషుడే జీవాత్మల అంతరాత్మ. విరాట్పురుషుని నుండి జీవాత్మలు, జీవాత్మల నుండి వారి రూపాలు ఏర్పడుతూ ఉన్నాయి. జీవాత్మలయందలి స్వభావ వైవిధ్యము వలన రూపవైవిధ్యం ఉంటుంది. కాని అన్ని ఆత్మలలో నుండే అంతరాత్మ ఒకే రూపంతో ఉంటాడు. అతనినే విరాట్పురుష నిగ, విష్ణువుగ ఋషులు తెలిపారు.

కనుక ప్రాజ్ఞుడైనవాడు తాను, తన శరీరము, తన స్వభావము కాదు అని తెలుసుకుంటాడు. తాను జీవుడనని, తన మూలము దేవుడని తెలుసుకుంటాడు. అందరి జీవుల మూలము కూడ అతడే అని తెలుసుకుంటాడు. ఆ ఒక్క రూపమే సత్యమని, నిత్యమని, తన కాధారమని భావిస్తాడు. అట్టి వానికి జీవులందరు ఆ విరాట్పురుషుని సంతానమే అని దర్శన మవుతుంది.

ఈ విరాట్పురుషుడినే భగవద్గీతలో పురుషోత్తముడని తెలిపారు. అతని నుండే అక్షరమగు జీవు లేర్పడతారని, ఆ జీవుల నుండి క్షరమగు స్వభావములు, రూపములు ఏర్పడతాయని తెలిపారు. తనయందు, అన్ని జీవులయందు అంతర్హితుడై యున్న విశ్వాత్మ ఒకడే అని తెలిసి, అతనితో ముడిపడి శాశ్వతుడై జీవించువాడు ప్రాజ్ఞుడని యముడు నచికేతునికి ఉపదేశించాడు.

## (53)

**శ్లో॥ నిత్యోఽనిత్యానాం చేతనశ్చేతనానా**
**మేకో బహూనాం యో విదధాతి కామాన్ ।**
**తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా**
**స్తేషాం శాంతిః శాశ్వతీ నేతరేషామ్ ॥** (5-13)

నచికేతా! అనిత్య వస్తువులలో నిత్యమైనది, చేష్టల కన్నిటికి మూలమైన చేతనకు మూలమైనది, ఒక్కటే బహు విధములుగ గోచరించునది, సమస్త కామములను పూరించునది అగు తత్త్వము తనయందే ఉన్నదని నిత్యము గ్రహించి, ధీరులు శాశ్వతమైన శాంతిని పొందుచున్నారు. ఇతరులట్టి శాంతిని పొందలేరు.

*వివరణము :* మార్పు చెందుతున్న వస్తువులన్నిటికిని మార్పు చెందని వస్తు ఒకటి ఆధారం. పెరుగుచున్న చెట్టుకు బీజమాధారము. తిరుగుచున్న భూమికి ఇరుసు ఆధారము. ఋతువులకు చంద్రుడాధారము. కదిలెడి తిరగలి రాయికి కదలని రాయి ఆధారము. చైతన్య ప్రవాహమునకు, ప్రాణ ప్రవాహమునకు సత్యమాధారము.

అనేకానేకమగు జీవుల చేష్టలకు చైతన్య మాధారము. చైతన్యమునకు మూల ప్రకృతి ఆధారము. మూల ప్రకృతికి సత్యమాధారము.

జీవుల కోరికలను పూరించుటకే సత్యమనేక రూపములు ధరించి సృష్టి కాధారమై యున్నది.

అట్టి సత్యము మనకు మూలము. సత్యమాధారముగనే మన మున్నాము. నిజమునకు సత్యమే మనము. సత్యము నుండి పుట్టిన చైతన్యము నుండి మూడు గుణములు పుట్టగా, వాని నుండి మన మేర్పడుచున్నాము. మన మూలము సత్యమే. మనయందలి త్రిగుణము లకు అతీతముగ సూక్ష్మ చైతన్యముండగ, దాని మూలమున సత్య మున్నది.

మనయందలి సత్యమును గ్రహించి, దర్శించు ప్రయత్నము నిత్యము సాగవలెను. అట్లు నిర్వర్తించు శ్రద్ధాళువగు సాధకునికి దర్శనమిచ్చునది సత్యము. అట్లు నిత్యము దర్శించు సాధకుడే సిద్ధ డగును. అతడే ధీరుడు. అతనిదే శాంతి. ఇతరులకు శాంతి శాశ్వతమై యుండదు.

(54)

**శ్లో॥ తదేతదితి మన్యంతేఽనిర్దేశ్యం పరమం సుఖమ్ ।**
**కథం ను తద్విజానీయాం కిము భాతి విభాతి వా ॥**

(5-14)

నచికేతా! ఇదంతా అదే. పరతత్త్వమే ఇదంతా! అది ఇది కాకుంటే, ఇదెలా ప్రకాశిస్తుంది? ఈ కనపడుతున్న దానిలోని కాంతి అంతా దానిదే. అది లేక ఏదీ ప్రకాశించదు.

*వివరణము :* మిణుగురు పురుగు నుండి ఎంత ప్రకాశము గోచరించినా అది పరమాత్మ ప్రకాశమే. పరమాత్మవలననే దానికా ప్రకాశం. అనేక రకములుగ వృక్షములు, పుష్పములు, పండ్లు ప్రకాశిస్తూ ఉంటాయి. వాని యందలి ఆ ప్రకాశము దైవమే, పరమాత్మయే. ఏ జంతువు కనులలోనికి చూసిన కాంతి గోచరిస్తుంది. ఆ కాంతి పరమాత్మయే. మనలోని కాంతి కూడ పరమాత్మయే. నియమ నిష్ఠలుగల ఋషులు అన్నిటి యందును కల ఈ కాంతినే దర్శించుచు, తృప్తి చెందుతూ ఉంటారు. సృష్టి అంతా ఈ కాంతి యొక్క విలాసంగా భావిస్తూ ఉంటారు. వారికదే అమితానందాన్నిస్తూ ఉంటుంది. దేనిని చూచినా అదే అని భావిస్తూ ఉంటారు. అదే అన్నిటికి

అత్యుత్తమంగా భావిస్తూ ఉంటారు. అగ్ని, వాయువు, సూర్యకాంతి, ప్రకాశము, రంగులు, శబ్దములు, రూపములు ఇవన్నీ దాని వ్యక్త రూపములే.

(55)

**శ్లో॥ న తత్ర సూర్యోభాతి న చంద్రతారకం**
**నేమా విద్యుతో భాంతి కుతో౽యమగ్నిః ।**
**తమేవ భాంతమనుభాతి సర్వం**
**తస్య భాసా సర్వమిదం విభాతి ॥** (5-15)

నచికేతా! అక్కడ సూర్యుడు ప్రకాశించడు. చంద్రుడు, తారకలు కూడ ప్రకాశించలేరు. మెఱపులు కూడ మెఱవ లేవు. అన్నీ అది ఆధారంగా ప్రకాశిస్తూ ఉన్నాయి. వేటికిని తనదైన ప్రకాశం లేదు.

*వివరణము :* చీకటిలో దివిటీ ప్రకాశిస్తూ ఉంటుంది. కాని పగలు సూర్యుని కాంతిలో అది వెల వెల పోతూ ఉంటుంది. సూర్యుని ముందు దివిటీకి ప్రాముఖ్యం లేదు. అవసరమూ లేదు. ఎవరూ గుర్తించరు కూడ.

పరమాత్మతో పోలిస్తే సూర్యుని పరిస్థితి కూడ అదే. సమస్త సూర్యమండలాన్ని ప్రకాశింపజేసేవాడు పరమాత్మ ముందు ప్రకాశించ లేడు. నిజానికి పరమాత్మ అతని నుండి ప్రకాశిస్తూ ఉన్నాడు. ఆదిత్యులకైనా, సవితృమూర్తికైనా, సూర్యునికైనా మూలమొక్కటే. వీరెవ్వరికిని తమదైన ప్రకాశము లేదు. సృష్టిలో ఏదియు తానుగ

ప్రకాశించునది లేదు. పరమాత్మ ప్రకాశమే ఇన్నిటినుండి ప్రకాశిస్తూ ఉంటుంది. చంద్రుడైన, తారలైన, మహర్షులు బ్రహ్మర్షులైన, త్రిమూర్తులైన అందరియందు ప్రకాశించేది ఒక్కటే. అదే నీయందు, నాయందు కూడ ప్రకాశిస్తున్నాయి సుమా! అని యమదేవుడు నచికేతునికి పరతత్త్వ స్వరూప స్వభావములను ఆవిష్కరించాడు.

(56)

**శ్లో॥ ఊర్ధ్వమూలోఽవాక్శాఖ ఏషోఽశ్వత్థః సనాతనః ।**
**తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే ।**
**తస్మింల్లోకాః శ్రితాః సర్వే తదు నాత్యేతి కశ్చన ।**
**ఏతద్ వై తత్ ॥** (6-1)

నచికేతా! వేర్లు పైకి ప్రసరించేది, కొమ్మలు క్రిందికి వ్యాప్తి చెందేది పురాతనమైనది, నిత్యము ఉండేది, పరిశుద్ధమైనది, అన్ని లోకాలకు ఆశ్రయమైనది, ఎవ్వరును అతిక్రమింప లేనిది అయిన వృక్షము బ్రహ్మమే.

*వివరణము :* సృష్టి బ్రహ్మము రూపమే. బ్రహ్మమే సృష్టిగా ఏర్పడింది. ఆవిరి నీరై, నీరు మంచుగడ్డ అయిన రీతిలో అతీతమగు బ్రహ్మము సూక్ష్మముగను, స్థూలముగను మార్పు చెంది ఉన్నది. ఆవిరి లేని నీరు, మంచుగడ్డ లేవు. నీటికి, మంచుగడ్డకు కనపడని ఆవిరి ఆధారము. అట్లే కనపడని బ్రహ్మము, కనపడే స్థూలము, సూక్ష్మము అయిన సృష్టిగా ఏర్పడుతుంది. లోకాలన్నీ అందులోనే ఉంటాయి. లోకాలలో లోకులుంటారు. ఎవ్వరూ కూడ సృష్టిని అతిక్రమించలేరు. సృష్టి బ్రహ్మ స్వరూపము గనుక అది శుద్ధమైనది. అమృతమయమైనది. అందేదీ నశించదు. స్థూలం నుంచి సూక్ష్మం లోనికి,

సూక్ష్మం నుంచి స్థూలం లోనికి మార్పు చెందుతూ ఉంటాయి. లేకపోవటం అనేది ఉండదు. వృక్షం బీజం రూపంలో, బీజము వృక్షం రూపంలో ఏర్పడుతూనే ఉంటాయి. స్థూల మదృశ్యమైన సూక్ష్మంగా ఉంటుంది. మరల సూక్ష్మంలో నుండి స్థూలంలోనికి వస్తుంటుంది.

సూక్ష్మం నుండి స్థూలం లోనికి వస్తే పుట్టుక అని, మరల స్థూలం నుండి సూక్ష్మం లోనికి అదృశ్యమైతే చావు అని తెలియని వారు భావిస్తూ ఉంటారు. వ్యక్తావ్యక్తములుగ, దృశ్య అదృశ్యములుగ, స్థూల సూక్ష్మములుగ ఎప్పుడూ ఉండేది సృష్టి. అది బీజప్రాయంగా ఉన్నప్పుడు కూడ ఉన్నది. లోకాలు, లోకులు, వస్తు సంపద దృశ్యా దృశ్యంగా ఎప్పుడూ ఉంటాయి.

ఇక జీవుల గూర్చి ప్రత్యేకంగా చెప్పనవసరమే లేదు. కనపడి కనపడకుండ జీవుడెప్పుడూ ఉన్నాడు. లేడనుకోవటం అజ్ఞానం. స్థితి మార్పు రావచ్చునేమో గాని, జీవునకు మరణముండదు. జీవుడు పుట్టకముందు కూడ ఉన్నాడు. మరణించిన తరువాత కూడ ఉంటాడు. కేవలము భౌతికమే సత్య మనుకొనువారికి జ్ఞానము లేనట్లే. జీవుడు పుట్టకముందు తల్లి గర్భంలోను, అంతకుముందు తండ్రి శుక్రంలోను, అంతకుముందు వెలుగు బీజంగాను ఉంటాడు. పుట్టక ముందు ఉన్న స్థితులే మరణించిన తరువాత పొందుతాడు. అతడు స్వతహాగా పరిశుద్ధుడే. అతని చుట్టును ఏర్పడిన ఆవరణలను బట్టి శుచిలో భేదాలుంటాయి. నచికేతా! ఎవ్వరికిని నిజమునకు చావు లేదు. అజ్ఞానము వలన చావుపుట్టుక లున్నట్లు గోచరిస్తూ ఉంటుంది.

57

**శ్లో॥ యదిదం కించ జగత్సర్వం**
**ప్రాణ ఏజతి నిః సృతమ్ ।**
**మహద్భయం వజ్రముద్యతం య ఏతద్**
**విదురమృతాస్తే భవంతి ॥** (6-2)

నచికేతా! బ్రహ్మము నుండి వ్యక్తమగు ప్రాణము ద్వారా బ్రహ్మమే బృహత్తర సృష్టిగ అవ్యక్తమవుతూ ఉన్నది. ప్రాణమే ప్రధాన శక్తిగ బ్రహ్మము వజ్రాయుధమువలే బ్రహ్మాండమంతయు కంపరము గావిస్తూ ఉన్నాడు.

*వివరణము :* జీవుడు ప్రాణమాధారముగ నిలబడి యున్నాడు. జీవాత్మ బ్రహ్మమే. ప్రాణశక్తి తనయందు ఉపస్థితి చెంది యున్నంత కాలము జీవుని వ్యాప్తి యుండును. ప్రాణము నిష్క్రమించగనే, జీవాత్మకు బహిర్గతమైన వ్యాప్తి ఉండదు. జీవుడు ప్రాణముపై ఆధార పడి యున్నాడు. ప్రాణము బ్రహ్మము యొక్క మూలశక్తి. ప్రాణమును నియమించి, సృష్టి నిర్మాణము చేయు బ్రహ్మమునకు ప్రాణము వజ్రాయుధము వంటిది. ప్రాణము రాకపోకలు బ్రహ్మము అధీనమున నుండును. బ్రహ్మనిష్ఠ గలిగిన బ్రహ్మర్షులకు ప్రాణము సహకారము

నందించుచు నుండును. బ్రహ్మర్షులు, బ్రహ్మవేత్తలు ప్రాణములు ప్రసాదించిన సందర్భములు అనేకములు గలవు. బ్రహ్మత్వము పొందినవారే ప్రాణప్రదానము కూడ గావించగలరు. అన్ని లోకము లకు ప్రాణమే మూలబలము. అట్టి ప్రాణము బ్రహ్మము నుండి పుట్టుచు నున్నది. బ్రహ్మ మధీనమున నున్నది.

బ్రహ్మనిష్ఠులు అగు బ్రహ్మర్షులు జనన మరణముల కతీత ముగ, శాశ్వతముగ సృష్టియందు వసించి యున్నారు. బ్రహ్మమే తామని అనుక్షణ మనుభూతి చెందు బ్రహ్మర్షులకు ప్రాణరహస్యము లన్నియు తెలియును. ఈ ఉపనిషత్తునందు సద్గురువుగా వర్తించుచున్న యమ దేవుడు ప్రాణముల రాకపోకలను తెలియుటయే గాక, ప్రాణము ప్రసాదించగల బ్రహ్మవేత్త. సత్యవంతునికి, మార్కండేయునికి, నచికేతు నికి కూడ ప్రాణప్రదానము చేసినవాడు.

ఈ సూత్రమున ప్రాణములపై స్వామిత్వమును పొందుమని నచికేతునికి యమదేవుడు సూచన నిచ్చినాడు. ఆత్మలు కూడ ప్రాణ వశముననే దేహధారణము, దేహ పరిత్యాగము అనుభవించుచున్న వని, ఆత్మ బ్రహ్మమే అని ప్రత్యక్షముగ దర్శించిననాడు ప్రాణములు తన వశముననే యుండునని, అట్టి స్థితిని పొందుటకై ప్రయత్నించు మని నచికేతుని నిర్దేశించినాడు.

(58)

శ్లో॥ భయాదశ్యాగ్ని స్తపతి భయాత్తపతి సూర్యః ।
భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమ ॥

(6-3)

నచికేతా! బ్రహ్మము నందు భయము చేతనే అగ్ని, సూర్యుడు, ఇంద్రుడు, వాయువు, మృత్యువు అప్రమత్తతతో తమ తమ విధి నిర్వహణలో నియుక్తులై ఉన్నారు.

*వివరణము :* అగ్ని, వాయువు, సూర్యుడు, ఇంద్రుడు, మృత్యువు బ్రహ్మమునందు వసించువారు. వారియందు బ్రహ్మము వసించును. అట్టి అవినాభావ సంబంధముగల వేదమూర్తులు వారు. వారికి బ్రహ్మమందు భయము కలదు అని చెప్పుట చోద్యముగ నుండును. ఇచ్చట చెప్పబడిన ఈ భయము పరమభక్తి అని భావించాలి. బ్రహ్మమే తామైనపుడు, తమనుండి బ్రహ్మమే వర్తించు చున్నపుడు, తమ తమ విధులు అప్రయత్నంగానే సాగిపోతాయి. అప్రమత్తతతో సాగిపోతాయి. సర్వ సమర్పణము గావించుకొన్న వారికి అనన్య భక్తియే యుండును గాని, భయమున కాస్కారము లేదు. బ్రహ్మము ప్రేమస్వరూపుడు. జ్ఞాన స్వరూపము. ఆనంద స్వరూపము. దానియందు మునిగి

యుండువారు అగ్ని ఆదిగా గల దేవతలు. వారి నుండి బ్రహ్మ సంకల్పమే పనిచేయును. అట్టివారు అప్రమత్తతతో నుందురు. అట్టి అప్రమత్తతను భయమని చెప్పుట కూడ కద్దు. వేదమునందు పేర్కొనబడిన విశ్వేదేవత లందరును బ్రహ్మము ప్రతీకలు.

(59)

**శ్లో॥ ఇహ చేదశకద్ బోద్ధుం ప్రాక్ శరీరస్య విస్రసః ।**
**తతః సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే ॥** (6-4)

నచికేతా! ఈ శరీర పతనానికి పూర్వమే బ్రహ్మమును సాక్షాత్కరించుకోగలిగితే మరల మరల సృష్టిలోని లోకాలలో శరీరధారణం చేయవలసిన అగత్యముండదు. అలా కానపుడు మళ్లీ మళ్లీ శరీరధారణ తప్పనిసరి కాగలదు

*వివరణము :* బ్రహ్మ సాక్షాత్కారము గూర్చి, అది సిద్ధించు సాధనను గూర్చి యమదేవుడు నచికేతునికి కూలంకషంగా ముందు తెలిపిన అనేక సూత్రాలలో వివరించాడు. అలాగే జీవస్వరూపం, దేహ స్వభావం కూడ వివరించాడు.

కామ పూరణమునకు ఏ లోకమందైనను శరీరము యొక్క ఆవశ్యకత యున్నది. శరీరం మాధ్యమంగానే జీవుడు కామము ననుభవించి, కొన్ని జన్మల అనంతరం పరితుష్టుడవుతాడు. కామం కారణంగానే స్థూల లోకములందు, సూక్ష్మ లోకములందు, దివ్య లోకములందు కూడ శరీరధారణ ఉంటుంది. మూడు లోకాలలోను పొందవలసిన అనుభూతి కారణంగా జీవులు దేహధారణ చేయవలసి ఉంటుంది.

అనుభవము ద్వారా కామము యొక్క స్వరూప స్వభావములు ఎరిగిన జీవుడు, కామమునుండి దృష్టి ఈశ్వరుని వైపునకు మళ్లించడం జరుగుతుంది. ఇది పరిణామదశలో భాగం. అట్లు దృష్టి ఈశ్వరునిపై ప్రసరించునపుడు, ఈశ్వరానుసంధానము పరిపూర్ణమైన దశలో దేహధారణ ఆవశ్యకత ఉండదు. అట్టి వారికి దేహము ధరించవలసిన అగత్య ముండదు. కాని దివ్య సంకల్పము మేరకు వారు స్వచ్ఛందముగ దేహములు కట్టుకొను సామర్థ్యము కలిగి ఉంటారు. ముందు శ్లోకములో తెలిపిన అగ్ని, వాయువు, సూర్యుడు, మృత్యుదేవత అట్టి స్వచ్ఛంద దివ్య సేవకులు. వారికి ఇతర జీవులవలే శరీరములు బంధకారకములు కావు. ఇట్టి స్వచ్ఛంద స్థితిని పొందుమని యమ దేవుడు నచికేతునికి సూచిస్తూ ఉన్నాడు.

(60)

**శ్లో॥ యథాదర్శే తథాత్మని**
**యథాస్వప్నే తథా పితృలోకే ।**
**యథాప్సు పరీవ దదృశే తథా గంధర్వ**
**లోకే ఛాయా తపయోరివ బ్రహ్మలోకే ॥** (6-5)

నచికేతా! ఆత్మను ఆత్మలో దర్శనం చేయటం, పితృలోకంలో కలలాగ దర్శనం చేయటం, గంధర్వలోకంలో నీటిలోని ప్రతిబింబంగా దర్శనం చేయటం, బ్రహ్మలోకంలో వెలుగునీడల మాదిరిగ దర్శనం చేయటం జరుగుతుంది.

*వివరణము :* సాధకునియొక్క చైతన్య స్థితినిబట్టి ఆత్మ దర్శనం అనేక రకాలుగ ఉంటుందని యమదేవుడు నచికేతునకు తెలియ జేస్తున్నాడు. మొదటగ తనయందు తానుగ దర్శన మిస్తుంది. అద్దంలో మనరూపం మనకు ఎలా గోచరిస్తుందో అలాగే ధ్యాన స్థితిలో తన రూపమే తనకు కాంతివంతంగ, తేజోమయంగా గోచరిస్తుంది. స్పష్టంగా గోచరిస్తుంది. ఇది ఉత్తమమైన దర్శనం. తన బాహ్యరూపము తన సూక్ష్మరూపమునకు ప్రతిబింబము. తాను ఈశ్వరుని ప్రతి బింబము. రక్తమాంసాదులతో కూడిన శరీరమందు తాను ప్రతి బింబించడం గ్రహించినపుడు, తాను తన బాహ్యరూపం కన్న చాల

సున్నితమైన వాడని తెలుస్తుంది. అంతేకాదు, తన రూపం సూక్ష్మంగా కూడ ఉంటుంది. అంటే చాల చిన్నదిగ, తేజోవంతంగా ఉంటుంది. నిజమునకు సున్నితమైన తాను ముతకగా తన శరీరం గోచరిస్తూ ఉంటాయి. శరీరం వాహనంగా తాను వర్తిస్తున్నట్లు తెలుస్తుంది. వేరుశనగకాయతో ఉండే వేరుశనగ పప్పువలె తాను వేరుగ తనకు కనిపిస్తాడు. అట్టి తనయందు మరింత సున్నితంగా, మరింత సూక్ష్మంగా తనకు మూలంగా యున్న రూపం గోచరిస్తుంది. ఆ మూలతత్త్వం గూడ తనలాగే గోచరిస్తుంది. ఇలా తానే ముగ్గురుగా ఉండటం తెలుస్తుంది. 1. తన మూలం, 2. తాను, 3. తన దేహం. మూడూ ఒకే రకంగా ఉంటాయి. కాకపోతే ఒక దానికన్న మరియొకటి సూక్ష్మము మరియు తేజోవంతము. నిశ్చలంగా తనమూలం తనకు గోచరిస్తూ ఉండగ, తాను ఆనంద స్థితిలో తాదాప్యంతో బాహ్యస్థితి మరచి ఆత్మజ్ఞాని రమిస్తూ ఉంటాడు. అతనికి సమస్త ప్రపంచం ఒక కలలాగ, ఒక అద్దాలమేడలాగ గోచరిస్తూ ఉంటుంది.

పై తెలిపిన సిద్ధికి పూర్వము తన మూలముయొక్క దర్శనము కలలోలాగ, నీటిలో ప్రతిబింబంలాగ వెలుగు నీడలతో స్పష్టా స్పష్టముగ గోచరిస్తూ ఉంటుంది. ధ్యానం స్థిరపడే వరకు చైతన్యపు కదలిక వలన పై తెలిపిన మూడు విధాలుగ గోచరిస్తూ ఉంటుంది. సాధన స్థితిలో పై తెలిపిన మూడు విధాలుగ అనుభూతి అవుతూ ఉంటుంది. సిద్ధి కలిగినపుడు తనలోతాను స్పష్టంగా గోచరిస్తాడు. అట్టి స్థితిలో శరీరం కూడ వేచివున్న వాహనంలాగ కనిపిస్తుంది. ఈశ్వరుడు, తాను, తన శరీరం. మూడూ ఏక కాలంలో గోచరిస్తాయి.

(61)

**శ్లో॥ ఇంద్రియాణాం పృథగ్భావ ముదయాస్తమయౌ చ యత్।**
**పృథగుత్పద్యమానానాం మత్వా ధీరో న శోచతి ॥**

(6-6)

నచికేతా! ఇంద్రియగోచరమగు రూపములు ఉదయాస్త మయములవలె విభిన్నంగా గోచరిస్తూ, అంతరిస్తూ ఉంటాయి. ఈ రూపముల వెనుకనున్న సత్యమును దర్శించి, ఈ మార్పు చెందే రూపములందు చిక్కుకొనక ఉండువాడు తెలిసినవాడు.

*వివరణము :* వెండితెరమీద సినిమా చూస్తున్నపుడు అనేక రూపాలు గోచరిస్తూ ఉంటాయి. అవన్నీ ప్రతిబింబితములే. వెండితెర అనే సత్యంపై అన్ని రూపాలు, వాటి కదలికలు ఉంటాయి. నిజానికి అక్కడ ఉన్నది వెండితెరయే! పర్వతాలు, నదులు, అడవులు, పట్టణాలు, మనుషులు, జంతువులు, గ్రహగోళాలు, తారకలు- అన్నీ వెండితెర ఆధారంగానే గోచరిస్తున్నాయి. వెండితెర లేకపోతే అవియేవీ గోచరించవు. వాటికస్తిత్వమే ఉండదు. తెరపై నది పారినట్లు, గాలి వీచినట్లు, మంటలు మండినట్లు అనిపించినా అవి సత్యములు కావు. అలాగే తాను వెండితెరపై శుద్ధచైతన్యంగా తనకు తాను తెలిసినపుడు,

కనపడుతున్నదంతా బొమ్మలాటలా ఉంటుంది. ఆ బొమ్మలాటలోని హాని వృద్ధులు, పోకడలు, కదలికలు వెండి తెరకుండనట్లు, ప్రాజ్ఞులకు సమస్తము ఒక సినిమాలా, నాటకంలా ఉంటుంది. ఇది ఉత్తమోత్తమ మైన స్థితి.

(62)

**శ్లో॥ ఇంద్రియేభ్యః పరం మనో మనసః సత్త్వముత్తమమ్।**
**సత్త్వాదధి మహానాత్మా మహతోఽ వ్యక్తముత్తమమ్ ॥**

**శ్లో॥ అవ్యక్తాత్తు పరః పురుషః వ్యాపకోఽ లింగ ఏవ చ ।**
**యం జ్ఞాత్వా ముచ్యతే జంతురమృతత్వం చ గచ్ఛతి॥**

(6-7,8)

నచికేతా! ఇంద్రియములకు పరమైనది మనసు. మనస్సుకన్న సూక్ష్మమైనది బుద్ధి. బుద్ధికి మూలము మహత్తు. మహత్తు కన్న సూక్ష్మతమమైనది అవ్యక్త ప్రకృతి. అవ్యక్త ప్రకృతిని కూడ అధిష్ఠించి సర్వవ్యాపి అయినటువంటి తత్త్వము. అతడే పురుషుడు. అతనిని సాక్షాత్కరించుకోవటం వలన అమరత్వము, బ్రహ్మత్వము, శాశ్వ తత్వము, ముక్తస్థితి ఇత్యాదివి మానవుడు పొందుచున్నాడు.

*వివరణము :* పరమపురుషుని అవరోహణ క్రమమున ఈ క్రింది విధముగ అవగాహన చేసుకొనవచ్చును.

1. పరమ పురుషుడు, సర్వవ్యాపి, సర్వాత్మ.

2. పరాప్రకృతి, అవ్యక్త ప్రకృతి.

3. మహత్తు, మహదహంకారము.
4. బుద్ధి, విచక్షణ, వివేకము.
5. మనస్సు.
6. ఇంద్రియములు.
7. శరీరము.

ఈ సోపానక్రమమున మానవుడు మనసేంద్రియ శరీరములను నిత్యము వినియోగిస్తూ ఉంటాడు. అతడు మహదహంకార స్వరూపుడు. తామస అహంకారము, రాజసిక అహంకారము, సాత్విక అహంకారములకు లోబడి జీవిస్తూ ఉంటాడు. అతడు బుద్ధిని వినియోగించుకుంటే ధర్మమార్గంలో సుఖశాంతులు పొందుతాడు. లేకుంటే సుఖశాంతులు కోల్పోయి చిక్కులలో పడి జీవిస్తూ ఉంటాడు.

బుద్ధితో అనునిత్య మనుసంధానము చెంది, మహత్తు నందలి మూడు అహంకారములను సమన్వయించకొన గలిగితే, అతడు అవ్యక్త ప్రకృతిని, పరమ పురుషుని అనుభూతి చెందవచ్చు. అట్లు కానపుడు మూడు గుణములకు లోబడి బుద్ధికి దూరమై మనస్సునాశ్రయించి, జనన మరణములను, సుఖదుఃఖములను, సృష్టి ద్వంద్వములను అనుభవిస్తూ మర్త్యుడై ఉంటాడు. మానవుడు సత్సాంగత్యమున, సద్గ్రంథ పఠనము వలన వివేకమును పొంది, ధర్మానుష్ఠానమున మూడు గుణములను సమన్వయించుకొని అతీతమగు సత్, చిత్ స్థితిని పొందుట సమస్త సాధనల సారాంశము. అట్టి వానికి జనన మరణ యాతన లుండవు.

(63)

శ్లో॥ న సంధృశే తిష్ఠతి రూపమస్య
న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్ ।
హృదా మనీషా మనసాఽభిక్లుప్తో
య ఏతద్ విదురమృతాస్తే భవంతి ॥

శ్లో॥ యదా పంచావతిష్ఠంతే జ్ఞానాని మనసా సహ ।
బుద్ధిశ్చ న విచేష్టతి తామాహుః పరమాంగతిమ్ ॥

(6-9,10)

నచికేతా! ఆత్మ స్వరూపము మనసుతో కాని, ఇంద్రియములతో కాని చూడ వీలుపడదు. హృదయమందు స్థిరపడి, బుద్ధియొక్క స్ఫూర్తితో దర్శించినచో ఆత్మ ప్రకటితుడవుతాడు.

బుద్ధి నిశ్చలమైనపుడే, హృదయమందు స్థిరముగ నున్నపుడే ఆత్మ ప్రకటిత మవటానికి అవకాశమున్నది. బుద్ధి నిజంగా నిశ్చల మైనపుడు మనసేంద్రియములు బుద్ధిలో లయమై, బుద్ధి ఒక్కటే ఉంటుంది. అట్టి బుద్ధి నిశ్చలమై ఉన్నపుడు అందులోపల ఆత్మ దర్శింప బడుతుంది. ఇది సత్యం.

*వివరణము :* భగవద్గీత యందలి ఆరవ అధ్యాయమైన 'ఆత్మ సంయమ యోగము' మొత్తము ఈ ఒక్క శ్లోకమందు దర్శించవచ్చు.

మనసేంద్రియములకు నిలకడ, నిశ్చలత్వము లేవు. చపలత్వమే వాని లక్షణము. కోరికల వలన, ఆలోచనల వలన మనసేంద్రియములు ఎప్పుడూ విచలితమవుతూ ఉంటాయి. మనసు గాలిలో పెట్టిన దీపంలాగ రెపరెప లాడుతూ ఎట్టి కాంతినీ ఈయలేదు.

జీవుడు కోరికల నుండి కర్తవ్యము వైపునకు ఉన్ముఖుడు కావాలి. చేయవలసిన పనే చేయాలి. ఆహార విహారములు, భాషణము కూడ కర్తవ్యము మేరకే వినియోగించాలి. కర్తవ్య నిర్వహణమున శ్రద్ధ కలిగి, ఫలముల యందు దృష్టిపోనీక నిర్వర్తిస్తూ ఉండాలి. సంకల్పములు కూడ కర్తవ్యమును గూర్చియే ఉండాలి. అట్టి వానికి కర్తవ్యమందు భక్తిశ్రద్ధ లేర్పడి, మనసేంద్రియములందు చపలత్వం తగ్గుతుంది.

అటుపైన సత్పురుష సమాగమము, సత్సాంగత్యము, సద్గ్రంథ పఠనము అలవడినచో మోహ శోకములనుండి ప్రజ్ఞ విడివడి మరింత స్థిరమై, గాజు చిమ్నీ ఏర్పరచిన దీపమువలె నిశ్చలమగును. అట్లు నిశ్చలమైన బుద్ధితో, ఆత్మ దర్శనానికి ప్రయత్నం చేయాలి.

అట్టి బుద్ధితో భ్రూమధ్యమందు ఆత్మ దర్శనానికి ప్రయత్నం చేయటం సుదీర్ఘ కాలం సాగాలి. బుద్ధి నిశ్చలతను బట్టి, కర్మ పరిపాక

మును బట్టి, కాలము దేశమును బట్టి ఆత్మ దర్శనము అనుగ్రహంగా లభిస్తుంది. ఎట్టి ప్రయత్నం చేయక ఆత్మ దర్శనము నభిలషించువారు కేవలము కాంక్షాపరులే యని యముడు నచికేతుని హెచ్చరించుచు నున్నాడు.

64

శ్లో॥ తాం యోగమితి మన్యంతే స్థిరామింద్రియధారణామ్।
అప్రమత్తస్తదా భవతి యోగో హి ప్రభవాప్యయౌ ॥

(6–11)

నచికేతా! స్థిరముగ ఇంద్రియధారణ సిద్ధించినవాడే యోగి. అట్టి వాడే ప్రమాద రహితుడు. ఈ యోగము పొందవచ్చు, పోగొట్టు కొనవచ్చును కూడ.

*వివరణము :* తనయందు తానుండువాడు యోగి. అట్టివాడు మనసు, ఇంద్రియముల ద్వారా బాహ్య ప్రవృత్తులలోనికి కర్తవ్యము మేరకు ప్రవేశించి, అనంతరం ఇంద్రియ మనోవృత్తులను శ్వాసద్వారా అధిగమించి, తనయందు తానుంటాడు. అతడికి మనసు, ఇంద్రియ ములు బహిరంగ ప్రవేశమునకు సౌకర్యములే. కర్తవ్య మున్నపుడే వానియందు ప్రవేశించి, బహిరంగమున సంచరిస్తాడు. ఇతర సమయ ములలో తనయందలి స్వస్థానమున తానుంటాడు. హృదయము బహిరంగ, అంతరంగ ప్రవేశ ద్వారము. అది సింహద్వారము వంటిది. గృహస్థుడు సింహద్వారము వెనుక కార్యములను నిర్వర్తించి, సింహ ద్వారము నుండి లోనికేగి విశ్రాంతిగొనును. మరింత విశ్రాంతి గొనుటకై గృహము లోలోనికి చనును.

అట్లే యోగికూడ ఇంద్రియములు, మనస్సు యొక్క ప్రవృత్తుల నుండి తన హృదయమును చేరి, అటుపైన భ్రూమధ్యమును చేరి, తనయందు తానుండును. అవసరమగుచో మరల హృదయము చేరి బహిరంగమున ప్రవేశించును. అతనిని మనో ప్రవృత్తిగాని, ఇంద్రియ ప్రవృత్తి గాని బలముగ బహిరంగమునకు ఆకర్షింపవు.

యోగి బహిరంగ వ్యామోహము, వ్యాపకము లేనివాడు. కర్తవ్య మున్నపుడే బహిరంగమున ప్రవేశించును. సామాన్య జనులు అనేకానేక విషయములపై మోహపడుదురు. ఆశపడి బాహ్యమున భంగపడుచుందురు. యోగి చిత్తమట్లుగాక, స్థిరమై యుండును. వృత్తి నిరోధక సామర్థ్యము కలిగి యుండును. *"యోగః చిత్తవృత్తి నిరోధకః"* అని పతంజలి మహర్షి యోగమును నిర్వచించెను. నిరోధింపబడిన వృత్తముగల చిత్తము బాహ్యమందు స్థితి గొనక అంతరంగము చేరి, అంతరంగమున కూడ మరింత గంభీరమగు రంగమున వసించును. అది శ్రీరంగము వంటిది. బాహ్యము భూరంగము వంటిది. శ్రీ, భూ రంగముల యందు స్వేచ్ఛగ వర్తించువాడు యోగి.

ఇంద్రియ మనో వృత్తులకు లోబడినవారు పై తెలిపిన స్థితిని పొందుటకు కర్మ, జ్ఞాన, సన్యాస యోగములను నిర్వర్తించుకొని, ఆత్మ సంయమమునకై ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణలను అభ్య సింపవలెను. మరియొక మార్గము లేదు. యోగికి హృదయమున సింహాసనము ఏర్పడి యుండును. భ్రూమధ్యమున రాజసింహాసన

ముండును. యోగి స్థితిని బట్టి అతడీ రెండు ఆసనములు గైకొని యుండును. సామాన్యులు చంచలమగు మనసునందు, అతిచంచల మగు ఇంద్రియముల యందు అస్థిరులై సతమతమగుచు నుందురు.

తనయందు తానున్న వానికి ఆత్మానందముండును గనుక అతడు ఇతరానందములకై బాహ్యమందు వెతుకులాట లేనివాడై యుండును. యోగి స్వాత్మానందుడు. ఆ స్థితి యందు స్థిరపడుటకై ఇచ్ఛగించును. కాలమును, కర్మమును బట్టి అట్టి స్థితి కోల్పోయినను మరల పొందగలడు.

## (65)

**శ్లో॥ నైవ వాచా న మనసా ప్రాప్తుం శక్యో న చక్షుషా ।**
**అస్తీతి బ్రువతోఽన్యత్ర కథం తదుపలభ్యతే ॥**

(6-12)

నచికేతా! మాటల చేతగాని, మనో భావనలచేత గాని, కన్ను ఇతర ఇంద్రియముల చేతగాని ఆత్మ లభ్యం కాదు. ఆత్మానుభూతి పొందినవారి నుండి దీనిని పొందవచ్చును. ఇతరత్రా ఇది వీలుపడదు.

*వివరణము :* ధనవంతుడు ధనము నీయగలడు. బలవంతుడు బలము నీయగలడు. విద్యావంతుడు విద్య నీయగలడు. జ్ఞానవంతుడు జ్ఞాన మందించగలడు. అట్లే ఆత్మవంతుడు మాత్రమే ఆత్మానుభూతికి దారి చూపగలడు.

దీపంతో దీపం వెలిగించవచ్చు లేదా అగ్గిపుల్లతో వెలిగించ వచ్చు. లేదా రాపిడి నుండి అగ్నిని పుట్టించి, ఆ అగ్నితో దీపం వెలిగించవచ్చు. దీపంలో అగ్ని నిహితమై యున్నను దానంతటదిగ జ్యోతిస్వరూపం దాల్చలేదు. మరొక సాధనం కావాలి. అలాగే ఆత్మానుభూతి పొందటానికి ఆత్మవంతుని సహాయము తప్పనిసరి. ఏ నేర్పుకైనా గురువు ఆవశ్యకత యున్నది. గురూపదేశం లేక ఏ

విద్య రాణింపదు. ఆత్మ విద్యయైనా అలా తెలియవలిసిందే. ప్రతి జీవి ఆత్మ అయినప్పటికి, నిహితమైన ఆత్మ ప్రకాశించడానికి మరియొక ఆత్మజ్యోతి అవసరం. అదే గురువు.

గురూపదేశాన్ని శ్రద్ధాభక్తులతో నిర్వర్తించుకొనేవారు ఆత్మసిద్ధిని పొందగలరు. జ్యోతితో వత్తిని వెలిగించినంత సులభముగ గురూప దేశంతో ఆత్మ ప్రకాశించి అనుభూత మవుతుంది. చతుర్ముఖ బ్రహ్మ కైనా, సనకాది మానస పుత్రులకైనా, నారదాది దేవర్షులకైనా, వశిష్ఠాది ప్రజాపతులకైనా గురూపదేశం వలననే ఆత్మజ్ఞానం లభించింది. ఆత్మ జ్ఞానానికి గురుశిష్య సంప్రదాయం సృష్టి ఆరంభము నుండి యున్నది. ఈ ఉపాఖ్యానమున యమదేవుడు గురువుగ, నచికేతుడు శిష్యుడిగ ఆత్మజ్ఞానాన్ని ఉపదేశ పూర్వకంగా అందించబడినది.

ఎన్నిమార్లు ఈ ఉపాఖ్యానము చెప్పుకున్నను, మనో భావనము చేసినను పాఠకునకు ఆత్మజ్ఞానముగాని, మరణస్థితిగాని తెలియదు. ముమ్మాటికి తెలియదు. తెలియవలెనంటే ఆత్మజ్ఞాని ఉపదేశము వలన, శిష్యుని అనుష్ఠానమున మాత్రమే తెలుస్తుంది. ప్రత్యక్ష గురువు లేక ఆత్మవిద్య పొందుట అసంభవమని తెలియజేసే సూత్రమిది.

శ్రద్ధా భక్తులతో ఇట్టి ఉపాఖ్యానములు పఠించు వారికి ప్రత్యక్ష గురువును గూర్చిన తపన వృద్ధి చెందుతుంది. అట్టి వారి జీవితంలోనికి సద్గురువు ప్రవేశించడం జరుగుతుంది. ఇది సృష్టియందలి శాశ్వత ధర్మములలో నొకటి.

మనసా, వాచ, కర్మణ ఆత్మజ్ఞానము సిద్ధించదని, గురు కటాక్షం వలననే సిద్ధిస్తుందని పాఠకులు తెలుసుకోవాలి. భగవద్గీతలో పరమాత్మ ఈ విషయాన్నే అర్జునునికి బోధిస్తాడు. సద్గురువు చెంత చేరి, శుశ్రూష గావించి, సేవచేసి పరిప్రశ్నము చేయుచు, ఉపదేశము ననుగ్రహముగ పొందాలి. ఈ విషయం తెలుసుకో అని శ్రీకృష్ణుడు తెలపటం జరిగింది. అర్జునుడు శ్రీకృష్ణుని బంధువుగను, మిత్రుడుగను భావించెనేగాని, త్రైలోక్య గురువని తెలియక అతనియందు శుశ్రూష, సేవాది కార్యములు చేయక, ఖిన్నపడి అటుపై తెలుసుకొని ఉపదేశము పొంది తరించినాడు. సద్గురువు చెంతనున్నను, అనుగ్రహ పూర్వక ముగ, అనుభవ పూర్వకముగ ఉపదేశము లభింపనపుడు, కేవల సన్నిహితత్వము తరింపు నీయదు. ఇది సత్యము.

(66)

**శ్లో॥ అస్తీత్యేవోపలబ్ధవ్య స్తత్త్వభావేన చోభయోః ।**
**అస్తీత్యేవోపలబ్ధస్య తత్త్వభావః ప్రసీదతి ॥** (6-13)

నచికేతా! ఉన్నది ఆత్మయే. దానిని సాక్షాత్క రించుకొన్న వానికి మాత్రమే ఆత్మయొక్క ఉండుట, లేకుండుట అను స్థితులు అవగాహన అవుతుంటాయి.

*వివరణము :* "నేనున్నాను" అనే సత్యమున్నది. ఈ నేను చుట్టును మూడు గుణములు, ఐదు భూతములతో ఎనిమిది ఆవరణలు ఏర్పడుతుంటాయి. ఈ ఆవరణలకు బలము తానే. తన అస్థిత్వము వలననే వాటికిని అస్థిత్వము. తన చైతన్యమే వానియందు వర్తిస్తూ ఉంటుంది. అవిలేకున్నను తానున్నాడు. అవి ఉన్నపుడు వాటి యందు వ్యాప్తి చెందియుంటాడు. ఈ ఎనిమిది ఆవరణలతో కూడిన రూపము పుట్టటం, వృద్ధి చెందటం, పెరగటం, నశించటం అనే మార్పులకు గురియగుతుంది. తాను మాత్రం కాలము యొక్క మార్పులకు గురికాక, తానుగా ఉంటాడు. తనకు కాలపరిమితి లేదు. తన నుండి ఏర్పడిన వాటికి కాలపరిమితి ఉంటుంది. ఆవరణలు లేని తాను తనకు తెలియటం సాక్షాత్కారం. తానుండుట అనగా ఏమో తెలియుటయే ఆత్మ సాక్షాత్కారము.


సాక్షాత్కారానుభూతి కలిగిన నేనను ఆత్మకు తానుండుట, లేకుండుట అను స్థితులు కూడ సమాధియందు జరుగుతూ ఉంటాయి. ఆత్మ సాక్షాత్కారమే కాని వానికి ఈ అంతిమ రహస్యం తెలియదు. తానెవరో తెలిసినవానికే తానుండుట, లేకుండుట అను స్థితులు క్రమంగా బోధపడతాయి. తానున్నాను అనుకొను వానికి, తాను లేడని ఎట్లు తెలియును? తానుండుట, తాను లేకుండుట అను స్థితులు బ్రహ్మజ్ఞానులకు మాత్రమే తెలియును. ఇతరులకు ఈ మీమాంస అయోమయంగా ఉంటుంది. అందువలన తానుండుట అనగా ఏమో తెలియుట ప్రధానము.

(67)

శ్లో॥ యదా సర్వే ప్రముచ్యంతే కామా యేఽస్య హృది శ్రితాః।
అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥

(6-14)

నచికేతా! హృదయంలో విషయవాంఛలు లేశమాత్రం కూడ లేకుండా ఎవనియందు నిర్మూలింపబడతాయో, అపుడు మర్త్యుడగు మానవుడు అమరుడవుతాడు. అట్టివానికి క్రమశః బ్రహ్మజ్ఞానం లభిస్తుంది.



*వివరణము :* పన్నెండు (12) దళములుగల హృదయ పద్మము, నాలుగు పొరలలో ఉంటుంది. ఒక్కొక్క పొరలోను మూడు దళము

లుంటాయి. ఈ నాలుగు పొరలు మానవునిలోని అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములకు ప్రతీకలుగా ఉంటాయి. ఇందే పొరయందైనను (ఏ కోశమందైనను) ప్రాపంచిక వాంఛ యున్నపుడు హృదయగ్రంథి విడివడదు. గ్రంథి భేదనము జరుగదు. అట్టివాడు మరణింపక తప్పదు. హృదయగ్రంథి భేదనము నకు నాలుగు కోశములందలి విషయ వాంఛలన్నీ నిర్మూలింపబడాలి. అంతరంగ ఆరాధనమున ఇది సాధ్యపడుతుంది. విజ్ఞానకోశము వరకు అన్ని కోశములు తనకు బహిరంగమే. వానిని దాటి లోనికేగే ప్రయత్నం చేయాలి. అందుకోసం శ్వాస నాశ్రయించాలి. స్పందనాన్ని చేరాలి. స్పందన నుండి సూక్ష్మస్పందనం చేరాలి. సూక్ష్మస్పందనం చేరినవానికి లోవెలుగు గోచరిస్తూ ఉంటుంది. ఆ వెలుగు నందాసక్తి కలిగి అంతర్ముఖుడై ఆరాధన చేయాలి. బహిరంగమందు కర్తవ్యమునే నిర్వర్తిస్తూ, ఫలాసక్తి లేకుండా జీవించటం అభ్యాసం చేసుకోవాలి. అలా ఉన్నపుడు వైరాగ్యం సహజంగా ఉంటుంది. అంతర్ముఖ అభ్యాసానికి సమయం పెరుగుతుంది. లో వెలుగును సమీపిస్తున్న కొలది గ్రంథిభేదనం జరిగి, నిర్మలుడైన సాధకుడు వాంఛా బంధముల నుండి ముక్తుడై అమరత్వ స్థితి పొందుతాడు.

అంతర్ముఖ ఆరాధన వెలుగును గూర్చి పురోగతి చెందు చుండగా, సాధకుడు బ్రహ్మజ్ఞానమునకు ఉద్యమిస్తాడు. ఊర్ధ్వముఖుడై ప్రజ్ఞ విశుద్ధి మీదుగా భ్రూమధ్యం చేరుతుంది. ఈ ఊర్ధ్వముఖ మార్గం

సుషుమ్న మార్గం. ఆ మార్గంలో ప్రవేశించినవాడు క్రమంగా ఫాల భాగంచేరి, అటుపైన సహస్రారం చేరడం సంభవిస్తుంది.

నచికేతునికి యముడా మార్గాన్ని దర్శింపజేసి, ప్రోత్సహిస్తాడు. ఇతర వాంఛలేమీలేని సత్పురుష డగుటచేత నచికేతునికి సుషుమ్న ప్రవేశం, ఊర్ధ్వగమనం, బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుంది.

(68)

శ్లో॥ యదా సర్వే ప్రభిద్యంతే హృదయస్యేహ గ్రంథయః ।
అథ మర్త్యో౽మృతో భవత్యేతావద్ధ్యను శాసనమ్ ॥

(6-15)

నచికేతా! దేహమున్నపుడే హృదయగ్రంథి భేదన జరిగిన వానికి మాత్రమే మరణం దాటే అర్హత ఏర్పడుతుంది. ఇతరుల కది అసాధ్యం.

*వివరణము :* జీవులకు లోకాలతో ముడి హృదయమందు ఏర్పడుతుంది. లోకాకర్షణే దానికి కారణం. ఈ లోకమందు అనేకానేక మైనటువంటి ఆకర్షణ లున్నమాట వాస్తవం. జీవులు ఆకర్షింపబడటం కూడ వాస్తవమే. ఆ ఆకర్షణ వలన లోకంతో బంధ మేర్పడుతుంది. లోకులతో బంధ మేర్పడుతుంది. అది అనేకమై జన్మల తరబడి బంధాలు కొనసాగుతూ ఉంటాయి. లోకాకర్షణ, బంధములు కారణ ముగ జీవునికి శరీరంతో బంధ మేర్పడుతుంది. అది హృదయమందు ముడివలె ఏర్పడి, లోక విషయములకు బాధపడే స్థితిలోకి జీవుడు దిగజారుతాడు. భార్య, కుటుంబము, బంధువులు, మిత్రులు, ధనము, ఆస్తిపాస్తులు, కీర్తి ప్రతిష్ఠలు జీవునికి ఆనందంతో పాటు బంధం కూడ కలిగిస్తాయి. అందువలన దేహం వదలవలసిన సమయం

వచ్చినపుడు, ఈ బంధం వలన తీరని బాధ కలుగుతుంది. ఒంటరిగా వచ్చిన జీవుడు ఒంటరిగానే పోతాడు. కాని నడుమ ఏర్పడిన బంధాల వలన దేహము నుండి నిష్క్రమణము అత్యంత బాధను కలిగిస్తుంది.

అట్టి బాధ కలుగకుండుటకై జీవునికి జ్ఞాన వైరాగ్యము లావశ్య కములైనవి. జ్ఞాన వైరాగ్యములు లేనినాడు మోహము, శోకము, దుఃఖము, బాధ జీవుని అనేక విధములుగ బంధిస్తూ ఉంటాయి. తనలోని ఈశ్వరునియందు భక్తి, అనుసంధానము ఫలితంగా యోగము సిద్ధించినపుడు హృదయ గ్రంథి భేదనం జరిగి జీవుడు దేహమునుండి నిష్క్రమించడం అనాయాసంగా సాగుతుంది. కనుకనే అనాయాస మరణము అందరూ కోరుకుంటారు. కాని తదనుగుణమైన జీవన విధానాన్ని అనుసరించరు.

నచికేతుడు యమలోకం చేరినందుకు దుఃఖింపలేదు. భూలోకం విడిచినపుడు అతడికి బాధ కలుగలేదు. యముడు తరచి తరచి అడిగినా, పరిశీలించినా అతని యందు ఏ వాంఛ గోచరించ లేదు. అందువలననే వాత్సల్యంతో యమదేవుడు నచికేతునికి సవివరంగా మరణ రహస్యాన్ని ఉపదేశించాడు. డెబ్బదికి (70) పైగా సూత్రము లను ఉపదేశించాడు. సత్సాధకులకు అవియే మార్గదర్శకాలు.

(69)

శ్లో॥ శతం చైకా చ హృదయస్య నాడ్యః
తాసాం మూర్ధానమభినిః సృతైకా ।
తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి
విష్వంగన్యా ఉత్క్రమణే భవంతి ॥ (6-16)

నచికేతా! హృదయమందు నూట ఒక్క (101) నాడు లున్నాయి. అందు ఒకనాడి ఊర్ధ్వముఖంగా వ్యాపించి ఉంటుంది. ఇతర నాడులు అనేక విధంగా వ్యాపించి ఉంటాయి. ఈ ఊర్ధ్వముఖ నాడే అమరత్వాన్నిస్తుంది. ఇతర నాడులు మరణము, పునర్జన్మము కలిగిస్తాయి.

*వివరణము :* ముందు తెలిపిన విధంగా హృదయమే మనసు నకు, ఇంద్రియములకు మూలస్థానం. హృదయస్థుడగు జీవుడు మనసేంద్రియముల ద్వారమున శతాధికమగు విషయములకు ఆకర్షింపబడుతూ ఉంటాడు. అది కారణంగా ప్రజ్ఞ వంద నాడుల ద్వారా ప్రాపంచిక విషయములలోనికి ప్రసరిస్తూ, వ్యాపిస్తూ ఉంటాడు. ప్రాపంచిక ఆకర్షణలకు ఆకర్షితుడగుచున్న జీవుడు హృదయ గ్రంథులలో చిక్కుపడి మరణిస్తాడు. ఈ గ్రంథిచ్ఛేదనం జరగటానికి ఒకే ఒక మార్గం లోకమును గూర్చి, లోకుల గూర్చి గల వ్యామోహము

నిర్మూలించుకొనుటయే. మోహము వలన వాంఛలు, రాగద్వేషములు, శోకము, అజ్ఞానము వంటి భయములు క్రమ్ముకొనటం సహజం. వాంఛా పూరణము అవివేకమని తెలియనంతకాలము జీవుడు జనన మరణ చక్రంలో తీరికలేక కల్పాంతం తిరుగుతూనే ఉంటాడు. మరు కల్పంలో కూడ అదేపనిగా జన్మలెత్తుతూ ఉంటాడు. వాంఛా పూరణము ఎండమావి వెంట పరుగెత్తుట అని జీవునికి అనిపించుటయే ప్రాథమికమగు అనుగ్రహము. అట్టి అనుగ్రహము గలవాడు క్రమముగ కార్యంకర్మయే (కర్తవ్య కర్మయే) నిర్వర్తించుకుంటూ, క్రమంగా జీవితాన్ని మలుచుకుంటూ, యమ నియమములు పాటిస్తూ, కర్తవ్య కర్మయందు మాత్రమే ఆసక్తి కలిగి, ఫలాసక్తిని గూడ సన్యసించి ప్రాణాయామ, ప్రత్యాహార మార్గముల ప్రవేశిస్తాడు.

అట్టి ప్రయత్నంలో ఉండే జీవునికి హృదయమందు ఊర్ధ్వ ముఖంగా వ్యాపించి ఉన్న నాడి దర్శనమిస్తుంది. ఆ మార్గమున ఉదాన వాయు స్పందన ఆధారముగ, ఊర్ధ్వముఖముగ వెలుగుదారిలో శిరస్సును చేరి, అచ్చట స్థిరపడతాడు. యోగమందు దీనిని ధారణ స్థితి అని తెలుపుతారు. ఇట్టి సాధనయందు నిమగ్నమగుట వలన జీవునికి మరణమునుదాటి తానమరుడనని తెలియుట సిద్ధిస్తుంది.

నచికేతునికి యమదేవుడు ఈ మార్గాన్ని దర్శింప చేస్తాడు. సద్గురువు సామర్థ్య మట్టిది. సాన్నిధ్యమిచ్చి మార్గస్థుడైన శిష్యునికి సిద్ధి కలుగువరకు తోడ్పడతాడు.

(70)

**శ్లో॥ అంగుష్ఠమాత్రః పురుషోఽంతరాత్మా**
**సదా జనానాం హృదయే సన్నివిష్టః ।**
**త్వం స్వాచ్ఛరీరాత్ ప్రవృహేన్ముంజాదివేషీకాం ధైర్యేణ**
**తం విద్యాచ్ఛుక్రమమృతం తం విద్యాచ్ఛుక్ర మమృతమితి॥**

(6-17)

నచికేతా! అంగుష్ఠమాత్ర పురుషుడగు అంతరాత్మ ఎల్లప్పుడు జనుల హృదయములలో నివసించి యున్నాడు. ముంజగడ్డి నుండి లోపలి పోచను వేరుచేసినట్లు, ఈ శరీరం నుండి ఈ అంగుష్ఠమాత్ర పురుషుడు వేరుగ గోచరిస్తాడు. అతడు పరిశుద్ధాత్మ, అమరుడు.

*వివరణము :* అంతరాత్ముడగు జీవుడు స్వయం ప్రకాశకుడు. తేజోరూపుడు. ఈశ్వరాంశ. అతడు సనాతనుడు కూడ. అతడికి నిజానికి మరణం లేదు. అతడు విషయవాంఛలకు లోలుడై మనసునకు, ఇంద్రియార్థములకు లొంగిపోతాడు. అవశుడైపోతాడు. వానికి బానిసయై శరీరమందు వంద రకాలుగ ఇరుక్కుపోతాడు. ఒక కొబ్బరి చెట్టు ఊర్ధ్వమునకు పెరుగుచుండగ, అధోముఖంగా భూమిలోనికి వందలాది వేళ్లతో చొచ్చుకొనిపోయి పెకలింపబడటానికి అనువు

గాకుండ ఉంటుంది. కొబ్బరిచెట్టును కూకటివేళ్లతో పెకలించటం సులభమైన పనికాదు. అట్లే జీవుడు మనసులోనికి, పంచేంద్రియముల లోనికి, సప్తధాతువుల లోనికి బాగా చొచ్చుకొనిపోయి, బయల్పడలేని విధంగా బందీకృతు డవుతాడు. జీవితంపైన, బాహ్య విషయములపైన ఎంత వాంఛ కలిగి ఉంటాడో అంత హృదయ గ్రంథులచే బంధింప బడి ఉంటాడు.

ఒక్కటే పరిష్కారము. ఊర్ధ్వనాడిగ హృదయమందు గోచ రిస్తుంది. అదియే ఉత్తర మార్గము. దానియందు ప్రవేశించే ప్రయత్నం చేసినపుడు శరీరంలో వ్యాపించియున్న జీవప్రజ్ఞను కూడగట్టుకొని అంగుష్ఠమాత్రంగా ఏర్పడి, ఊర్ధ్వగతికి ఉద్యుక్తుడవుతాడు. గడ్డి నుండి పోచను వేరుచేసినట్లు, తన శరీరమందే తాను ముడివీడి హృదయ మందుంటాడు. అట్టివాడు ప్రత్యాహార సాధనద్వారా శిరస్సును చేరి, శరీరం నుండి గూడ బయల్పడగలడు. ఇది ఒక్కటే అమృతత్వ మార్గము.

వేరుశనగ పప్పు, వేరుశనగ కాయనుండి విడిపడి కాయ యందే వసిస్తూ ఉంటుంది. పండిన నారింజపండు నారింజ తొక్క నుండి విడివడి, లోపల భద్రంగా ఉంటుంది. కొబ్బరి పెంకునుండి, కొబ్బరి కురిడి విడివడి పెంకులోనే ఉంటుంది. వేరుశనగ తొక్క, నారింజ తొక్క, కొబ్బరి పెంకు నిర్మూలిస్తే– లోపల వేరుశనగ పప్పు, నారింజపండు, కొబ్బరికురిడి భద్రంగానే ఉంటాయి. అలాగే ముంజ గడ్డిలో గల ముంజపోచ గూడ. సప్తధాతుమయమైన మానవ శరీరంలో

మానవుడు కూడ తన్నుతాను హృదయమందు పదిల పరచుకోవచ్చు. విషయాకర్షణ నుండి వికర్షణ చెందిన మానవుడు ప్రపంచంలోనికి పురోగమించకుండ, తనలోనికి తాను తిరోగమించి, తన హృదయ మందు తనను తాను అంతరాత్మగ బొటనవ్రేలంత రూపంలో, తేజో రూపంగా దర్శిస్తాడు. అట్టివాడు హృదయమందలి ఊర్ధ్వనాడి (సుషుమ్న) మార్గంలో శిరస్సును కూడ చేరవచ్చు. అట్లు చేరిన వానికి దేహమిక బంధమై యుండదు. దేహమందు తాను ఉన్నాడు అను భావన నుండి, తానే దేహము ధరించి యున్నాడు అనే అనుభూతి కలుగుతుంది. వస్త్రములు ధరించినట్లే, దేహములు గూడ ధరించి యున్నానని స్పష్టమవుతుంది. వస్త్రములు విసర్జించినట్లే, దేహము విసర్జించే సౌలభ్యం ఏర్పడుతుంది. అట్టివా డమరుడు. అనగా మరణానుభూతి పొందడు. అట్టివాడు పరిశుద్ధాత్మ.

# ఫలశ్రుతి

మృత్యుదేవతయగు యమదేవునిచే వివరింపబడిన విద్యను, యోగవిధిని పొందిన నచికేతుడు సమస్త మాలిన్యాల నుండి విముక్తుడై, మృత్యురహితుడై, బ్రహ్మజ్ఞాని అయ్యాడు. ఇతరు లెవరైనను యమ దేవుడు బోధించిన ఈ విద్యను, యోగాన్ని అధిష్ఠించి, నచికేతుని వలెనే అమరత్వం, బ్రహ్మత్వం పొందగలరు. ఇది సత్యం.

యమగీతకు ఇది చరమ సందేశం. యమదేవుడు డెబ్బది (70) సూత్రములను నచికేతునికి బోధించాడని ఈ పుస్తకం ద్వారా తెలియవచ్చు. ఇందు వివరింపబడిన జీవన విధానాన్ని, యోగ సాధనను ఎవరు తు.చ. తప్పకుండ అవలంబిస్తారో వారికి అమరత్వం, బ్రహ్మత్వం తప్పక ప్రాప్తిస్తాయి.

నచికేతుడు యమదేవుని సమీపించే సమయానికే అతడు నిర్మలమగు మనసేంద్రియములు కలిగియున్నాడు. అతనికి వ్యక్తి గతంగా ఏ వాంఛలు లేవు. ధర్మనిరతి, ధర్మమునందు రతి పరి పూర్ణంగా ఉన్నవాడు. అతనిని యమదేవుడు పరిపరి విధములుగ ప్రలోభ పెట్టటానికి ప్రయత్నం చేశాడు. కాని నచికేతుడు అచలుడు. ఏ భోగమునకు, సుఖమునకు, ఐశ్వర్యమునకు, కీర్తికి విచలితుడు

కాలేదు. కేవలము మృత్యువు స్వరూప స్వభావాల నెరిగి, మృత్యువు నధిగమించే విధానమే కోరాడు. అతని నిశ్చలమైన బుద్ధికి మృత్యు దేవుడు సంతసించి అమరత్వ, బ్రహ్మత్వ మార్గమును ఉపదేశించడమే గాక, అనుగ్రహించాడు కూడ.

యమదేవుని అనుగ్రహంచేత నచికేతుడు యోగ విద్యయందు, బ్రహ్మ విద్యయందు త్వరితగతిన సిద్ధుడైనాడు. శాశ్వతుడైనాడు. బ్రహ్మజ్ఞానిగ శాశ్వత పదమున నిలచినాడు.

గురూపదేశము ఒక అనుగ్రహము. గురువు అనుగ్రహము అత్యంత విశేషమగు విషయము. గురువు ఉపదేశము చాలమంది శిష్యులకిచ్చినను అందు గురువనుగ్రహమును పొందువారు కొందరే యుందురు. గురువు అనుగ్రహము, గురూపదేశము త్వరితగతిన సిద్ధింపజేయును. నచికేతుడు అట్లు గురువనుగ్రహము పొందిన అదృష్టవంతుడు.


స్వస్తి!

# మరణ రహస్యం - 1

**(మార్కండేయ ఉపాఖ్యానము)**

మాస్టర్ పార్వతీకుమార్

మరణం ఉన్నదని భావించేవారికి మరణాన్ని మన యొక్క కార్యక్రమములు పరిపూర్ణం గావించేంత వరకూ కూడా అలా ఉండు, నన్ను పండనీ. నేను పండిన తర్వాత నేనే శరీరం వదిలివేస్తాను. ఈ లోపల నీవు వచ్చి తీసుకు పోనక్కర లేదు" అని చెప్పే విధానం ఒకటి ఉంది.





ఒక దివ్యమైన ప్రయోజనంకోసం అనునిత్యం తన జీవితాన్ని సమర్పిస్తూ జీవిస్తున్నవాడు, వాడికి ఈ దేహం కొంతకాలం ఉండవలసిన అవసరం ఉంటే, time ప్రకారం దానిని తీసివెయ్యాల్సిన అవసరం లేకుండా పని పూర్తియైన తరువాత శరీరం వదిలెయ్యవచ్చు. శరీరం మనని వదిలేసి వెళ్ళిపోకుండా, మనమే శరీరాన్ని వదిలేసి వెళ్ళిపోవడం అనే ధర్మం ఒకటి ఉన్నది. ఇదే మార్కండేయుని కథలో ప్రధానమైన సూత్రం.

వెల : రూ॥ **80-00**

# మరణ రహస్యం - 2

**(సతీ సావిత్రీదేవి ఉపాఖ్యానము)**

మాస్టర్ పార్వతీకుమార్





భరత ఋషులు మానవులకు గాయత్రి ఆరాధన నిచ్చారు. గాయత్రి ఆరాధన ద్వారా దివ్యత్వమును పొంది, దివ్యలోక సంచారము గూడ చేయవచ్చు. దివ్య దేహ నిర్మాణము గావించుకొనవచ్చు. దేహమందు ఉండగానే, దివ్య దేహమును సాధించుకోవాలి. ఆ దేహముతో దివ్యలోక సంచారం గావించవచ్చు. మరణము దేహమునకే కాని, తనకు కాదని తెలియవచ్చు. మరియు జీవన ప్రయోజనము సిద్ధించువరకు, దైవకృపతో దేహమందు ఉండవచ్చు. మహాత్ముల జీవితములలో గోచరించే సూక్ష్మమగు ఘట్టము లివి.

వెల : రూ॥ **100-00**

# మరణ రహస్యం-3

**(నచికేత విద్య)**

మాస్టర్ పార్వతీకుమార్




"శరీరం ఆహుతి అయిపోయే లోపల మనం శరీరం నుండి బయట పడటం నేర్చుకోవాలి. అందుకే కఠ ఉపనిషత్తు. అందుకే సమస్త జ్ఞానము. నీలోని ఈశ్వరుడు సత్యము. అతడే ధర్మజ్ఞుడు, యజ్ఞ స్వరూపుడు కూడా. నీవతనిని ఎరిగి, ధర్మ మాచరించాలి. అపుడు నీకు అక్షరుడ వని తెలుస్తుంది. నీలోని ఈశ్వరుని నీవు అనుసరిస్తూ వుంటే నీలోని క్షరుడు (నీ స్వభావ పురుషుడు) నిన్ను అనుసరిస్తాడు. నీలోని పెద్ద అయిన ఈశ్వరుని నీవు అనుసరిస్తే, నీ నుండి పుట్టిన క్షరుడు నిన్ను అనుసరిస్తాడు. నీవు నీ తండ్రిని అనుసరిస్తూ వుంటే, నీ కుమారుడు నిన్ను అనుసరిస్తాడు. ఇలా మనలో గల ముగ్గురు సమన్వయం కలిగివుంటే, నీ నిజస్వరూపం నీకు ధారణ స్థితిలో గోచరిస్తూ వుంటుంది."

వెల : రూ॥ **100-00**

నిజమునకు జీవునకు ఈశ్వరుడు అత్యంత సన్నిహితుడు. తనయందే నిహితమై యుండుట వలన జీవుడు గుర్తింపలేక, అతడితో కూడి యుండలేక బంధనావస్థలను, భయమును పొందుచున్నాడు. మరణమును కూడ కొనితెచ్చుకొను చున్నాడు. జీవనానుభూతి నిశ్శేషముగ, మధురముగ అనుభూతి చెందుటకు ఈశ్వర సాన్నిధ్యము ఉత్తమోత్తమ మార్గము. అట్టి ఈశ్వరుడు తనయందే, తనవలెనే యుండుట వలన స్థూలపుబుద్ధికి గ్రహింపు కలుగదు. కనుకనే ఇన్ని తిప్పలు.

క్షరమగు దేహము నుండి అక్షరమగు అంగుష్ఠమాత్ర పురుషుని నిర్మాణము చేసుకొనుట ఇందు ప్రత్యేకముగ సూచించబడినది.

ISBN 978-81-89467-35-7

ధనిష్ఠ